CHANDAMAMA (Telugu) FEBRUARY 1971 Regd. No. M. 4854




శివపురాణం



# శివపురాణం

సృష్టికి పూర్వం ప్రపంచం జలమయమై, పదార్థశూన్యమై, అంధకారంలో ఉండగా జలం నుంచి ఒక మహా తేజస్సు పుట్టింది. కాలక్రమాన అది జ్యోతిర్లింగ స్వరూపం దాల్చింది. అదే పరమేశ్వరుడైన శివుడు. ఆ జ్యోతిర్లింగం యొక్క అర్ధభాగం నుంచి మహాశక్తి పుట్టింది. ఆ మహాశక్తినే ప్రకృతి అనీ, మహామాయ అనీ పిలుస్తారు.

కాలక్రమాన పరమేశ్వరీ పరమేశ్వరులు మహావిష్ణువును సృష్టించారు. మహావిష్ణువు నాభి నుండి మహాపద్మం పుట్టింది. అది అనేకవేల యోజనాల నిడివి గలిగి మహా ఆశ్చర్యకరంగా ఉన్నది. ఆ మహాపద్మంలో అయిదు ముఖాలతో బ్రహ్మ పుట్టాడు. ఆ బ్రహ్మతో బాటే సరస్వతి పుట్టింది.

ప్రపంచమంతా జలమయంగా ఉండటం గమనించి బ్రహ్మ తనకు జన్మస్థానమైన మహాపద్మం అంతు తెలుసుకోవాలని ఊర్ధ్వా అధోలోకాల మధ్య అనేక ప్రయాణాలు చేసి తిరిగి పద్మగర్భం చేరుకున్నాడు. బ్రహ్మ ఓంకారాన్ని జపించగా దాని ఫలితంగా విష్ణువు బ్రహ్మ ఎదట ప్రత్యక్షమయాడు. తానే సృష్టిలో మొదటివాణ్ణి అనుకుంటున్న బ్రహ్మ విష్ణువును చూసి, "ఎవరు నువు? ఇక్కడి కెందుకు వచ్చావు?" అని అడిగాడు.

"సృష్టి చేయటానికి నిన్ను నా నాభి కమలం నుంచి పుట్టించాను. నేను విష్ణువును," అన్నాడు విష్ణువు.

బ్రహ్మ అహంకరించి, "నీ ప్రగల్భాలు కట్టి పెట్టు. లేదా నాతో యుద్ధానికిరా. నేను స్వయంభువును, జగత్కర్తను," అన్నాడు.

అప్పుడు విష్ణువు ధ్యానించగా పరమేశ్వరుడు జ్వాలాలింగ రూపంలో బ్రహ్మ విష్ణువుల మధ్య ప్రత్యక్షమయాడు. అప్పుడు విష్ణువు బ్రహ్మతో, "దీని ఆద్యంతాలు

అట్ట చివరి బొమ్మ



మనిద్దరిలో ఎవరు కనుక్కుంటె వారు గొప్ప," అన్నాడు. బ్రహ్మ అందుకు సమ్మతించాడు. కాని ఆ ప్రయత్నంలో ఇద్దరూ ఓడిపోయి యథాస్థానికి తిరిగి వచ్చి, పరమేశ్వరుణ్ణి ప్రార్థించారు.

పరమేశ్వరుడు వారి ఎదట ప్రత్యక్షమై, "నువు పంచభూతాత్మకమైన ప్రపంచాన్ని సృష్టించటానికి గాను ఈ విష్ణువు యొక్క నాభికమలం నుంచి సృష్టించబడినవాడివి. అందుచేత సృష్టి ఆరంభించు," అని బ్రహ్మతో అన్నాడు.

బ్రహ్మ పరమేశ్వరుణ్ణి చూసి, "నువు ఎవడివి? నాతో సమంగా నీకు అయిదు ముఖా లెందుకున్నాయి? నేను సృష్టికర్తను గనక నాకు అయిదు ముఖాలుండటం సమంజసం!" అన్నాడు.

ఆ మాటలు విని పరమేశ్వరుడు రుద్రావతారం దాల్చి, తన ఎడమచేతి చిటికెనవేలి గోరును కత్తిగా ఉపయోగించి, బ్రహ్మకున్న అయిదు తలలలో ఒకటి ఖండించేశాడు. దానితో బ్రహ్మ గర్వం మాని, రక్షించమని పరమేశ్వరుణ్ణి ప్రార్థించాడు.

పరమేశ్వరుడు రౌద్రం వదిలి శాంతం వహించి, "ఓ బ్రహ్మ, సృష్టించటానికి నువ్వూ, నీ సృష్టిని రక్షించటానికి ఈ విష్ణువూ సృష్టించబడ్డారు. నేను లయకారకుడైన శివుడుగానూ, రుద్రుడుగానూ, ఈశ్వరుడుగానూ పిలవబడతాను. జ్వాలాలింగాన్నే పార్థివలింగమనీ, శివలింగమనీ పూజించండి," అని చెప్పి ఆ జ్వాలాలింగంలో ఐక్యమయాడు.

తరవాత బ్రహ్మ విష్ణువు నుంచి వేదం మొదలయినవి తీసుకుని, పద్మాసనం మీద కూర్చుని ఓంకారాన్ని జపిస్తూ ఉండగా, నీటి మీద తేలుతూ ఒక గుడ్డు బ్రహ్మ కేసి వచ్చింది. బ్రహ్మ దాని కేసి ఆశ్చర్యంగా చూశాడు. అంతలో ఆ గుడ్డు నుంచి 'ఓం' అనే శబ్దం బయటికి వచ్చింది. అది వచ్చిన మార్గాన బ్రహ్మ ఆ అండంలో ప్రవేశించాడు. అందులో గాఢాంధకారంగా ఉన్నది. బ్రహ్మ అక్కడ తన శరీరాన్ని విసర్జించి,



చతుర్ముఖుడుగా తిరిగి పుట్టాడు. బ్రహ్మ అండం నుంచి బయటికి వచ్చినప్పుడది రెండుగా చీలి, కింది భాగం భూమిగానూ, పై భాగం ఆకాశంగానూ ఏర్పడింది; నీరు ఇంకిపోయింది.

ఇది చూసి బ్రహ్మ చాలా సంతోషించి భూమి మీద సమస్త చరాచరాలను సృష్టి చేయ నారంభించాడు. బ్రహ్మ సృష్టి చేసిన మొదటి వాళ్ళు సనకసనందనాదులు. వాళ్లు సృష్టి చేసే ఆసక్తి లేక, పరమేశ్వరుణ్ణి ధ్యానిస్తూ తపస్సు చేసుకునేటందుకు వెళ్ళి పోయారు. అది చూసి బ్రహ్మ గట్టిగా ఏడ్చాడు. ఆయన కన్నీరు భూమి మీద పడగా అందులో నుంచి గొప్ప తేజస్సుతో శివుడు పుట్టాడు. అతను తెల్లగా ఉండి, దశదిశలనూ వెలిగిస్తూ ఉండటం చూసి బ్రహ్మ, " ఎవరు నువు? " అని అడిగాడు.

"నేను శివుణ్ణి, రుద్రుణ్ణి," అన్నాడు శివుడు.

అప్పుడు విష్ణువు ప్రత్యక్షమై, "బ్రహ్మా! నువు సృష్టించి నేను పోషించే చరాచరాలను లయం చెయ్యటానికి పరమేశ్వరుడే ఈ శివుడి రూపంలో పుట్టాడు," అన్నాడు.

బ్రహ్మకు సత్యలోకమూ, విష్ణువుకు వైకుంఠమూ, శివుడికి కైలాసమూ వాస స్థానాలుగా ఏర్పాటయాయి. అందుచేత బ్రహ్మ సత్యలోకానికి వెళ్ళి, తనకు సహాయంగా ఉండటానికిగాను, మరీచి, కశ్యప, దక్ష, గౌతమ, వసిష్ఠ, కర్దమ మొదలైన తొమ్మిదిమంది ఉపబ్రహ్మలను సృష్టించాడు.

వీరిలో దక్షుడికి అరవైనలుగురు కుమార్తెలు కలిగారు. ఆ కుమార్తెలలో అదితి మొదలైన పదిమందిని కశ్యపుడు పెళ్ళాడి పిల్లలను కన్నాడు. అదితికి ఇంద్రుడు మొదలైన దేవతలు పుట్టారు; దితికి దైత్యులు పుట్టారు; వినతకు గరుత్మంతుడూ, అనూరుడూ పుట్టారు; కద్రువకు సర్పాలు పుట్టారు; స్వసకు యక్ష, రాక్షసులు పుట్టారు.

శివుణ్ణి పెళ్ళాడటం కోసం మహేశ్వరి దక్షుడికి సతి అనే కుమార్తెగా పుట్టింది. వారిద్దరికి వివాహం జరిగినప్పుడు బ్రహ్మ,

విష్ణువూ, ఇంద్రుడు మొదలైన దేవతలూ వచ్చి, సతీశివులను అనేక విధాల స్తోత్రం చేశారు. వచ్చినవారి కందరికీ గౌరవ మర్యాదలు చెయ్యటానికి నందీశ్వరుణ్ణీ, కాల భైరవుణ్ణీ నియమించి, శివుడు సతీసమేతుడై కైలాసానికి వెళ్ళి సుఖంగా ఉన్నాడు.

కొంత కాలం గడిచింది. అనేకమంది మహామహులు ప్రయాగ అనే నగరంలో గొప్ప యాగం తలపెట్టి, బ్రహ్మ విష్ణు మహేశ్వరులనూ, ఇంద్రాది దేవతలనూ పిలిచి, యాగం ప్రారంభించారు.


యజ్ఞానికి వచ్చిన వారికి వసతులు ఏర్పాటు చేసి, మహర్షులు వారివారికి తగిన ఆసనాలు చూపి కుర్చోబెట్టారు. అందరూ కూర్చుని యజ్ఞాన్ని చూస్తూండగా దక్షుడు తన శిష్యులతో సహా వచ్చాడు. అప్పుడు సభలోని వారందరూ లేచి దక్షుడికి ఎదురు వెళ్ళి పలకరించి తీసుకువచ్చి కూర్చోబెట్టారు. దక్షుడు సభ నంతా కలయజూసి, బ్రహ్మ విష్ణులకు నమస్కారం చేసి, తన అల్లుడైన శివుడు లేవలేదనీ, తనను పలకరించలేదనీ గమనించి సభవారితో, "మీరందరూ లేచి వచ్చి నన్ను గౌరవించారు. ఈ ఈశ్వరుడు నాకు అల్లుడైన కారణం చేత, లేవక, నన్ను పలకరించక నిర్లక్ష్యం చేశాడు. ఇతనికి చిన్నా పెద్దా తారతమ్యం తెలీదు," అని తన శిష్యులతో సహా వెళ్ళిపోసాగాడు.

అది చూసి బ్రహ్మ, విష్ణువూ మొదలైన వాళ్ళు దక్షుడికి అడ్డం వెళ్ళి, "అతను ఈశ్వరుడు. పరమేశ్వరావతారుడు. అతన్ని నిందించటం తప్పు," అని చెప్పారు.

అప్పుడు నంది దక్షుడితో, "ఓ దక్ష, శివదూషణ చేసిన నీ శిరస్సు తెగి హోమ గుండంలో పడుగాక!" అని శపించాడు.

అది విని దక్షుడు అలిగి, "మీ రుద్ర గణాల వాళ్ళు వేదబాహ్యులై, ఆచార హీనులై, బూడిద పూసుకుని, పాషండులని పేరు తెచ్చుకుందురుగాక!" అని తిరిగి శపించాడు.

శివుడు యజ్ఞం పూర్తి అయే దాకా ఉండి, తన రుద్రగణాలను వెంటబెట్టుకుని కైలాసానికి వెళ్ళిపోయాడు.






శివపురాణం



# శివపురాణం

## 2

దక్షుడు తన శిష్యులైన భృగువు మొదలైన ఋషులను వెంటబెట్టుకుని తన ఆశ్రమానికి వచ్చి వాజపేయ మనే యజ్ఞం చేశాడు. ఆయనకు శివుడి మీద చాలా కోపంగా వున్నది. అందుచేత ఈ వాజపేయంలో శివుడికి హవిర్భాగం లేకుండా చేశాడు.

అప్పటికీ దక్షుడికి శివుడి పైన కోపం చల్లారలేదు. అందుచేత ఆయన "బృహస్పతి యజ్ఞం" అనే మహాయజ్ఞం తలపెట్టి దానికి దేవతలనూ, మహర్షులనూ ఆహ్వానించి, వచ్చిన వారిని సత్కరించటానికి తన శిష్యులనూ, బంధువులనూ నియోగించాడు. ఇందులోకూడా ఆయన శివుడికి భాగం ఇవ్వ దలచలేదు.

ఈ యజ్ఞానికి విశ్వదేవతలూ, మరుత్తులూ, పితృగణాలూ, అప్సరసలూ, గంధర్వ, సిద్ధ, విద్యాధర, కిన్నర, యక్షులూ, కస్యప, అగస్త్య, అత్రి, భృగు, మరీచి, నారద, పరాశరాది మహర్షులూ వచ్చారు. బ్రహ్మ విష్ణులు తప్ప మిగిలినవారంతా దక్షుడికి భయపడే వచ్చారు. వచ్చినవారి కందరికీ విడుదులు ఏర్పాటు చెయ్యటానికి విశ్వకర్మ నియోగించబడ్డాడు.

దక్షుడు యజ్ఞదీక్ష వహించి, భార్యాసమేతుడై యాగశాల ప్రవేశించి, సభావందనం చేశాడు. పిలవని కారణంగా శివుడు ఆ సభలో లేడు. బ్రహ్మ విష్ణువులు పిలిచినా రాలేదు. అనేకమంది దేవతలతోనూ, మహర్షులతోనూ నిండి ఉన్న ఆ సభలో శివభక్తులైన మరీచీ, దధీచీ, భృగుడూ మొదలైన మహర్షులు సభను కలయజూసి, "ఓ దక్షా, ఈ సభకు సతీదేవినీ, శివుణ్ణీ పిలవలేదా? వాళ్ళు ఇక్కడ ఎందుకు లేరు?" అని అడిగారు.



దానికి దక్షుడు, "శివుడు కర్మభ్రష్టుడు. అందుచేత అతన్ని పిలవలేదు. అతను అపవిత్రుడు, కపాలధారి, శ్మశానవాసి, ప్రేతగణాలకు ప్రభువు," అన్నాడు.

ఈ శివదూషణ విని దధీచి, "దక్షా, ఈ యాగం నెరవేరదు. శివుడు లేకుండా ఈ యాగం తలపెట్టి నువు అపదనూ, విచారాన్నీ కొనితెచ్చుకుంటున్నావు. ఈ యాగానికి వచ్చినవారు కూడా దుఃఖిస్తారు," అనివామదేవుడూ, మరీచీ, గౌతముడూ, శిలాదుడూ మొదలైన అనేకమంది ఋషులతో సహా సభ నుండి వెళ్ళిపోయాడు.

దక్షుడు అలా వెళ్ళిపోయినవారిని గురించి సభలో నిలిచి ఉన్నవారితో, "వాళ్ళు పాషండులు, శఠులు. వాళ్ళు వెళ్ళిపోవడమే మంచిది. అందుచేత మీ రేమీ విచారించక, నా యజ్ఞాన్ని పూర్తిచెయ్యండి," అన్నాడు.

ఈ లోపల కైలాసపర్వతం మీద శివుడితో సుఖంగా కాపరం చేస్తున్న సతి ఒకనాడు తన చెలికత్తెలతో ఉద్యానంలో విహరిస్తూ, ఆకాశాన అనేక విమానాలు పోతూండటం చూసింది. ఆ విమానాలు ఎక్కడికి పోతున్నాయో కనుక్కోమని సతీదేవి తన చెలికత్తెలను అడిగితే వాళ్ళు వెళ్లి వచ్చి, దక్షుడు చేస్తున్న యజ్ఞానికి వాళ్ళంతా వెళుతున్నట్టు చెప్పారు.

సతీదేవికి తాను కూడా తన భర్తతో సహా తన తండ్రి చేసే యజ్ఞానికి పోవాలని కోరిక కలిగింది. ఆమె శివుడి వద్దకు వెళ్ళి, "మా నాన్న యజ్ఞం చేస్తున్నాడట. దేవగణాల వాళ్ళంతా వెళుతున్నారు. మనం కూడా రుద్రగణాలను తీసుకుని అక్కడికి వెళదాం," అన్నది.

దానికి శివుడు, "సతీ, మన మీద నీ తండ్రికి ద్వేషం. అందుచేత మనని పిలవకుండానే యజ్ఞం చేస్తున్నాడు. పిలవని పేరంటానికి పోరాదు. పోతే మనకు అవమానం జరుగుతుంది. తరవాత ఆపదలు కలుగుతాయి," అన్నాడు.

"అలా అయితే, మీరు రావద్దు. నేను ఒక్కత్తెనే పోతాను. నా వాళ్ళు నన్నెందుకు

అవమానిస్తారు? నా తండ్రికి తోచకపోతే నేనైనా చెప్పి, మిమ్మల్ని పిలిచేటట్టు చేస్తాను. నందీశ్వరుడు మొదలైనవాళ్ళను సహాయం ఇచ్చి నన్ను పంపండి," అన్నది సతీదేవి.

"సతీ, నిన్ను విడిచి నేను క్షణం ఉండలేను. నువు నన్ను విడిచి మీ తండ్రి చేసే యజ్ఞానికి వెళ్ళిపోతున్నావు. నీకు తప్పక అవమానం జరుగుతుంది, ప్రమాదం కలుగుతుంది. రాబోయేది కాస్త ఆలోచించు." అని శివుడు సతీదేవితో అన్నాడు.

కాని సతీదేవి శివుడి మాటలలో ఉన్న నిజం తెలుసుకోలేక పోయింది; తన తల్లిదండ్రులు తనను అవమానిస్తారని ఊహించలేక ఆమె పుట్టింటికి వెళ్ళాలని పట్టుపట్టింది.

ఎలా జరగవలసి ఉంటే అలా జరుగుతుందనుకుని శివుడు రుద్రగణాలను తోడిచ్చి సతీదేవిని దక్షయజ్ఞం చూడటానికి పంపించాడు. ఆమె నందీశ్వరుణ్ణి కూడా వెంటబెట్టుకుని యజ్ఞశాల వద్దకు చేరేసరికి, ఆమె తల్లి ప్రసూతీ, సహోదరులూ ఎదురు వచ్చి కుశల ప్రశ్నలు చేశారు. సతీదేవితో ఆమె తల్లి రహస్యంగా, "మీ నాన్నకు ముసలితనం వచ్చేసింది. ఆయన నీ భర్తను తిడుతున్నాడు. నువ్వేమీ పట్టించుకోకు," అని చెప్పి, ఆమెను యజ్ఞశాలలోకి తీసుకుపోయింది.



దక్షుడికి తన కుమార్తెను చూడగానే శివుడి మీద ఆగ్రహం పెరిగింది. ఆయన సతితో, "నీ మొగుడు శ్మశానవాసి, పిశాచాలను ఏలుతాడు, కపాలాలు ధరిస్తాడు, అపవిత్రుడు, యజ్ఞయాగాదులకు పిలవరానివాడు. అతని భార్యవై నువూ అపవిత్రురాలవయావు. నీ మొగుణ్ణి నేను పిలవలేదు, అతనికి యాగభాగం ఇవ్వటం లేదు. నువు ఈ యజ్ఞాన్ని అపవిత్రం చెయ్యటానికి వచ్చావా?" అన్నాడు.

సతీదేవి ఈ మాటలు విని తండ్రితో, "యజ్ఞకర్త అయిన శివుడికి హవిర్భాగం లేకుండా యజ్ఞం చేస్తున్నావు; పైగా ఆయనను దూషిస్తున్నావు. ఇప్పటికైనా ఆయనను

పిలిపించి, యజ్ఞభాగం ఇచ్చి గౌరవించు! లేకపోతే నీ యజ్ఞం పూర్తి కాదు; నువ్వు నశిస్తావు!" అన్నది.

సభలో ఉన్న భృగువు మొదలైనవారు, ఆమె చెప్పినట్టు చేయమనీ, ఆమె అన్నది నిజమనీ దక్షుడికి హితం చెప్పారు.

దక్షుడు మరింత మండిపడి, "సతీ, నీ మొహం చూస్తే పాపం! నువ్వు యజ్ఞశాల నుంచి తక్షణం వెళ్ళిపో. పోకపోతే నిన్ను బలవంతాన గెంటిస్తాను," అని అరిచాడు.

సతీదేవికి హృదయం మండిపోయింది. భర్త మాట వినకుండా రావటం పొరపాటయిందని ఆమె గ్రహించింది. ఈ అవమానం పొంది భర్త దగ్గిరికి తిరిగి పోవటం ఇష్టం లేక, వచ్చే జన్మలో శివుడే భర్త కావాలని కోరుకుంటూ, యోగశక్తితో అగ్ని పుట్టించుకుని అందులో ప్రాణాలు వదిలింది.

ఇది చూసి నందీశ్వరుడు మొదలైన వాళ్ళు హాహాకారాలు చేస్తూ యజ్ఞశాల ప్రవేశించబోతే, భృగుమహర్షి అభిచారహోమం చేసి వారిని తరమగొట్టాడు.

నారదుడు మొదలైనవారు కొందరు కైలాసానికి వెళ్ళి శివుడితో జరిగిన సంగతి చెప్పారు. శివుడు క్రోధాగ్రహావేశుడై హుంకరిస్తూ తన జటను ఒకదాన్ని పెరికి పర్వతం మీద కొట్టాడు. అప్పుడా జట నుండి భద్రకాళీ, వీరభద్రుడూ పుట్టారు. వీరభద్రుడు వెయ్యి చేతులతో, నిడుపాటి కోరలతో, కోటి సూర్యుల కాంతితో మహారౌద్రాకారుడై ఉన్నాడు. అతను శివుడికి నమస్కరించి, "తండ్రీ, ఏమిటి నీ ఆజ్ఞ?" అన్నాడు.

"నాయనా, వీరభద్రా! నువ్వూ, భద్రకాళీ మీ గణాలతో సహా వెళ్ళి, దక్షయజ్ఞం ధ్వంసం చేసి, అందులో పాల్గొన్నవాళ్ళను దండించండి!" అన్నాడు శివుడు.

వీరభద్రుడు సింహాలను పూన్చిన రథం ఎక్కి, నందీశ్వర, చండీశ్వర, భైరవాది గణాలను వెంటబెట్టుకుని బయలుదేరాడు. భద్రకాళి సింహాన్ని ఎక్కి, మహాకాళీ, గౌరీ, కాత్యాయినీ, చాముండా మొదలైన మహాశక్తి గణాలను వెంటబెట్టుకుని బయలుదేరింది.





# శివపురాణం

## 3

దక్షుడి యాగాన్ని ధ్వంసం చెయ్యటానికి శివుడి ఆజ్ఞతో భద్రకాళీ, వీరభద్రుడూ గణాలను వెంట బెట్టుకుని బయలు దేరేసరికి, అక్కడ దక్షుడు యాగం చేసే చోట ఉత్పాతాలు కలిగాయి. ఉల్కలు రాలాయి. రక్త వర్షం కురిసింది. ఆకాశం నుంచి పాములూ, తేళ్ళూ, క్రిమికీటకాలూ పడ్డాయి. యాగశాలలో ఉన్న వాళ్ళు కొందరు దక్షుణ్ణి తిట్టారు. మరి కొందరు ప్రాణాలకు వెరిచి పారిపోయారు.

ఈ లోపల వీరభద్ర గణాలవాళ్ళు యాగ శాలను చుట్టుముట్టి, బయటికి వచ్చేవారిని బాధించసాగారు. వీరభద్రుడు తన ప్రముఖ అనుచరులతో యాగశాల ప్రవేశించాడు. వాళ్ళందరూ లోపల ఉన్న దేవతలనూ, ఋషులనూ చావ బాదసాగారు. దక్షుణ్ణి చూడగానే వీరభద్రుడికి తన తండ్రి అయిన శివుడి దుఃఖం జ్ఞాపకం వచ్చి ఎక్కడలేని రౌద్రమూ వచ్చింది. అతను దక్షుడి తలను నరికి హోమగుండంలో హోమం చేశాడు.

తరవాత వీరభద్రుడు ఋత్విక్కులనూ, దేవతలనూ, యాగశాలలో ఉన్న మిగిలిన వాళ్ళనూ చూసి, ''ఈశ్వర ద్రోహి అయిన దక్షుడు చేసే యాగానికి వచ్చినందుకు ఫలం అనుభవించండి.'' అని వారిని నానా హింసలూ పెట్టాడు.

దక్షుడి భార్య అయిన ప్రసూతి, ఇతరులూ వచ్చి వారిని ప్రార్థించి శాంతపరిచారు. అప్పుడు భద్రకాళీ వీరభద్రులు తమ తమ సేనలతో కైలాసపర్వతానికి వెళ్ళి, శివుడికి నమస్కరించి నిలబడ్డారు.

ఈలోపుగా, వీరభద్రుడు మొదలైన వాళ్ల చేత చావు దెబ్బలు తిన్న దేవతలూ, ఋషులూ బ్రహ్మ వద్దకు వెళ్ళి జరిగినది

అట్ట చివరి బొమ్మ



చెప్పారు. బ్రహ్మ వారందరినీ వెంట బెట్టుకుని వైకుంఠానికి వెళ్ళి విష్ణువుతో, వీరభద్రుడు దక్షుడి తల నరికి హోమగుండంలో వెయ్యటమూ, దక్షయాగం విధ్వంసం కావటమూ మొదలైన వివరాలన్నీ చెప్పాడు. అందరూ కలిసి కైలాసపర్వతానికి వచ్చారు. వారు వచ్చేసరికి శివుడు ధ్యానసమాధిలో ఉన్నాడు. ఆయన చుట్టూ వీరభద్రుడు మొదలైన వాళ్ళూ, గణాలవాళ్లూ ఉన్నారు.

శివుడు సమాధి చాలించి బ్రహ్మ విష్ణులనూ, దేవతలనూ, ఋషులనూ చూసి, అందరినీ కూర్చోమని చెప్పాడు.

విష్ణువు శివుడితో, "సదాశివా, కోపాన్నీ, విచారాన్నీ వదిలి పెట్టు. ప్రకృతి మాయలో పడకు. నిన్ను ద్వేషించినందుకు దక్షుడు ఫలితం అనుభవించాడు. కాని దక్షుడు ప్రారంభించిన యాగం పూర్తి కాకపోతే ప్రపంచానికి అనావృష్టి కలిగి, చాలా నాశనం జరుగుతుంది. అందుచేత నువు దక్షుణ్ణి బతికించి, అతని యాగాన్ని పూర్తి చేయించు," అన్నాడు.

శివుడు అందుకు సమ్మతించి, "మన మందరమూ వెళ్ళి దక్షుడి యాగం పూర్తి అయేటట్టు చేసి, లోకాలను కాపాడదాం," అన్నాడు. వాళ్ళు యాగశాలకు వెళ్ళేసరికి, యాగశాల బీభత్సంగా ఉన్నది. అగ్ని గుండంలో దక్షుడి తల రూపు లేకుండా పోయింది.

శివుడు వీరభద్రుడితో, "నువు ఉత్తర దిక్కుగా వెళ్ళి, ఉత్తరంగా తల పెట్టుకుని పడుకుని ఉన్న వాళ్ళ శిరస్సు నరికి తీసుకురా!" అని పంపాడు.

వీరభద్రుడు ఒక గొర్రెతలను నరికి తెచ్చాడు. దక్షుని మొండానికి ఆ గొర్రెతలను తగిలించి, దక్షుణ్ణి బతికించి, ఆయన చేత వేదోక్తంగా యాగం పూర్తి చేయించారు. ఈ సారి దక్షుడు శివుడికి కూడా భాగం ఉండేలాగు యాగం చేశాడు. తరవాత ఆయన శివుణ్ణి క్షమాపణ వేడుతూ, "నేను నీ గొప్పతనం తెలుసుకోలేక నిన్ను దూషించాను. నిన్ను దూషించిన ఆ తల

పోయింది. నీ దయవల్ల, నాకు బుద్ధితో కూడిన తల ఏర్పడింది. నా తప్పులు మన్నించి, నన్ను కాపాడు,'' అన్నాడు.

శివుడు దక్షుడి క్షమాపణను ఆమోదించి, ''దక్షా, కారణం లేక కార్యం పుట్టదు. నీ తప్పులను నేను క్షమించాను.'' అని, దక్షుణ్ణి వరం కోరుకో మన్నాడు.

అప్పుడు దక్షుడూ, ఆయన భార్యా మొదలైనవారు, దక్షయాగం జరిగిన చోటు దక్షవాటిక అనే పేరుతో ప్రసిద్ధం కావాలనీ, అది శివుడి నిలయంగా వుండాలనీ కోరారు. శివుడు అందుకు సమ్మతించి భద్రకాళీ వీరభద్రులతో, ''ఈ ప్రదేశానికి ఆగ్నేయంగా ఉండే గౌతమీతీరాన మీరు మీ గణాలతో నివసించండి,'' అన్నాడు. ఆయన భద్రకాళీ సహితంగా వీరభద్రుణ్ణి గణాధిపతిగా చేసి, సతీదేవి శరీరాన్ని తీసుకుని, బ్రహ్మ విష్ణులతో సహా కైలాసానికి తిరిగి వచ్చి, బ్రహ్మ విష్ణులనూ, ఋషులనూ పంపివేసి, సతీదేవి శరీరాన్ని పక్కన ఉంచుకుని, తపస్సులో మునిగిపోయాడు.

దక్షుడి కుమార్తెలలో స్వధ అనే ఆమె పితృదేవతలకు భార్య అయి, మేనకా, ధన్యా, కళావతీ అనే ముగ్గురు కుమార్తెలను కన్నది. వాళ్ళు చాలా అందగత్తెలు; అందరి కోరికలూ తీర్చుతూ, లోకాలన్నీ తిరుగుతూ ఉండేవారు.



ఒకసారి వారు ముగ్గురూ మహాలక్ష్మీ విష్ణువులను చూడబోయి, వారిని తమ నృత్యగానాలతో ఆనందపరిచి, కూర్చుని కబుర్లు చెబుతూండగా అక్కడికి బ్రహ్మ మానసపుత్రులైన సనకసనందనాదులు వచ్చారు. వారిని చూసి విష్ణువుతో సహా అందరూ ఎదురు వెళ్లి, నమస్కారాలు చేసి గౌరవించారు, కాని మేనకా, ధన్యా, కళావతులు మాత్రం ఆసనాల నుంచి లేవలేదు.

అది చూసి సనత్కుమారుడు కోపించి, ''మీకు గర్వం బాగా ఎక్కిపోయింది. మీరు స్వర్గంలో ఉండతగరు. భూలోకంలో వారిని పెళ్లాడి, అక్కడే ఉండిపొండి.'' అని ఆ ముగ్గురినీ శపించాడు.

అప్పుడు వాళ్ళు పశ్చాత్తాప పడి, ''మునీశ్వరులారా, అజ్ఞానం చేత చేసిన మా తప్పు క్షమించి, మాకు శాపవిమోచనం అనుగ్రహించండి!'' అని వేడుకున్నారు.


దానికి సనకసనందనాదులు, ''గర్వానికి ప్రాయశ్చిత్తం గర్వం పోవటమే. ఇక శాపం మాట అంటారా? ఈ శాపం లోకాలకు మేలు కలిగించేదే,'' అన్నారు. (ఇది ఎలా నిజమయిందంటే, ఈ ముగ్గురికీ పుట్టిన కుమార్తెలు మూడు యుగాలలో అవతార పురుషులను పెళ్ళాడారు. మేనకకు పుట్టిన పార్వతి శివుణ్ణి పెళ్ళాడింది. జనకమహారాజుకూ, ధన్యకూ కుమార్తె అయిన సీత రాముణ్ణి పెళ్ళాడింది. వృషభుడికీ, కళావతికీ పుట్టిన రాధ కృష్ణుణ్ణి పెళ్ళాడింది.)

ఈ సంగతి తెలుసుకుని ఆ ముగ్గురు కన్యలూ తృప్తి పడి, విష్ణువు వద్ద సెలవు పుచ్చుకుని వెళ్ళిపోయారు.

హిమాలయానికి రాజైన హిమవంతుడు చాలా అందమైనవాడు. అతను తన కొండ పైన గల ఆశ్రమాలన్నీ తిరుగుతూ, అక్కడ తపస్సు చేసుకునే దేవతల యోగక్షేమాలూ, మహాఋషుల యోగక్షేమాలూ శ్రద్ధగా విచారిస్తూ ఉండేవాడు. అందుచేత వాళ్లు అతనికి మేనక నిచ్చి వివాహం చేయించారు.

ఒకనాడు హిమవంతుడి వద్దకు బ్రహ్మ, విష్ణువూ, దేవేంద్రుడూ, ఇతర దేవతలూ వచ్చారు. హిమవంతుడు వారికి షోడశోపచారాలూ చేసి, వచ్చిన పని అడిగాడు.

''మహాశక్తి దక్షుడికి సతి అనే కుమార్తెగా పుట్టి, శివుణ్ణి పెళ్ళాడి, శరీరం త్యజించింది. శివుడు సతి పోయాక విరక్తితో తపస్సు చేసుకుంటున్నాడు. ఇప్పుడు తారకాసురు డనేవాడు రాక్షసులకు రాజై లోకాలను క్షోభ పెడుతున్నాడు. మహాశక్తి తిరిగి జన్మించి, శివుణ్ణి పెళ్ళాడి, ఒక కొడుకును కనే దాకా తారకుడు ఇలా లోకపీడ చేస్తూనే ఉంటాడు. అందుచేత నువ్వూ, మేనకా ఆ మహాశక్తిని గురించి తపస్సు చేసి, ఆమె మీకు కుమార్తెగా పుట్టేలాగు వరం పొందండి,'' అని దేవతలు హిమవంతుణ్ణి హెచ్చరించారు.





శివపురాణం



# శివపురాణం

## 4

పరదేవతను గురించి తపస్సు చేసి, ఆమె తమ కుమార్తెగా పుట్టేటట్టు వరం పొందమని మేనకా హిమవంతులకు చెప్పి, బ్రహ్మ విష్ణు మహేంద్రాదులు వింధ్యపర్వతానికి వెళ్ళి, అక్కడ తపస్సు చేస్తున్న మహాదేవిని స్తోత్రం చేశారు.

కాంతులు అన్నిదిశలా విరజిమ్మే కిరీటం ధరించి, వెయ్యి చేతులతో త్రిశూలం మొదలైన ఆయుధాలు ధరించి పరదేవత వారి ముందు ప్రత్యక్షమయింది. అప్పుడు బ్రహ్మాదులు ఆమెతో, "తల్లీ, నువు దక్షుడి కుమార్తెగా జన్మించి, సతి అనే పేరుతో శివుణ్ణి వివాహమాడి, దక్షుడి మీది కోపంతో సతీ దేహాన్ని విడిచేశావు. సతీ వియోగంతో విరక్తుడై శివుడు తపస్సులో మునిగిపోయాడు. అందుచేత తారకాసురుడు మొదలైన వాళ్ళు యథేచ్ఛగా లోకాలను పీడిస్తున్నారు. కనుక, ఇప్పుడు నువు మేనకా హిమవంతుల కడుపున పార్వతిగా పుట్టి, శివుణ్ణి పెళ్ళాడి, లోకాలను కాపాడాలి," అన్నారు.

మహాదేవి బ్రహ్మ విష్ణు మహేంద్రుల కోరిక తీర్చుతానని మాట ఇచ్చి అంతర్హితురాలయింది.

ఈలోపల మేనకా హిమవంతులు బ్రహ్మ మొదలైన వారి హితాన్ని అనుసరించి, వారు సూచించిన విధంగా తపోనియమం దాల్చి, చైత్ర శుద్ధ పాడ్యమినాడు ప్రారంభించి ఇరవైఏడు వారాలపాటు అమిత భక్తితో పరదేవతను పూజించారు. పరదేవత సంతోషించి, వారి ఎదట ప్రత్యక్షమై వరం కోరమన్నది.

అప్పుడు మేనకా హిమవంతులు, "తల్లీ, నీ మూలంగా మేము తరించాం. మాకు



బలశౌర్య గుణాఢ్యులైన నూరుమంది కొడుకులను ప్రసాదించి, మా గర్భవాసాన కుమార్తెవుగా పుట్టి, లోకరక్షణార్థం శివుణ్ణి పెళ్ళాడి, మాకు శాశ్వతమైన కీర్తిని కలిగించు!" అని కోరారు.

పరదేవత వారి కోరికలు తీరుస్తానని వరమిచ్చి అంతర్ధానమయింది.

మేనకా హిమవంతులు తమ ఇంటికి తిరిగి పోయి సుఖంగా ఉన్నారు. కాలక్రమాన మేనక గర్భవతి అయి, అయిదు గ్రహాలు ఉచ్చలో ఉన్న సమయంలో మైనాకుడనే కొడుకును కన్నది. అతని తరవాత వరుసగా మరి తొంభైతొమ్మిదిమంది కొడుకులు కలిగారు. వారి తరవాత మేనక తిరిగి గర్భం దాల్చి, తొమ్మిదిమాసాల పదిహేను రోజులకు, అరుద్రా నక్షత్రం గల చైత్ర శుద్ధ నవమినాడు, పార్వతిని కన్నది. ఆ సమయంలో దిక్కులు వెలిగాయి. దేవతలు పుష్పవృష్టి కురిపించారు. బ్రహ్మ, విష్ణువు, దేవేంద్రుడు మొదలైన వాళ్ళు పరదేవతను స్తోత్రం చేశారు.

పార్వతి పుట్టటం నీలకాంతి గల శరీరచ్ఛాయతోనూ, నాలుగు చేతులతోనూ, లలాట నేత్రంతోనూ కాళిక ఆకారంతో పుట్టింది. అది చూసి మేనక, ఆమెను మామూలు మానవ శిశువు రూపం ధరించమని ప్రార్థించింది. అప్పుడామె మామూలు శిశువుగా మారి ఏడవ నారంభించింది.

తనకు కుమార్తె కలిగిందన్న వార్తవిని హిమవంతుడు పరమానంద భరితుడై, పురోహితులనూ, బ్రాహ్మణులనూ వెంటబెట్టుకుని పురిటింటికి వచ్చి, పచ్చకర్పూరపు దీపాలు వెలిగింప జేసి, కస్తూరీ జలం చల్లించి, నృత్యగానాలు ఏర్పాటు చేసి, బ్రాహ్మణుల చేత ఆశీర్వచనం చేయించి, వారికి ధనమూ, ధాన్యమూ, బంగారు అభరణాలూ, పట్టుపీతాంబరాలూ ఇచ్చి, కొడుకులతోనూ, కూతురితోనూ సుఖంగా జీవించసాగాడు.

పార్వతి క్రమంగా పెరిగి పెద్దదవుతున్నది. ఆమె చెలికత్తెలతో ఆడేది. మదించిన



సింహాలను ఎక్కి కొండలన్నీ తిరిగేది. గుహలలోనూ, ఇసుకతిన్నెల మీదా దాగుడుమూతలాడేది. తాను తల్లి అయినట్టూ, తన చెలికత్తెలు పిల్లలయినట్టూ వాళ్ళకు పళ్ళు పంచిపెట్టేది. బంతులతో ఆడేటప్పుడు ఒక బంతిని తన స్నేహితురాళ్ళకు చూపి, "ఇది బ్రహ్మాండం! దీన్ని నేను ఇలా ఆడిస్తాను!" అనేది. బొమ్మలతో ఆడేటప్పుడు వాటికి బ్రహ్మ, విష్ణూ, మహేశ్వరుడూ అని పేరు పెట్టి, "నేను వీళ్ళను ఆడిస్తున్నాను" అనేది. బొమ్మరిల్లు కట్టుతూ, తాను బ్రహ్మననీ, దాన్ని కాపాడుతూ తాను విష్ణువుననీ, దాన్ని కూలదోస్తూ తాను మహేశ్వరుణ్ణనీ అనేది.

ఈ విధంగా పార్వతి బాల్యం వెళ్ళబుచ్చి, విద్యాభ్యాసం ప్రారంభించి, సకల విద్యలూ నేర్చుకున్నది. ఆమె అస్తమానమూ పరమేశ్వరధ్యానం చేస్తూ, సామగానంతో స్తుతి చేస్తూ, నిత్య సంతోషిగా కాలం గడిపేది. అలాంటి సమయంలో చెలికత్తెలు "పార్వతీ" అని పిలిస్తే పలికేది కాదు, "శివాణీ" అని పిలిస్తే వెంటనే పలికేది. ఎప్పుడూ సింహాన్ని ఎక్కి తిరిగేది. అలా తిరిగేటప్పుడు ఒక్కొసారి ఆమె చేతిలో విల్లూ, బాణాలూ, శూలమూ మొదలైన ఆయుధాలు కనిపించేవి. ఆమె మరొక వాహనాన్ని ఎక్కటం గాని, ఇతర ఆయుధాలు ధరించటంగాని ఎన్నడూ చెయ్యలేదు. ఒక్కొక్కప్పుడు వీణ వాయిస్తూ ఆనందించేది. విద్యాధరలను మించి పాడేది, నృత్యం చేసేది. శివుడి రూపం చిత్రించి తన చెలికత్తెలకు చూపేది.

ఇలా ఉండగా ఒకనాడు నారదమహాముని హిమవంతుణ్ణి చూడ వచ్చాడు. హిమవంతుడు నారదుడికి ఎదురు వెళ్ళి, పూజించి, తీసుకు వచ్చి కూర్చోబెట్టి, పార్వతిని పిలిపించి, ఆమెచేత నారదుడికి నమస్కారం పెట్టించి, తన ఒళ్ళో కూర్చోబెట్టుని, "ఈ పిల్లకు ఎలాటి భర్త వస్తాడో చూడండి." అన్నాడు.

నారదుడు పార్వతి చేతిలో గజ, మత్స్య, అంకుశ, రథరేఖలు చూసి, "హిమవంతా,

నీ కూతురి చేతిలో పరదేవత లక్షణాలున్నాయి. ఈమె మూలంగా మీకు గొప్ప కీర్తి వస్తుంది. లక్ష్మీ సరస్వతులతో సమమైన గౌరవ పూజలు ఈమెకూ జరుగుతాయి. ఈమెకు తగిన భర్త శివుడే. అందు చేత, ఎలాటి ఇతర ఆలోచనలూ చెయ్యక, ఈ పిల్లను శివుడి కిచ్చి వివాహం చేసెయ్యండి," అన్నాడు.

నారదుడు వెళ్ళిపోయాక హిమవంతుడు మేనకతో, "మనం శివుడికి భార్యకాగల కుమార్తెను ప్రసాదించమని పరదేవతను ప్రార్థించాం. దానికీ, నారదుడు యిప్పుడు మనకు చెప్పి పోయిన దానికీ సరిపోయింది," అన్నాడు.

మేనక సంతోషించి, "మన పార్వతికి పెళ్ళి యీడువచ్చింది. అందు చేత యిక ఆలస్యం లేకుండా పెళ్ళి ప్రయత్నం చెయ్యండి," అన్నది.

"శివుడు సతిపోయాక, ఆమె శరీరాన్ని మూపున వేసుకుని ప్రపంచమంతా తిరుగుతూ గంగాసాగర సంగమం వద్ద కాళీఘట్టంలో నృత్యం చేస్తూ ఉండగా, విష్ణువు తన మాయచేత సతిని కాళీరూపంలో అక్కడ స్థాపన చేయించి, శివుడికి జ్ఞానం ఉపదేశించాడట. అప్పుడు శివుడు వైరాగ్యంపొంది, వీరాసనం వేసుకుని తపస్సులో లీనమైపోయాడు. అయితే శివుడు భక్తవత్సలుడు. తపస్సుతో ఆయనను సాధించవచ్చు. అందుచేత మనం పార్వతి చేత శివుణ్ణి గురించి తపస్సు చేయించుదాం!" అని హిమవంతుడు మేనకతో అన్నాడు.

ఆ ప్రకారమే ఆ తల్లిదండ్రులు పార్వతిని శివుణ్ణి గురించి పట్టుదలతో తపస్సు చేయ నియమించారు.

తరవాత మేనకా హిమవంతులు పార్వతీ సమేతులై శివుడు తపస్సు చేసుకుంటున్న కైలాసానికి వెళ్ళారు. ఆయన చుట్టూ గణాధిపతులు ఆయుధాలు ధరించి నిలిచి ఉన్నారు. కొందరు శివుడి సపర్యలు చూస్తున్నారు. హిమవంతుడు శివుడి సమీపానికి వెళ్ళటానికి రుద్రగణాల వాళ్ళు అనుమతించారు.



CHANDAMAMA (Telugu) MAY 1971 Regd. No. M. 4854




శివపురాణం



# శివపురాణం

## 5

హిమవంతుడు భార్యా సహితంగా శివుడికి సాష్టాంగ నమస్కారం చేసి, పూలూ, చందనమూ మొదలైనవి సమర్పించి, చేతులు జోడించుకుని నిలబడ్డాడు. శివుడు కళ్ళు తెరిచి చూసి, "హిమవంతుడా, నువు మహాపవిత్రుడవు. అందుచేతనే నీకు చెందిన ఈ కైలాసశిఖరాన తపస్సు చేసుకుంటున్నాను," అన్నాడు.

"మహాత్మా, నువు ఇక్కడ తపస్సు చేసుకోవటం నా భాగ్యం. ఇక్కడ తపస్సు చేసుకుంటున్న నీకు ఎలాటి విఘ్నమూ కలగకుండా నేను చూస్తూనే ఉన్నాను," అన్నాడు హిమవంతుడు.

శివుడు సంతోషించి, హిమవంతుణ్ణి ఏదన్నా వరం కోరుకోమన్నాడు.

"నా కుమార్తె పార్వతి నీకు పరిచర్యలు చెయ్యటానికి ఉత్సాహపడుతున్నది. ఆమె అలా చేయటానకి అనుమతించు," అన్నాడు హిమవంతుడు.

"తపస్సు చేసుకునే వారికి స్త్రీల పరిచర్యలు తగవు. కావాలంటే నువు వచ్చి పరిచర్యలు చేసి వెళుతూ ఉండు," అన్నాడు శివుడు.

"నా కుమార్తె కన్యక, మహాదేవి వరాన పుట్టింది. నీ వంటి విరాగికి ఆమెవల్ల తపోభంగం ఎలా కలుగుతుంది? నా కోరికను మన్నించి, నా కుమార్తె పరిచర్యలు స్వీకరించు," అన్నాడు హిమవంతుడు.

శివుడు సరేనన్నాడు.

సతీదేవి పోయాక శివుడు కైలాసపర్వతానికి వచ్చి తపస్సు ప్రారంభించిన తరవాత ఒకసారి శివుడి తపస్సుయొక్క వేడికి ఆయన నుదుటి నుంచి ఒక చెమట బిందువు భూమి మీద పడింది. అప్పుడా బిందువు

అట్ట చివరి బొమ్మ



నుంచి ఒక కుమారుడు పుట్టాడు. అతను ఆజానుబాహువు, ఎర్రని శరీరచ్ఛాయ గలవాడు, స్థూలకాయుడు. భూదేవి ఆ కుమారుణ్ణి ఎత్తుకుని శివుడి వద్దకు తెచ్చి చూపింది.

శివుడు భూదేవిని చూసి, "నువు ధన్యురాలవు. నా చెమట నుంచి పుట్టిన ఈ కుమారుడు భౌము డనే పేరుతో నీకు కీర్తి తెస్తాడు," అన్నాడు.

భౌముడు పెరిగి పెద్దవాడై, కాశీపట్టణం చేరి, అక్కడ ఈశ్వరుణ్ణి గురించి ఘోర తపస్సు చేశాడు. ఈశ్వరుడు ప్రత్యక్షమై భౌముడికి గ్రహమండలంలో స్థానం కలిగించాడు. ఆ భౌముడికే కుజు డనీ, అంగారకు డనీ కూడా పేర్లు వచ్చాయి.

శివుడు తపస్సు చేసుకునే కాలంలోనే గంగ భూమికి అవతరించింది. భూలోకంలో నీరు లేదని ఋషులూ, పితృదేవతలూ మొరపెట్టుకోగా, బ్రహ్మ తన కమండలం లోనుంచి ఒక నీటిబిందువును వదిలాడు. అది మహా ప్రవాహమై భూమి కేసి రాసాగింది. దానివల్ల భూలోకానికి కలిగే అపాయం గ్రహించి శివుడు ఆ ప్రవాహాన్ని తన జటాజూటంలో బంధించి, ఒక్క బొట్టును మానస సరోవరంలోకి వదిలి, తిరిగి తపస్సు ప్రారంభించాడు.

ఈ సంగతి ఇలా ఉండగా, దక్షుడి కుమార్తెలలో ఒకతె అయి, కశ్యపుడి రెండవ భార్య అయిన దితి హిరణ్యకశిపుణ్ణీ, హిరణ్యాక్షుణ్ణీ కనటమూ, వాళ్ళు మహా బలవంతులూ, క్రూరులూ అయి లోకాలన్నిటినీ పీడించటమూ, విష్ణువు వరాహ, నారసింహావతారాలెత్తి వారిని చంపటమూ జరిగింది. పుత్ర శోకంతో కుములిపోయే దితి కశ్యపుడి అనుగ్రహంతో మళ్ళీ గర్భం ధరించింది. తనకు మరొక ప్రబల విరోధి పుట్టబోతాడని భయపడి ఇంద్రుడు ఆమె గర్భంలోని పిండాన్ని తన వజ్రాయుధంతో ముక్కలు ముక్కలుగా నరికాడు. అయితే కశ్యపుడి అనుగ్రహం చేత పిండ ఖండాలు చావక, దితి కడుపున మరుత్తులుగా పుట్టి, ఇంద్రుణ్ణి సేవించటానికి వెళ్ళిపోయారు.



దితి నిరాశ చెంది తనకు పుత్రదానం చెయ్యమని కశ్యపుణ్ణి తిరిగి ప్రార్థించింది. బ్రహ్మను గురించి కొంతకాలం తపస్సు చెయ్యమని కశ్యపుడు ఆమెకు సలహా ఇచ్చాడు. దితి అలాగే చేసి, అనంతరం కశ్యపుడి అనుగ్రహంతో వజ్రకాయుడైన ఒక కొడుకును కన్నది. వాడి వజ్రకాయం చూసి తలిదండ్రులు వాడికి వజ్రాంగుడని పేరు పెట్టారు.

వజ్రకాయుడు పుట్టినప్పుడు ఉల్కాపాతాలూ, భూకంపాలూ, తుపాను గాలులూ కలిగాయి. దేవతలు భయపడ్డారు. దితి వజ్రాంగుణ్ణి చాలా గారాబంగా పెంచి పెద్దవాణ్ణి చేసి, "నాయనా, దేవతలు నాకు ఎంతో శోకం కలిగించారు. వాళ్ళు, నీ అన్నలైన హిరణ్యకశిపు, హిరణ్యాక్షులను విష్ణువు చేత చంపించారు. మరుత్తులు నా గర్భంలో ఉండగా ఇంద్రుడు నా గర్భాన్ని నరికాడు. నువు దేవతల మీద యుద్ధం చేసి నా పగ తీర్చు," అన్నది.

తల్లి ఇలా అన్నమీదట వజ్రాంగుడు రాక్షససేనలను చేర్చి, రణభేరీ వేయించి, దేవేంద్రుడి పట్టణాన్ని ముట్టడించి, దేవతలను చావగొట్టి, దేవేంద్రుణ్ణి బందీగా చేసుకుని స్వర్గాన్ని స్వాధీనం చేసుకున్నాడు. ఈ వార్త విని పరమానందభరితురాలయింది దితి.

దేవతలు బ్రహ్మ వద్దకు వెళ్ళి తమ అపజయాన్ని గురించి చెప్పుకున్నారు. బ్రహ్మ అంతా విని, కశ్యపుడితోసహా వజ్రాంగుడి వద్దకు వెళ్ళి, అతడికి మంచి మాటలు చెప్పి, ఇంద్రుణ్ణి విడిచిపుచ్చమనీ, స్వర్గాన్ని దేవతలకు తిరిగి ఇవ్వమనీ హితబోధ చేశాడు.

"నేను రాజ్యంకోసమూ, ధనంకోసమూ దేవతలతో యుద్ధం చెయ్యలేదు ఈ దేవేంద్రుడు దుర్మార్గుడు. వీడు నా తల్లి మనసు క్షోభ పెట్టాడు. ఆమె గర్భాన్ని ఖండాలుగా కోశాడు. వీడు విడిచిపుచ్చ దగినవాడు కాడు. అయినా మీరు చెప్పారు గనక విడిచిపుచ్చుతున్నాను. వీడు నా తల్లిని క్షోభ

పెట్టకపోతే నా వల్ల క్షోభపడి ఉండడు," అన్నాడు వజ్రాంగుడు.

ఈ మాటకు బ్రహ్మ ఎంతో సంతోషించి, వజ్రాంగుణ్ణి వరం కోరుకోమన్నాడు.

"నాకు పరబ్రహ్మస్వరూపమూ, భూత దయా తప్ప ఇంకేమీ అక్కర్లేదు. అవి రెండూ నాకు అనుగ్రహించండి," అన్నాడు వజ్రాంగుడు.

బ్రహ్మ మరింతగా సంతోషించి, వరాంగి అనే సౌందర్యవతి అయిన కన్యను వజ్రాంగుడికి భార్యగా ఇచ్చి వివాహం చేసి, కశ్యపుడు మొదలైన వారితోసహా వెళ్ళిపోయాడు. వజ్రాంగుడు శివభక్తుడై, సాత్వికస్వభావుడై, తన పట్టణానికి తిరిగి వచ్చి ఈశ్వరపూజ చేస్తూ జీవించసాగాడు.

కొంతకాలం గడిచింది. తన భార్య చేసే సేవలకు సంతోషించి వజ్రాంగుడు వరాంగితో, "నీకేం వరం కావాలో కోరు," అన్నాడు.


"మహా బలపరాక్రమవంతుడూ, దేవేంద్రుణ్ణీ, దేవతలనూ జయించగలవాడూ, ప్రపంచంలో తన కీర్తి శాశ్వతంగా నిలుపుకోగలవాడూ అయిన కొడుకు కావాలి," అన్నది వరాంగి.

భార్య ఇలా అనగానే వజ్రాంగుడు నొచ్చుకున్నాడు. వరాంగి స్త్రీ సహజమైన చపల చిత్తంతో దేవతా విరోధి అయిన కొడుకును కోరింది. అలాటివాణ్ణి విష్ణువు ఎంతోకాలం బతక నివ్వడు. అయితే వజ్రాంగుడికి మాట తప్పటం ఇష్టం లేదు. అందుచేత అతను బ్రహ్మను గురించి చాలాకాలం ఘోర తపస్సు చేశాడు.

బ్రహ్మ ప్రత్యక్షమై, "నీ తపస్సుకు మెచ్చాను. ఏం వరం కావాలో కోరుకో," అని వజ్రాంగుడితో అన్నాడు.

"మహాత్మా, నా భార్య దేవతలను జయించగల కొడుకును కోరుతున్నది. ఆమెకు అలాటి కొడుకు కలిగేలాగు వరం ఇయ్యి," అన్నాడు వజ్రాంగుడు.

అతను కోరిన వరం ఇచ్చి బ్రహ్మ అంతర్ధాన మయాడు. వజ్రాంగుడు ఇంటికి తిరిగి వచ్చి, భార్యతో ఆమె కోరిక తీరుతుందని చెప్పాడు.



CHANDAMAMA (Telugu) JUNE 1971 Regd. No. M. 4854




శివపురాణం



# శివపురాణం

## 6

వజ్రాంగుడు తనకు కొడుకు కలిగేటట్టు బ్రహ్మ వల్ల వరం పొంది ఇంటికి తిరిగి వచ్చిన కొంత కాలానికి, అతని భార్య అయిన వరాంగి గర్భవతి అయి, పదవ మాసంలో ఒకనాటి తెల్లవారు ఝామున ఒక కొడుకును కన్నది. త్రిలోక శూరుడైన ఆ కొడుకు పుట్టగానే భూమి కంపించింది, అన్నివైపులా అగ్నిజ్వాలలు లేచాయి. సముద్రాలు పొంగాయి. సుడిగాలి వీచి చెట్లు విరిగి పడ్డాయి. ఇలాటి ఉత్పాతాలు ఎన్నో చూసి జనం బెదిరిపోయారు.

వజ్రాంగుడూ, వరాంగీ తమ కొడుక్కు తారకుడు అని పేరు పెట్టుకుని, ఎంతో గారాబంగా పెంచసాగారు.

తారకుడు నానాటికీ బలం పెంచుకుని, పర్వతాకారం గలిగి, చూపరులకు భయంకరుడుగా తయారయాడు.

వరాంగి ఒకనాడు తారకుడితో, "నాయనా, నువు బ్రహ్మను గురించి తపస్సు చేసి, మూడులోకాలనూ జయించేలాగా వరాలు పొందు," అని హెచ్చరించింది.

తారకుడు సరేనని, ఒక నిర్జన ప్రదేశానికి వెళ్ళి, అక్కడ మహా దారుణమైన తపస్సు ప్రారంభించాడు. ఆ తపస్సు మూలంగా అతనిలో పుట్టిన వేడికి మూడులోకాలూ దగ్ధమయేటట్టు కనబడింది. అప్పుడు దేవతలూ, ఋషులూ బ్రహ్మ వద్దకు వెళ్ళి, "మహానుభావా, నువు వెళ్ళి ఆ తారకుడి చేత తపస్సు మాన్పించి, లోకాలను కాపాడు," అని వేడుకున్నారు.

బ్రహ్మ సరస్వతీ సమేతుడై హంస వాహనం మీద, తారకుడి వద్దకు వచ్చి, "తారకా, నీ తపస్సుకు మెచ్చాను. ఏం వరాలు కావాలో కోరుకో," అన్నాడు.



తారకుడు పరమానందంతో బ్రహ్మకు నమస్కారం చేసి, "ఓ బ్రహ్మదేవుడా, నువు వరాలిస్తాననగానే నా తపస్సు ఫలించింది. నాకు మూడులోకాలనూ జయించే శక్తిని ఇయ్యి. శివుడి వీర్యాన పుట్టిన వాడి వల్ల తప్ప నాకు మరెవరి వల్లా చావు లేకుండా వరమియ్యి. నాకు కావలసినవి ఈ రెండు వరాలే!" అన్నాడు.

బ్రహ్మ తారకుడికి అతను కోరిన వరాలిచ్చి సత్యలోకానికి వెళ్ళిపోయాడు. తారకుడు తన రాజధాని అయిన శోణితపట్టణానికి తిరిగి వచ్చి, తాను బ్రహ్మ వల్ల పొందిన వరాలను గురించి తన తల్లికీ, తమ గురువైన శుక్రాచార్యుడికీ చెప్పి, త్రిలోక దిగ్విజయానికి ముహూర్తం నిర్ణయించమని చెప్పాడు.

తారకుడు లోకాలమీద దాడి బయలుదేరటానికి శుక్రాచార్యులు ముహూర్తం పెట్టాడు. తారకుడు ఆ ముహూర్తానికి చతురంగ బలాలతో స్వర్గం మీద యుద్ధానికి వెళ్ళి, దేవతలను జయించి, ఇంద్రుడి చేత కానుకలు పుచ్చుకుని, అతడి సింహాసనాన్ని స్వాధీనం చేసుకున్నాడు. తరవాత తారకుడు వరుణుడి మీదికి యుద్ధానికి వెళ్ళి, జయించి, వరుణుడి రథాశ్వాలను కానుకగా పుచ్చుకుని, తరవాత యముడి పైకి వెళ్ళాడు. క్రమంగా ఒక్కొక్క దిక్కే అతనికి ఓడింది. దిక్పాలకుల నుంచి అంతులేని కానుకలు పొంది, తారకుడు తన రాజధానికి తిరిగి వచ్చి, సుఖంగా ఉన్నాడు.

ఒకనాడు నారదుడు తారకుణ్ణి చూడ వచ్చాడు. తారకుడు ఎదురు వెళ్ళి, పూజించి, నారదుణ్ణి తీసుకు వచ్చి, తన సింహాసనం మీద కూర్చోబెట్టి, "మహాత్మా, నీ దయవల్ల దిక్కులన్నీ జయించాను!" అన్నాడు.

ఆ మాట విని నారదుడు, "తారకా, బ్రహ్మ వల్ల వరాలు పొందిన నువు పది దిక్కులూ జయించటంలో విశేషం ఏమీ లేదు. నిన్ను చంపగల వాడు కూడా ఎవడూ లేడు. ఎందు చేతనంటే, నువు శివుడి

వీర్యాన పుట్టిన వాడిచేత తప్ప చావులేకుండా కూడా వరం పొందావు. శివుడేమో వైరాగ్యంతో తపస్సు చేసుకుంటున్నాడాయె. అందు చేత నువు నిజంగా త్రిలోక శూరుడి వని పేరు తెచ్చుకో గోరితే వెళ్ళి, వైకుంఠాన్ని జయించిరా!" అన్నాడు.

తారకుడు నారదుడి సలహాను పాటించి, తన సేనలతో వైకుంఠానికి బయలుదేరి వెళ్ళి, రణభేరి వేయించాడు. విష్ణువు తారకుడికి గల వరాలను తలచుకుని, అతన్ని చంపటం సాధ్యం కాదని గ్రహించి, తారకుడి వద్దకు వచ్చి, మంచి మాటలతో అతన్ని పంపివేశాడు.



అక్కడ కైలాసంలో, పార్వతి సపర్యలకు శివుడు ఒప్పుకున్నందుకు హిమవంతుడు సంతోషించి, పార్వతినీ, ఆమె చెలికత్తెలనూ తీసుకు వచ్చి, శివుడికి ప్రణామం చేయించి, శివుడితో, "ఈమె వల్ల సపర్యలు చేయించుకో. పొరపాట్లు జరిగితే క్షమించాలి," అని చెప్పి, పార్వతిని శివుడికి అప్పగించి, మేనకా సహితుడై తన ఇంటికి తిరిగి వెళ్ళిపోయాడు.

అది మొదలు పార్వతి ప్రతిరోజూ ఉదయం నుంచి మధ్యాహ్నందాకా శివుడికి పరిచర్యలు చేసి, ఆయనకు కావలసిన పూలూ, పళ్ళూ, నీరూ తెచ్చిపెట్టి, ఇంటికి వెళ్ళి, తాను శివుడికి చేసిన సేవలు ప్రతిరోజూ తన తల్లి దండ్రులకు చెబుతూ ఉండేది.

శోణితపురానికి తిరిగి వచ్చిన తారకుడు కొంతకాలం ఉండి, స్వర్గానికి సైన్యంతో సహా వెళ్ళి, దేవేంద్రుడి సింహాసనం మీద కూర్చుని, దేవతల చేత పరిచర్యలు చేయించుకుంటూ, లోకాలను బాధించసాగాడు. అతను ఋషుల యజ్ఞాలకు విఘ్నాలు కలిగించాడు; తపస్సులను సాగనివ్వలేదు.

దేవేంద్రుడు మొదలైన వాళ్ళు బ్రహ్మ వద్దకు వెళ్ళి, వరాలు పొందిన గర్వంతో తారకుడు తమను పెట్టే హింసలను గురించి మొరపెట్టుకున్నారు.

బ్రహ్మ తారకుడి వద్దకు వెళ్ళి, ''తారకా, నువు మూడులోకాలనూ జయించావు గద. నీ శోణితపురం నుంచే నువు లోకాలను పాలిస్తూ ఉండు. స్వర్గాన్ని దేవేంద్రుడికే ఉండనీ. నీకూ, దేవతలకూ మధ్య విరోధం దేనికి?'' అని హితం చెప్పాడు.

తారకుడు బ్రహ్మ మాట పాటించి, స్వర్గాన్ని ఇంద్రుడికి ఇచ్చేసి, తాను శోణిత పురానికి వెళ్ళి, అక్కడి నుంచే మూడు లోకాలనూ పాలించసాగాడు. అతను ఈశ్వరా రాధన చేస్తూ సుఖంగా ఉన్నాడు.

ఇంద్రుడు స్వర్గాన్ని తిరిగి పొంది కూడా, తాను మరొకడి అధికారం కింద పాలన చేయవలసి వచ్చినందుకు చాలా బాధపడి, తమ గురువైన బృహస్పతిని పిలిపించి, ''గురుదేవా, త్రిలోకాధిపతి అయిన నేను తారకుడి కింద సేవకుడుగా ఉండటం చాలా అవమానకరంగా ఉన్నది. ఇలాటి అవమానంతో బతికే కన్న, చావుమేలు. దీనికి విరుగుడు తారకుడి చావే. నీకు తెలియని ఆలోచనలు ఉండబోవు. ఈ తారకుడు చచ్చేమార్గం ఏదన్నా ఉంటే ఆలోచించి చెప్పు.'' అన్నాడు.

''మనం బ్రహ్మనే ఆలోచన అడగటం మంచిది. తారకుడి విజృంభణకు కారకుడు ఆయనే,'' అన్నాడు బృహస్పతి.

అందరూ కలిసి బ్రహ్మ వద్దకు వెళ్ళి, తారకుడు చచ్చే ఉపాయం చెప్పమని ఆయనను అడిగారు.

''శివుడి వీర్యాన పుట్టినవాడి చేతిలో తప్ప తారకుడికి చావు లేదు. నేను వాడికి అలా వరం ఇచ్చాను. సతీదేవి మరణంతో విరాగి అయి శివుడు కైలాసపర్వతం మీద తపస్సు చేసుకుంటున్నాడు. ఆ సతీదేవి హిమవంతుడికి కుమార్తె అయి పుట్టి, శివుడికి పరిచర్యలు చేస్తున్నది. ఆమె తన మనసులో శివుణ్ణి తన భర్తగా కోరుకుంటున్నది. మీరు ఎలాగైనా శివుడికి పార్వతి మీద మోహం కలిగేటట్టు చేసి, వారికి వివాహం జరిపించ గలిగితే, శివపార్వతులకు పుట్టే కొడుకు తారకుణ్ణి చంపుతాడు,'' అని చెప్పి బ్రహ్మ దేవతలను పంపేశాడు.



CHANDAMAMA (Telugu) JULY 1971 Regd. No. M. 4854




శివపురాణం



# శివపురాణం

## 7

శివపార్వతులకు పుట్టబోయే కొడుకు తారకుణ్ణి చంపుతాడని బ్రహ్మ చెప్పినందుకు సంతోషించి, దేవతలు స్వర్గానికి తిరిగి వచ్చి మన్మధుడికి కబురు పంపారు. మన్మధుడు వచ్చాడు. ఇంద్రుడు అతన్ని సింహాసనం మీద కూర్చోబెట్టి, "మన్మథా, తారకుడు బ్రహ్మ వల్ల వరాలు పొంది, మూడు లోకాలూ జయించి, దేవతలనూ, ఋషులనూ బాధించుతూ, తపస్సులూ, యాగాలూ జరగనివ్వకుండా ఉన్నాడు. నేను మూడులోకాలూ ఏలుతూంటే, తారకుడు నన్ను ఏలుతున్నాడు. ఈశ్వరుడి వీర్యాన పుట్టినవాడి వల్ల తప్ప అతనికి మరణం లేదు. ఈశ్వరుడేమో కైలాసంలో తపస్సు చేసుకుంటున్నాడు. పార్వతి అతనికి సపర్యలు చేస్తున్నది. పార్వతి శివుడి సమీపంలో ఉండగా నువు ఎలాగైనా సరే శివుడికి మోహం కలిగే లాగు చెయ్యాలి," అన్నాడు.

ఇంద్రుడి కోరిక విని మన్మధుడు భయపడి, "శివుడికి పార్వతి యందు మోహం కలిగేటట్టు చెయ్యటం నా తరమా? శివుడు గొప్ప తపశ్శాలి. కోపిష్టివాడు. మూడోకన్ను తెరిచాడంటే మూడులోకాలూ భస్మమవుతాయి," అన్నాడు.

మన్మధుడిలా అనేసరికి ఇంద్రుడు మొదలైనవాళ్ళు అతనికి ధైర్యం చెబుతూ, "అదేం మాట? మూడు లోకాలలోనూ నీకు లొంగని వారెవరున్నారు? నీ మూలాన స్త్రీ పురుషులు మోహాంధులు కావటం వల్లనే గదా సృష్టి కొనసాగుతున్నది? నీ పుష్పబాణాల తాకిడికి ఎలాటి తపస్సూ నిలవదు. పైగా ఇది దేవకార్యం. లోకరక్షణ నీ ద్వారా జరగవలసి ఉన్నది. నీకు సహా

అట్ట చివరి బొమ్మ



యంగా మలయమారుతాన్నీ, వసంతుణ్ణీ, శుక, పికాలనూ తీసుకుపో. మేము కూడా వచ్చి నీకు సహాయం చేస్తాం. శివుణ్ణి నీ బాణాలతో కొట్టి వశపరుచుకో," అన్నారు.

మన్మధుడు ఈ మాటలతో పొంగిపోయి, శివుణ్ణి జయించి, ఆయనకు పార్వతి పైన మోహం కలిగేటట్టు చెయ్యటానికి నిశ్చయించుకున్నాడు. అతను తన ఐదు పుష్పబాణాలను తీసుకుని, వసంతుణ్ణి వెంట బెట్టుకుని, చిలుక వాహనం మీద శివుడు తపస్సు చేసుకుంటున్న మారేడువనానికి వెళ్ళి, ఒక రహస్య ప్రదేశంలో దాగి, పార్వతి రాకకోసం ఎదురు చూడసాగాడు.

మన్మధుడు ప్రవేశించగానే మారేడువనం వసంత శోభతో నిండిపోయింది. చెట్లు చిగిర్చి, పూత పూశాయి. చిలుకలూ, గోరువంకలూ, కోకిలలూ పాడాయి. కొద్ది సేపట్లో పార్వతి తన చెలికత్తెలతో సహా మారేడు వనం ప్రవేశించింది. వాళ్ళు తమ వెంట పుష్పాలూ, ఫలాలూ, సుగంధ ద్రవ్యాలూ తెచ్చారు. వనం పూర్తిగా మారి ఉండటం చూసి ఆశ్చర్యపడుతూ పార్వతి శివు డున్న చోటికి వెళ్ళింది.

పార్వతిని శివుడు కన్నెత్తి చూశాడు. పార్వతి కొత్తగా కనబడింది. వన మంతా వింతగా కనబడింది. కాని శివుడు ఈ మార్పుకు కారణ మేమిటని ఆలోచించక, మళ్ళీ కళ్ళు మూసుకుని తపస్సులో మునిగిపోయాడు.

పార్వతి రోజులాగే శివుడికి షోడశోపచారాలూ చేసి, వందనం చేసి, ధ్యానిస్తూ శివుడి ఎదట నిలబడింది. అప్పుడు శివుడు ఆమెను మళ్ళీ చూసి, ఎన్నడూలేని మోహావేశం చెంది, అలాగే ఆమె కేసి చూస్తూ ఉండిపోయాడు.

పార్వతి శివుడి వద్ద శలవు పుచ్చుకుని వెనక్కు తిరిగి వెళ్ళి పోసాగింది. శివుడు మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు. ఆ సమయంలో మన్మధుడు తన పుష్పబాణాలను ఒకటొకటిగా శివుడి హృదయానికి గురి

చూసి కొట్టాడు. అరవిందమూ, అశోకమూ, చూతమూ, నవమల్లికా శివుణ్ణి కదిలించలేక పోయాయి. కాని మన్మధుడి అయిదో బాణ మైన నీలోత్పలం శివుడి హృదయాన్ని గాయ పరిచింది. దాని దెబ్బకు తాళలేక శివుడు ఆగ్రహావేశంతో, "ఎవడురా, నన్ను పుష్ప బాణాలతో కొట్టినవాడు?" అంటూ లేచి నిల బడి, మూడో కన్ను తెరిచాడు.

శివుడు మూడో కన్ను తెరవగానే అందులో నుంచి అగ్నిజ్వాలలు బయలుదేరి వన మంతా ఒక్క క్షణంలో బూడిద అయి పోయింది. దానితోబాటే మన్మధుడు కూడా బూడిద అయిపోయాడు.

దేవేంద్రుడు మొదలైన దేవతలు శివుడి ఎదటికి వచ్చి స్తోత్రపాఠాలు చదివి ప్రసన్నుణ్ణి చేసుకున్నారు. ఆయన తన మూడో కన్ను మూసి, అగ్నిజ్వాలలను ఉపసంహరించాడు. అప్పుడు, మన్మధుడి భార్య అయిన రతీదేవి శివుడి ఎదటికి వచ్చి, "సదాశివా, నా భర్త వల్ల ఏ తప్పూ లేదు. నీ వల్ల పార్వతికి కుమారుడు కలిగితే అతను తారకుణ్ణి చంపగలడన్న ఆశతో ఈ దేవేం ద్రుడు మొదలైనవాళ్ళు, నీకు పార్వతి మీద మోహం కలిగించమని నా భర్తను ప్రేరేపించారు. మా తప్పులు మన్నించి, నాకు పతిభిక్ష పెట్టు. పార్వతిని వివాహ మాడి, లోకాలను కాపాడు," అన్నది.

శివుడు రతీదేవితో, "మన్మధుడు బ్రహ్మ శాపం కారణంగా భస్మమయాడు. అతను బ్రహ్మను కూడా ఇలాగే పూలబాణాలతో కొట్టి



ఆయనకు కుమార్తెపై మోహం రేకెత్తించి, శాపం పొందాడు. కాని నీ పాతివ్రత్యానికి భంగం రానివ్వను. అతను లోకానికి శరీరం లేనివాడైనప్పటికీ, నీకు మటుకు శరీరంతోనే కనిపిస్తాడు. అతనికి యిప్పుడే ప్రాణం ఇస్తాను," అన్నాడు.

తరవాత శివుడు తపస్సు మాని కైలాసంలో తన రుద్రగణాలతో కొలువు తీరి, అగ్నిని పిలిచి, "అగ్నీ, ఇకముందు నువు వృక్షాలలోనూ, పర్వతాలలోనూ, సముద్రం లోనూ కనబడకుండా దాగి ఉండు," అని ఆదేశించాడు.

దేవేంద్రుడూ, దేవతలూ శివుడి వద్ద సెలవు పుచ్చుకుని వెళ్ళిపోయారు. శివుడి మనస్సు పార్వతిపై లగ్నమయింది. ఆయన పార్వతిని వివాహమాడ నిశ్చయించు కున్నాడు.

శివుడు తనాన్నీ, మన్మధుణ్ణీ భస్మం చేయటం కళ్ళారా చూసిన పార్వతి భయపడి తన చెలికత్తెలతో సహా పరిగెత్తుకుంటూ ఇంటికి తిరిగి వచ్చింది. జరిగినదంతా విని మేనకా హిమవంతులు తమ కుమార్తె పునర్జన్మ ఎత్తినట్టే భావించుకున్నారు. వాళ్ళు పార్వతిని ఊరడించి, ఆమె భయం పోగొట్టారు.

పార్వతి మటుకు శివుడి కోసం విరహం చెంది బాధపడసాగింది. ఆమెకు శివుడి ధ్యాస తప్ప మరొకటి లేదు. శివుడి కోసం నిద్రాహారాలు మాని తపించే తమ కూతురితో మేనకా హిమవంతులు, "నీకూ, శివుడికీ త్వరలోనే పెళ్ళి చేస్తాం, విచారించకు," అని చెప్పారు.

ఒకనాడు నారదుడు వచ్చి పార్వతితో, ఆమెను శివుడు పెళ్ళాడతాడని ధైర్యం చెబుతూ, శివపంచాక్షరీ మంత్రం ఉపదేశించి, దాన్ని జపించినట్టయితే ఎలాటి కోరికలైనా తీరుతాయనీ, సమస్త సుఖాలూ కలుగుతాయనీ చెప్పి, మేనకా హిమవంతుల వద్ద సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు.

తరవాత పార్వతి శివపంచాక్షరీ మహా మంత్రాన్ని జపించుతూ, శివధ్యానంలో నిమగ్నురాలయింది.



CHANDAMAMA (Telugu) AUGUST 1971 Regd. No. M. 4854




శివపురాణం



# శివపురాణం

## 8

నారదుడు చెప్పిన ప్రకారం పార్వతి తన చెలికత్తెలను వెంట బెట్టుకుని శృంగ తీర్థానికి వెళ్ళి, పంచాక్షరీ మహామంత్రం జపిస్తూ తీవ్రమైన తపస్సు చేయసాగింది. ఆమె ఒక్క ఆకు కూడా తినకుండా తపస్సు చేస్తూ ఉండటం చూసి, అక్కడి మునులు ఆమెను "అపర్ణ" అని పిలవ నారంభించారు.

ఒకనాడు మేనకా హిమవంతులు తమ కుమార్తెను చూడ వచ్చి, ఆమె శుష్కించి ఉండటం చూసి భయపడి, "అమ్మా, ఆహారం కూడా మాని ఎందుకు ఈ ఘోర తపస్సు చేస్తున్నావు? మన్మథుణ్ణి మసి చేసిన శివుడు నీ పట్ల అనుగ్రహిస్తాడా? అతను విరాగి, దయాహీనుడూ, ముక్కోపీనూ. అందని పండుకు ఎందుకు ఆశిస్తావు? ఇంటికి వచ్చెయ్యి," అన్నారు.

పార్వతి ఈ మాటలు విని, "మీరు మొదట నాతో ఏమన్నారు? శివుడికి నన్నిచ్చి పెళ్ళి చేస్తామనలేదా? నా తపస్సుతో నేను ఆయనను మీ అల్లుడుగా చేస్తాను. నా కోసం ఏ మాత్రం దిగులు పడక, మీరు ఇంటికి వెళ్ళి, సుఖంగా వుండండి," అని తన తల్లిదండ్రులతో అన్నది.

ఈ లోపుగా శివుడు పార్వతిని ఎలా పెళ్ళాడటమా అని మథనపడి పోతున్నాడు. అప్పుడు బ్రహ్మ, విష్ణు, దేవేంద్రాదులు శివుడి వద్దకు వచ్చి, అతని వల్ల మర్యాదలు పొంది, "మహేశ్వరా, నువ్వు పార్వతిని పెళ్ళాడి లోకాలకు మేలు చెయ్యవెందుకు? నీకు పుట్టిన కొడుకు చేత తప్ప చావు లేకుండా తారకుడు వరం పొంది ఉన్నాడు. వాడు చస్తేనే గాని లోకాలు సుఖపడవు," అన్నారు.

అట్ట చివరి బొమ్మ

ఈ మాటలకు శివుడు లోపల సంతోషించి కూడా, పైకి వారితో, "పెళ్ళాడితే తపస్సు సాగదు. మన్మథుణ్ణి జయించవచ్చు గాని స్త్రీల చూపుల బాణాలకు తట్టుకోవటం కష్టం. పార్వతితో గృహస్థాశ్రమం గడపటం కన్న తపస్సు చేసుకోవటమే మంచి దనుకుంటున్నాను," అన్నాడు.

ఇందుకు బ్రహ్మ మొదలైనవారు ఒప్పుకోక, గృహస్థాశ్రమమే గొప్పదనీ, భార్య లేనివాణ్ణి ఎవరూ గౌరవించరనీ, శివుడు గృహస్థుగా ఉంటూనే తపస్సు చేసి, రాజయోగిగా జీవించటం వల్ల లోకాలకు మేలు కలుగుతుందనీ హెచ్చరించారు.

వారు చెప్పినట్టే చేస్తానని మాట ఇచ్చి శివుడు బ్రహ్మ మొదలైన వారిని పంపేశాడు. కాని, అతనికి పార్వతిపై విరహం ఉన్నప్పటికీ, పార్వతి మనస్సు స్వయంగా తెలుసు కోవాలనిపించింది. అందుచేత ఆయన ముసలి యతి రూపం దాల్చి, దండమూ, కమండలమూ ధరించి, పార్వతి తపస్సు చేసుకుంటున్న చోటికి వెళ్ళాడు. పార్వతి ఆయన తేజస్సు చూసి, బ్రహ్మ విష్ణు మహేశ్వరులలో ఒకరై ఉంటాడనుకుని, ఆయనను పూజించి, స్వాగతమిచ్చి, "తమరు ఎవరు? నేను తపస్సుచేసుకుంటున్న ఈ తీర్థప్రాంతానికి ఎందుకు వచ్చారు?" అని అడిగింది.

"నేను బ్రహ్మవంశానికి చెందినవాణ్ణి. లోకాలక్షేమం చూస్తూ తిరుగుతూ ఉంటాను. నువ్వు ఎవరి కుమార్తెవు? దేనికోసం ఇలా



కఠోర తపస్సు చేస్తున్నావు?'' అని శివుడు ఆమెను అడిగాడు.

పార్వతి ఆయనతో, ''నేను మేనకా హిమవంతుల కుమార్తెను. నన్ను పార్వతి అని పిలుస్తారు. ఈశ్వరుడు కైలాసం మీద తపస్సు చేస్తూ ఉంటే నేను ఆయనకు పరిచర్యలు చేస్తూ ఉండేదాన్ని. అప్పుడు ఒకనాడు మన్మథుడు ఆయనను తన పంచ బాణాలతో కొట్టేసరికి, ఆయన మన్మథుణ్ణి తన ఫాలాగ్నితో దహించాడు. తరవాత నారదుడు పంచాక్షరీమంత్రం ఉపదేశం చగా, ఆ మంత్రాన్ని జపిస్తూ, శివుణ్ణి భర్తగా పొందటానికి ఇక్కడ తపస్సు చేస్తున్నాను. ఇంతగా తపస్సు చేసినా శివుడికి ఇంకా నా పైన అనుగ్రహం కలగలేదు. అందుచేత అగ్ని ప్రవేశం చేసి ఈ దేహం చాలించాలనుకుంటున్నాను.'' అని చెప్పింది.

శివుడు ఆమెతో, ''నువ్వు చాలా పొరపాటు చేస్తున్నావు. ఈశ్వరుడు విరాగి. తపస్సు చేసుకునేవాడు. నువ్వు నీ తపస్సుతో లోకాలకు ప్రమాదం కలిగించేకన్న ఇంటికి తిరిగి వెళ్ళి దేవతలలో ఒకణ్ణి వివాహం చేసుకోవటం మంచిది,'' అన్నాడు.

''ఇక మీరు వెళ్ళవచ్చు. నేను నా అభిప్రాయం మార్చుకోను,'' అన్నది పార్వతి చిరాకుపడి.

''అలాగే వెళతాను. కాని, వెళ్ళే ముందు నీకు కొంత హితం చెప్పాలి. శివుడు దరిద్రుడు, పట్టు బట్టలు కట్టడు, చర్మాలు



ధరిస్తాడు. ఎక్కి తిరగటానికి ఎద్దు తప్ప మంచి వాహనం లేదు. దయ్యాలనూ, భూతాలనూ వెంట వేసుకు తిరుగుతాడు. ఒంటికి గంధం పూసుకోడు, బూడిద పూసుకుంటాడు. అతన్ని పెళ్ళాడి ఏం సుఖపడతావు?" అన్నాడు శివుడు.

పార్వతికి తీవ్రంగా కోపం వచ్చింది. "నువ్వు దొంగ యతివి. జ్ఞానివని భ్రమపడ్డాను. శివుడు అష్ట ఐశ్వర్యాలు గలవాడు. శివదూషణ చేసినవారు ఏడు జన్మలపాటు దరిద్రం అనుభవిస్తారు," అని తన పరిచారికలను పిలిచి, "ఈ యతిని అవతలికి గెంటండి," అన్నది.

శివుడు నవ్వి, "పార్వతీ, నేను శివుణ్ణి. నీ మనసు తెలుసుకుందామని యతి వేషంలో వచ్చాను. నీ ఎడబాటుతో చాలా బాధపడుతున్నాను. నా వెంట కైలాసానికి వచ్చెయ్యి," అన్నాడు. పార్వతి చెయ్యి పట్టుకుని.


శివుని చేయి విడిపించుకొని చూసేసరికి పార్వతి కళ్ళకు అసలు శివుడే కనిపించాడు. ఆమె ఆయనకు క్షమాపణ చెప్పుకుని, "ఇలా నీ వెంట రావటం భావ్యం కాదు. నా తల్లిదండ్రుల అనుమతి పొంది, నన్ను వివాహం చేసుకుని, నీ వెంట తీసుకు వెళ్ళు," అన్నది.

ఆమె శివుడికి నమస్కరించి, తన పరిచారికలతో సహా తన ఇంటికి వెళ్ళిపోయింది. మేనకా హిమవంతులు జరిగిన సంగతి తెలుసుకుని సంతోషించి, పార్వతి వివాహానికి మంచి ముహూర్తం నిశ్చయించి, పెళ్ళి ప్రయత్నాలు ప్రారంభించారు.

శివుడు కూడా కైలాసానికి తిరిగి పోయి, ప్రమథగణాలతో, మన్మథుడు తనను పూల బాణాలతో కొట్టినది మొదలు తన మనసు పార్వతి మీద లగ్నమై, తపస్సు మీదికి పోవటం లేదని, పార్వతిని వివాహం చేసుకోగోరుతున్నానని, అందుకు సప్త మహర్షుల మధ్యవర్తిత్వం కావాలని అన్నాడు.

వెంటనే నందీశ్వరుడు బయలుదేరి వెళ్ళి, సప్త మహర్షులను వెంట బెట్టుకుని కైలాసానికి తిరిగి వచ్చారు.







# శివపురాణం

## 9

నందీశ్వరుడు శివుడు కోరిన ప్రకారం సప్త మహర్షులను వెంటబెట్టుకుని కైలాసానికి తిరిగి వచ్చాడు. వాళ్ళు శివదర్శనం కలిగి నందుకు సంతోషించి, "మా వలన కావల సిన కార్య మేమిటో సెలవిస్తే, చెయ్యటానికి సిద్ధంగా ఉన్నాము," అన్నారు.

"మహామునులారా, నేను పార్వతిని వివాహం చేసుకుని, గృహస్థుగా ఉండ నిశ్చయించాను. అందుచేత మీరు మేనకా హిమవంతుల వద్దకు వెళ్ళి, వారి కుమార్తె అయిన పార్వతిని నా కిచ్చి పెళ్ళిచేసే లాగు మంచి మాటలతో ఒప్పించి, ముహూర్తం పెట్టి, నా వివాహం జరిపించండి," అన్నాడు శివుడు సప్తమహర్షులతో.

సప్తమహర్షులు అందుకు సంతోషంగా ఒప్పుకుని హిమవంతుడు ఉండే చోటికి వచ్చారు. మేనకా హిమవంతులు వారికి ఆద రంతో అతిథిసత్కారాలు చేసి, "ఏ పని మీద మీరు మా గృహం పావనం చేశారో సెలవిస్తే, మీరు చెప్పినది చేస్తాం," అన్నారు.

దానికి సప్తమహర్షులు, "మేనకా హిమ వంతులారా! మీ అదృష్టం చాలా గొప్పది. సాక్షాత్తూ పరమేశ్వరే మీ కడుపున పార్వతిగా పుట్టింది. ఆమెను శివుడు ఇప్పుడు వివాహమాడ గోరుతున్నాడు. ఈ పెళ్ళితో మీ కీర్తి ముల్లోకాలు వ్యాపిస్తుంది," అన్నారు.

ఆ మాటలు విని మేనకా హిమవంతులు, "మహర్షులారా, మేము కూడా పార్వతిని శివుడికి ఇచ్చి పెళ్ళిచేయాలనే అభిప్రా యంతోనే ఉన్నాము. కాని నిన్న ఒక భిక్షువు మా వద్దకు వచ్చి, పార్వతిని శివుడికి ఇయ్యొ వద్దనీ, శివుడికి ఒక రాజ్యం గాని, సుఖం గాని, భోగం గాని లేవనీ, శ్మశానాలలో నివ సిస్తాడనీ, పాములను ధరించి, సరిఅయిన

అట్ట చివరి బొమ్మ



భోజనపాత్ర కూడా లేక కపాలంలో తిండి తింటాడని చెప్పి వెళ్ళిపోయాడు. అందుచేత పార్వతిని శివుడి కిచ్చి పెళ్ళిచేసే ఆలోచన మానుకున్నాం," అన్నారు.

ఈ మాట విని సప్తమహర్షులు అమితాశ్చర్యం పొంది, "ఆ భిక్షువు ఎవడో దుర్మార్గుడై వుంటాడు. శివపార్వతుల పెళ్ళి చెడగొట్టటానికి మీతో అలా చెప్పి ఉంటాడు. మీ కుమార్తె ఆ పరదేవత అవతారమని మరవకండి. ఈమె శివుడి భార్య కావటానికే మీ కుమార్తెగా పుట్టింది," అన్నారు.

వసిష్ఠమహాముని మేనకా హిమవంతులకు ఈ సందర్భంలో అనరణ్యు డనే రాజు కథ చెప్పాడు.

ఇంద్రసావర్ణి అనే పధ్నాలుగో మనువు వంశంలో అనరణ్యు డనే రాజు చక్రవర్తిగా రాజ్యపాలన చేసేవాడు. ఆయనకు రుచి అనే తపశ్శాలి పురోహితుడుగా ఉండేవాడు.

ఆ రాజుకు అయిదుగురు భార్యలూ, నూరుమంది కొడుకులూ, అందరి తర్వాత పద్మావతి అనే కుమార్తె ఉండేవారు. పద్మావతి గొప్ప సౌందర్యవతి. యౌవనం రాగానే అనరణ్యుడు ఆమెకు తగిన రాజకుమారుడి కోసం అన్వేషణ ప్రారంభించాడు.

ఇలా వుండగా ఒకనాడు పద్మావతి తన పరిచారికలతో సహా నదికి వెళ్ళి స్నానం చేస్తూండగా, పిప్పలాదు డనే మహాముని స్నానం కోసం అక్కడికే వచ్చాడు. పిప్పలాదుడు సామాన్యుడు కాడు, భృగువంశాన పుట్టినవాడు; దధీచి మహాముని కొడుకు.

అటువంటి పిప్పలాదుడు పద్మావతి అందం చూసి మోహించి, అనరణ్యుడి సభకు వెళ్ళి, తనకు పద్మావతిని భార్యగా ఇచ్చి వివాహం చెయ్యమని కోరాడు.

రాజుకు నోట మాట రాలేదు. రతీదేవి లాటి తన కుమార్తెను మన్మథుడి వంటి ఏ రాజకుమారుడికో ఇవ్వాలని ఆయన అనుకుంటూ వుండగా, ఈ ముసలివాడు ఎక్కడినుంచో ఊడిపడ్డాడు. "నా కుమార్తెను నీకు భార్యగా ఇవ్వను!" అంటే శపించి, వంశనిర్మూలనం చేస్తాడేమో!



ఇలా రాజు సంశయావస్థలో పడి కొట్టు కుంటూవుండగా రాజపురోహితుడూ, మంత్రులూ ఆయనకు ధైర్యం చెప్పి, ఇలా సలహా ఇచ్చారు :

"మహారాజా, పద్మావతి వంటి స్త్రీ ఈ మహాముని వంటి భర్తను పెళ్ళాడగోర వచ్చును. ఈయన గొప్ప వంశాన పుట్టిన వాడు, కులశ్రేష్ఠుడు. అలాటివాడికి కన్యను ఇవ్వటం గొప్ప విషయమే. ఈయనను పద్మావతికి చూపి ఆమె వివాహానికి అంగీక రించే పక్షంలో ఇద్దరికీ వివాహం చేసెయ్యి. ఆమె అంగీకరించని పక్షంలో ఈ మునీశ్వ రుడు వెళ్ళిపోతాడు."

అనరణ్యుడికి పెద్ద బెడద తీరింది. పిప్పలాదుణ్ణి చూసి పద్మావతి ఆయనకు భార్యకావటానికి సమ్మతించింది. అన రణ్యుడు వారిద్దరికీ పెళ్ళిచేసి గొప్ప కీర్తి సంపాదించుకున్నాడు.

వివాహం కాగానే పిప్పలాదుడు పద్మా వతిని తన వెంట ఋషిపల్లెకు తీసుకు పోయాడు. కుమార్తెపై గల ప్రేమచేత అన రణ్యుడు కూడా, తన రాజ్యాన్ని పెద్దకొడుకు పరం చేసి, అయిదుగురు భార్యలనూ వెంట బెట్టుకుని, కుమార్తె ఉన్న చోటికే వాన ప్రస్థం వెళ్ళాడు.

ఒకనాడు పద్మావతి నదిలో స్నానం చెయ్యటానికి వెళ్ళేసరికి, ధర్మదేవత నవ మన్మథుడైన యువకుడి రూపంలో ఆమె వద్దకు వెళ్ళి, "సుందరీ, నీ అందానికి తగినవాణ్ణి నేను. ఆ ముసలిభర్తతో కాపరం చేస్తూ నీ యౌవనాన్ని అడవిగాసిన వెన్నెల చేయక, నా వెంట నా రాజ్యానికి వచ్చి, మహారాణి లాగ జీవించు," అన్నాడు.

పద్మావతి ఆగ్రహావేశంతో, "నా భర్తను నిందించిన నువు క్షయమై పోవుదువుగాక!" అని శపించింది.

ధర్మదేవత అదిరిపడి, "అమ్మా, నేను రాజును కాను, ధర్మదేవతను! నీ పాతి వ్రత్యం పరీక్షించ వచ్చాను. నన్ను మన్నించి, శాపం ఉపసంహరించు," అని వేడుకున్నాడు.

పద్మావతి కూడా తెలియక చేసిన తప్పుకు నొచ్చుకుని, "శాపం ఉపసంహరించడం నాకు సాధ్యంకాదు. ఒక్కొక్క యుగంలో ఒక్కొక్క పాదాన్ని పోగొట్టుకుంటూ సంచరించు," అన్నది.

వసిష్ఠుడు పద్మావతి కథ చెప్పి, "మేనకా హిమవంతులారా, మీరు కూడా అనరణ్యుడు చేసినట్టే, మీ కుమార్తెను శివుడి కిచ్చి పెళ్లి చెయ్యండి," అన్నాడు.

మేనకా హిమవంతులు తృప్తిపడ్డారు. మైనాకుడు మొదలైన బంధువులు కూడా శివపార్వతుల వివాహానికి సుముఖులయారు.

అప్పుడు మేనకా హిమవంతులు పార్వతి చేతిని అరుంధతీ వసిష్ఠుల చేతిలో పెట్టి, "మీ యిష్టప్రకారమే ఈ పిల్లను శివుడి కిచ్చి వివాహం చేద్దాం. పెళ్ళికి ముహూర్తం నిశ్చయించండి," అన్నారు.

అరుంధతి పార్వతిని లోకమాత కమ్మని ఆశీర్వదించింది. మాఘ శుద్ధ ఏకాదశినాడు ఆరుద్రనక్షత్ర మందు వృశ్చికలగ్నం ముహూర్తం పెట్టి, ఆ రోజు తెల్లవారు ఝామున శివపార్వతుల పెళ్ళి జరపటానికి నిర్ణయం జరిగింది.

సప్తమహర్షులు శివుడి వద్దకు తిరిగి వచ్చి, పని సానుకూల మయిందని తెలిపారు. వారు పెళ్ళిపనులు చేయటానికి బ్రహ్మ, విష్ణు, ఇంద్రాదులను నియోగించమని సలహా ఇచ్చి వెళ్ళిపోయారు.

పార్వతి వివాహానికి కావలసిన ఏర్పాట్లన్నీ సక్రమంగా జరిగాయి. సంబారాలన్నీ సమకూర్చారు. హిమవంతుడు తన మంత్రుల చేత పనులన్నీ చేయించాడు. శుభలేఖలు బంధువు లందరికీ వెళ్ళాయి. పార్వతిని పెళ్ళికూతుర్ని చేయటానికి పట్టణంలో గల ముత్తయిదువు లందరూ వచ్చారు.

మంచి ముహూర్తం చూసి పార్వతికి మంగళస్నానం చేయించి, సాంబ్రాణి ధూపం వేసి, పట్టుబట్టలు కట్టబెట్టి, అలంకారాలు పెట్టి, ఆమెకు పునుగూ, జవ్వాదీ, హరిచందనమూ పూసి, నుదుట కస్తూరిబొట్టు పెట్టి, పుష్పహారాలు వేసి, పెళ్ళికూతుర్ని చేసి ఉత్సవం జరిపారు.



CHANDAMAMA (Telugu) OCTOBER 1971 Regd. No. M. 4854




శివపురాణం



# శివపురాణం

## 10

పార్వతీ కల్యాణం సందర్భంలో హిమవంతుడు పంపిన ఆహ్వానం అందుకుని, ఆయన బంధువులూ, మిత్రులూ సకుటుంబంగానూ, సపరివారంగానూ రావటం మొదలు పెట్టారు. వారు తమ వెంట బంగారు తామర పుష్పాలూ, ముత్యాలూ, మాణిక్యాలూ, పగడాలూ మొదలైన కానుకలు తెచ్చారు. వేరు వేరు పర్వతాల రాజులు నవరత్నాలనూ, చందనం మొదలు గాగల సుగంధ ద్రవ్యాలనూ, మదించిన ఏనుగులనూ, సైంధవాశ్వాలనూ కానుకలుగా తెచ్చారు. హిమవంతుడా కానుకలను స్వీకరించి, అతిథులకు గౌరవ మర్యాదలు చేశాడు, వారికి విడుదులు ఏర్పాటు చేశాడు.

వచ్చేవారికి విడుదులు తయారు చెయ్యటానికీ, పదివేల యోజనాల నిడివి గల కల్యాణ మంటపం నిర్మించటానికీ హిమవంతుడు విశ్వకర్మ సహాయం పొందాడు. హిమవంతు డుండే ఓషధీపురాన్ని అద్భుతంగా అలంకరించారు.

కైలాసంలో శివుడు, హిమవంతుడు పంపిన లగ్నపత్రిక అందుకుని సంతోషించి, వాయుదేవుణ్ణి పంపి నారదుణ్ణి పిలిపించాడు. నారదుడు వచ్చి, తనను పిలిపించిన కారణం అడిగాడు.

"నారదా, ఇంకా అయిదు రోజులలో నాకూ, హిమవంతుడి కూతురైన పార్వతికీ వివాహం జరగనున్నది. వ్యవధి ఆటే లేదు. నువు కామగమనం గల వాడివి గనక, మూడులోకాల వారినీ వివాహానికి ఆహ్వానించి రావాలి. కుబేరుడు మొదలైన వారితో పెళ్ళికి కావలసిన సరంజామా అంతా తీసుకు రమ్మని చెప్పాలి," అని శివుడు నారదుడితో అన్నాడు.

అట్ట చివరి బొమ్మ



నారదుడు అందుకు సంతోషంగా ఒప్పుకుని, శివుడి వద్ద సెలవు పుచ్చుకుని, బ్రహ్మ విష్ణు దేవేంద్రాది దేవతలతోనూ, భూలోకంలోనూ, నాగలోకంలోనూ ఉండే వారితోనూ, "మాఘ శుద్ధ ఏకాదశి నాటి రాత్రి తెల్లవారుఝామున శివ పార్వతులకు వివాహం జరుగుతున్నది. మీరందరూ రావాలి," అని చెప్పాడు. తరవాత ఆయన కుబేరుణ్ణి వెంట బెట్టుకుని, వివాహానికి కావలిసిన వస్తువులన్నిటితోనూ కైలాసానికి తిరిగి వచ్చాడు.

శివ పార్వతుల వివాహం చూడటానికి శివుడి ఆహ్వానం పొందిన బ్రహ్మవిష్ణువులూ, దేవేంద్రుడూ, ఇతర దేవతలూ, మహర్షులూ కైలాసానికి రాసాగారు. నందీశ్వరుడూ, రుద్రగణాల వాళ్ళూ అతిథులను గౌరవించి, వారికి తగిన ఇళ్ళూ, వసతులూ ఏర్పాటు చేశారు.

శివుడి పెళ్ళికి బ్రహ్మ పురోహితుడుగానూ, విష్ణువు బావమరిదిగానూ, ఇంద్రాది దేవతలూ, ఋషులూ సదస్యులుగానూ ఉండేటట్టు నిర్ణయమయింది. శివుడికి మంగళాభిషేకం చెయ్యటానికి బృహస్పతి ముహూర్తం నిర్ణయించాడు. ఆ ముహూర్తాన, గరుడ గంధర్వ యక్షస్త్రీలూ, సప్తమాతృకలూ, లక్ష్మి, సరస్వతి, శచీ, అరుంధతీ లాటి మహా పతివ్రతలూ శివుడి చేత స్నానం చేయించి, హరిచందనం లాటి పూతలు పూసి, కంఠహారాలు వేసి పెళ్ళికొడుకును చేశారు. గౌతముడూ, అత్రీ, భృగువూ మొదలైన మహర్షులు శివుడి కుడి చేతికి శాస్త్రోక్తంగా దీక్షాబంధం కట్టి, నవగ్రహ పూజలు జరిపించారు.

తరవాత బ్రహ్మ ఆజ్ఞాపించగా, శివుడు తన పక్షం వారి నందరినీ కలుపుకుని, మంగళ వాద్యాలతోనూ, నృత్యాలతోనూ ఓషధీపురానికి బయలుదేరాడు. కైలాసానికి రక్షకులుగా రుద్రగణాల నాయకులను ఉంచి, నందీశ్వరుడు ప్రమథగణాలనన్నిటినీ పెళ్ళికి తరలించుకు వచ్చాడు. వీరభద్రుడూ, చండీశ్వరుడూ, భైరవుడూ,

నందీశ్వరుడూ తమ తమ వాహనాల మీద బయలుదేరారు.

పెళ్ళి కొడుకైన శివుణ్ణి ఐరావతం మీద కూర్చోబెట్టారు. సరస్వతీ బ్రహ్మలు హంస మీదా, లక్ష్మి విష్ణువులు గరుడుడి మీదా, శచీ ఇంద్రులు కదిలే సింహాసనం మీదా ప్రయాణం చేశారు. కుబేరుడు నవనిధులతో శివుడి వెనక కూర్చున్నాడు. దేవతా స్త్రీలూ, ఋషిపత్నులూ, అప్సరసలూ దివ్య వస్త్రాలనూ, సుగంధ ద్రవ్యాలనూ తీసుకుని విమానాలలో బయలుదేరారు.

పెళ్ళివారు నగరం సమీపిస్తూ ఉండగా హిమవంతుడు తన పురోహితుడైన గర్గమహామునినీ, మేనకనూ, కొడుకులనూ వెంటబెట్టుకుని, మేళతాళాలతో ఎదురు వచ్చి, బ్రహ్మ విష్ణు దేవేంద్రులకూ, ఋషులకూ నమస్కారం చేసి, శివుడి ముందు చేతులు మోడ్చి నిలబడి, "సర్వేశ్వరుడవైన నీ వల్ల నేను గొప్పవాణ్ణి అయాను. పెళ్ళి కొడుకువై నా యింటికి వచ్చిన నీకు నా కుమార్తెనిచ్చి వివాహం చేస్తాను. నువు ఆమెను వివాహమాడి నన్నూ, నా వంశాన్నీ పవిత్రం చెయ్యవలసిందని ప్రార్థించుతున్నాను," అన్నాడు. ఆయన శివుడికి బట్టలూ, గంధ పుష్పతాంబూలాలూ ఇచ్చి, అందరికీ పాలూ, పానకాలూ ఇచ్చి, శ్రమ నివారణకు వింజామరలు వీయింపజేశాడు.



హిమవంతుడి పక్షపు స్త్రీలు శివుణ్ణి చూసి, "మన పార్వతి అదృష్టవంతురాలు! కోటి మన్మథులకు సమానమైన భర్త ఆమెకు లభించాడు," అనుకున్నారు. మేనక శివుడి ముందు చేతులు జోడించి, "సదాశివా, కిట్టనివాళ్ళు చెప్పిన మాటలు విని నిన్ను నిందించాను. నా తప్పు మన్నించి, మా ఇంటికి వచ్చి, మేము చేసే వరపూజలు గ్రహించి, మా పార్వతిని వివాహం చేసుకో," అన్నది. పెద్ద ముత్తయిదువులు వచ్చి శివుణ్ణి దీవించారు.

దారిపొడుగునా పుష్పాలూ, ముత్యాలూ, అక్షింతలూ చల్లుతూ, మేనకా హిమవంతులు శివుణ్ణి విడిదికి తీసుకుపోయి, వర

పూజ చేసి, పెళ్ళికొడుకు పరివారానికి ఏ లోటూ లేకుండా ఏర్పాటు చేసి, తమ ఇంటికి తిరిగి వచ్చారు.

కులాచారం ప్రకారం పార్వతి అంబిక ఆలయానికి వెళ్ళి, ఆ దేవిని పూజించింది. ముత్తయిదువులు వెంటరాగా పల్లకీ ఎక్కి పార్వతి ఆలయానికి వెళ్ళేటప్పుడు దేవతలు ఆమెను చూసి, "ఈమె పరదేవతే! ఈమెకూ, శివుడికీ పెళ్ళి జరిగితే మన కష్టాలు తీరుతాయి," అనుకున్నారు.


పార్వతి అంబికపూజ చేసి తిరిగి వచ్చే సరికి ముహూర్తం దగ్గిరపడింది. శివుణ్ణి ఐరావతం మీద కల్యాణమంటపానికి తీసుకు వచ్చి, పీటల మీద కూర్చోబెట్టారు. మేనకా హిమవంతులు అల్లుడి కాళ్ళు కడిగి, నెత్తిన చల్లుకున్నారు. వాళ్ళు పార్వతి చేతిని శివుడి చేతిలో పెట్టి కన్యాదానం చేశారు.

శివపార్వతుల పెళ్ళి అత్యంత వైభవంగా జరిగిపోయింది. దేవతలు శివుడి అనుమతి పొంది తమ తమ నివాసాలకు వెళ్ళిపోయారు. శివుడు హిమవంతుడి ఇంట చాలా కాలం ఉన్నాడు. ఆయనకు కైలాసానికి వెళ్ళి పోవాలనిపించి, నందీశ్వరుడి చేత మేనకా హిమవంతులకు ఆ మాట చెప్పించాడు.

మేనకా హిమవంతులు పార్వతిని శివుడి వెంట పంపటానికి సన్నాహాలన్నీ చేశారు. ఆమెకు బట్టలూ, పరిచారికలూ, గృహోప కరణాలూ, ఆమె ఎక్కి తిరిగిన సింహమూ మొదలైనవి అరణంగా ఇచ్చి, శివుడికి అప్ప గించి, "పార్వతిని ప్రేమగా చూసుకో," అని చెప్పారు. పెద్ద ముత్తయిదువులు పార్వతికి చెప్పవలసిన నీతులన్నీ చెప్పారు.

ప్రయాణానికి మంచి ముహూర్తం చూసు కుని, పార్వతితో సహా కైలాసానికి తిరిగి వచ్చి, మహర్షుల సహాయంతో శివుడు గృహ ప్రవేశం చేశాడు. మూడు రోజుల పాటు శివుడి ఇంట విందులు జరిగాయి. తరవాత బ్రహ్మ, విష్ణువూ, మిగిలినవారూ శివుడితో వెళ్ళివస్తామని చెప్పారు. శివుడు వారికీ, తన ఆహ్వానం అందుకుని వచ్చిన వారందరికీ తగిన కానుకలు ఇచ్చి గౌర వించి పంపేశాడు.





శివపురాణం



# శివపురాణం

## 11

పార్వతీ కల్యాణానికి వచ్చిన అతిథులంతా వెళ్ళిపోయారు. శివుడు నందీశ్వరుడితో, "నేనూ, పార్వతీ విశ్రమించి బడలిక తీర్చుకుంటాము. మహాసౌధాన్ని అలంకరింప జెయ్యి." అన్నాడు.

నందీశ్వరుడు గణాధిపతులను వెంట బెట్టుకుని మహాసౌధానికి వెళ్ళాడు. ఆ సౌధాన్ని శుభ్రం చేసి, పన్నీటితో కడిగారు. జవ్వాది మొదలైన పరిమళ వస్తువులతోనూ, ముత్యపు పొడితోనూ పద్మాల ముగ్గులు పెట్టారు. పగడాలతో తయారు చేసిన మంచం మీద హంసతూలికా తల్పాన్ని అమర్చారు. గోడలకు చిత్రపటాలు తగిలించారు. పానీయాలూ, తినుబండారాలూ, పువ్వులూ, ఫలాలూ ఉంచవలసిన చోట ఉంచారు. పడకగది ఎంతో అందంగా తయారయింది.

శయ్యాగృహం సిద్ధమయిందని వినగానే శివుడు నందీశ్వరుడు మొదలైన వారితో, "మేము వెళ్ళి పడుకుంటాము. మీరు ఎవరినీ లోపలికి రానివ్వక, భవనం అన్ని పక్కలా కాపలా కాయండి," అని చెప్పి, పార్వతిని చెయ్యి పట్టుకుని శయనించటానికి తీసుకుపోయాడు. వారు దాంపత్య సుఖాలలో మునిగిపోయారు.

ఈ లోపల దేవతలకు తారకాసురుడు పెట్టే కష్టాలు అంత కంతకూ మితిమీరి పోయాయి. వాళ్ళు బ్రహ్మ వద్దకు వెళ్ళి, "ఓ బ్రహ్మదేవుడా, నీ వరాల మూలంగా మేము నరకబాధలు పడుతున్నాము. తారకాసురుడు చస్తే గాని మాకు సుఖం లేదు," అని మొత్తుకున్నారు.

బ్రహ్మ వారితో, "నేను తారకుడికి అసాధారణమైన వరాలు ఇచ్చిన మాట

అట్ట చివరి బొమ్మ



నిజమే. కాని వరాలు ఇవ్వక ఎలా తప్పుతుంది? దుర్మార్గులైనా, సన్మార్గులైనా కూడా వరాలు ఇచ్చి తీరాలి. దుర్మార్గులనే ఉద్దేశంతో వరాలు ఇవ్వటం మానితే వాళ్ళు తపస్సు మానరు. వారి తపస్సు నుంచి పుట్టిన అగ్ని లోకాలను దహిస్తుంది. లోకాలను కాపాడటానికి వరాలిస్తున్నాను. ఆ వరాల సహాయంతో వాళ్ళు లోకాలను పీడిస్తున్నారు. ఆ కారణంగా వారిని చంపే అవసరం కలుగుతున్నది. మనం విష్ణువు వద్దకు వెళ్ళి కష్టాలు చెప్పుకుందాము," అన్నాడు.

అందరూ కలిసి విష్ణువు వద్దకు వెళ్ళి, తారకుడు పెట్టే బాధలను గురించి చెప్పుకున్నారు. విష్ణువు వారితో, "పార్వతీ పరమేశ్వరులు వివాహం చేసుకుని, దాంపత్య జీవితం గడుపుతున్నారు. వారికి కుమారుడు కలగగానే మీ కష్టాలు తీరిపోతాయి," అన్నాడు.

"శివ పార్వతుల దాంపత్యం ఆరంభమై చాలా కాలమయింది. ఇంకా వారికి కొడుకు పుట్టలేదు. నువు వచ్చి శివుణ్ణి చూసి మా గోడు ఆయనకు చెప్పాలని మా ప్రార్థన," అన్నారు దేవతలు విష్ణువుతో.

విష్ణువు బ్రహ్మాది దేవతలను వెంట బెట్టుకుని కైలాసానికి వచ్చాడు. శివుడి భవనం చుట్టూ నందీశ్వరుడు మొదలైన వాళ్ళు కాపలా ఉన్నారు. విష్ణువు నందీశ్వరుడితో, "మేము శివుణ్ణి చూడ వచ్చాము. మమ్మల్ని లోపలికి వెళ్ళనీ," అన్నాడు.

"శివ పార్వతులు లోపల ఏకాంతంలో ఉన్నారు. ఎవరినీ లోపలికి రానీయ వద్దని శివుడి ఆజ్ఞ. ఆయన ఆజ్ఞ పాలించటం మా విధి. మమ్మల్ని మన్నించాలి," అన్నాడు నందీశ్వరుడు విష్ణువుతో.

వాళ్ళంతా వచ్చిన పనికి విఘ్నం కలిగింది. అందుచేత విష్ణువు దేవతలతో, "పార్థివలింగాన్ని తయారు చేసి, శివ పంచాక్షరి జపిస్తూ పూజిస్తే, శివుడు ప్రసన్నుడై దర్శన మిస్తాడు," అంటూ సలహా ఇచ్చాడు.

దేవతలు మట్టితో పార్థివలింగాన్ని తయారు చేసి, పంచాక్షరీ యుక్తంగా షోడశోపచార పూజలు చేసి, "హరహర మహాదేవ శంభో!" అని గట్టిగా అరిచారు.

స్తోత్ర ప్రియుడైన శివుడు ఇది విని, పార్వతితో శృంగారాలు మాని, ఆమె ఆనందాన్ని భంగపరుస్తూ ద్వారం వద్దకు వచ్చి, "దేవతలారా, నన్ను ఎందుకు ప్రార్థిస్తున్నారు?" అని అడిగాడు.

బ్రహ్మ మొదలైన వాళ్ళు ఆయనతో, "ఈశ్వరా, తారకుణ్ణి చంపటానికి నీ వీర్యాన ఒక కొడుకును సృష్టించు," అన్నారు.

ఈ మాట వినగానే శివుడు తన వీర్యాన్ని అగ్ని గుండంలో విడిచాడు. పార్వతి ఇది చూసి అలిగి, దేవతలకు సంతాన ప్రాప్తి లేకుండా శపించింది.

శివుడి వీర్యాన్ని ధరించిన అగ్ని తాపంతో బాధపడసాగాడు. ఇంతలో సప్తమహర్షులు అగ్నిలో హోమాలు చేసి, పూర్ణాహుతి ఇచ్చారు.

ఆ సమయంలో అగ్ని సప్తమహర్షుల భార్యలను చూసి మోహించి, వారి కోసం విరహం పొందసాగాడు. ఈ విషయం అగ్ని హోత్రుడి భార్య అయిన స్వాహాదేవి తెలుసుకున్నది. ఆమె ఒక్కొక్క ముని భార్య రూపంలోనూ అగ్ని వద్దకు వచ్చి, అతనితో కూడింది. అరుంధతి రూపం



ధరించటం మటుకు ఆమెకు సాధ్యం కాలేదు. ఈ విధంగా స్వాహాదేవి శివుడి వీర్యాన్ని ఆరు భాగాలుగా తన గర్భాన ధరించింది.

ఇందువల్ల స్వాహాదేవికి భరించరాని వేదనకలిగింది. అందుచేత ఆమె ఆ వీర్యాన్ని కైలాసం మీద ఉండే ఒక శిఖరాన విసర్జించింది. వాయుదేవుడు ఆ వీర్యాన్ని గంగలో పడవేశాడు. గంగ దాన్ని ఒక ఒడ్డున ఉండే రెల్లుదుబ్బులలోకి నెట్టింది. అక్కడ ఆ వీర్యం పరిపక్వమై, మార్గశిర షష్ఠి, ధనిష్టా నక్షత్ర మందు, వృశ్చిక లగ్నాన ఒక పిల్లవాడుగా రూపొందింది. ఆ పిల్లవాడికి ఆరు ముఖాలూ,

పన్నెండు చేతులూ, వజ్ర శరీరమూ ఉన్నాయి. ఆ కుర్రవాణ్ణి అగ్నిహోత్రుడి వల్ల ఆరుగురు మునిభార్యలు కన్నారని లోకంలో వాడుక పుట్టింది. అది విని ఆ మహామునులు తమ భార్యలను వెళ్ళగొట్టటానికి పూనుకున్నారు. స్వాహాదేవి వచ్చి వారితో, "తప్పు నాది. మీ భార్యలు ఏ దోషమూ చెయ్యలేదు," అని చెప్పింది. కాని మునులు వినక, "లోకనిందను ఎలా మాన్పగలం?" అని చెప్పి, తమ భార్యలను వదిలేశారు.

ఆ ముని భార్యలు ఆరుగురూ గంగా తీరానికి వచ్చి ఆరు ముఖాల బిడ్డను చూశారు. వెంటనే ఆరుగురికీ పాలు చేపాయి. ఆ పిల్లవాడు ఆరుముఖాలతో ఆరుగురి వద్దా పాలు తాగాడు.

బ్రహ్మదేవుడే స్వయంగా వచ్చి ఆ పిల్లవాడికి జాతకర్మా, నామకరణమూ చేశాడు. ఆ పిల్లవాడే కుమారస్వామి. అతనికి షణ్ముఖుడనీ, స్కందుడనీ, గుహుడనీ అనేక పేర్లు వచ్చాయి.

మునిపత్నులు అతనితో, "నాయనా, మమ్మల్ని మా భర్తలు వెళ్ళగొట్టారు. మా కేమిటి దిక్కు?" అని అడిగారు.

"నేను మీ కొడుకునే. మీరు నాకు తల్లులు. అందుచేత నా వెంటనే ఉండండి," అన్నాడు కుమారస్వామి.

కుమారస్వామి దినదిన ప్రవర్ధమానుడై, కొండల మీద తిరిగి ఆడుకుంటూ, సింహాలనూ, పులులనూ పట్టుకుంటూ వాటి మీద ఎక్కి సవారీ చేస్తూ వచ్చాడు. అతనికి శివుడి విల్లు దొరికింది. దానితో అతను బాణాలు వేసి, క్రౌంచ పర్వత శిఖరాన్ని ఖండించాడు.

అది చూసి ఆ పర్వతం మీద ఉండే రాక్షసులు కుమారస్వామి మీదికి యుద్ధానికి వచ్చారు. కుమారస్వామి వారినందరినీ చంపేశాడు.

ఈ లోపల శివ పార్వతులకు ఇరవై ఒక్కమంది సంతానం కలిగారు. వారందరూ వేరు వేరు గణాలకు మూలపురుషులై గణపతులయారు.



CHANDAMAMA (Telugu) DECEMBER 1971 Regd. No. M. 4854




శివపురాణం



# శివపురాణం

## 12

శివుడి ఆజ్ఞ చొప్పున నందీశ్వరుడు వెళ్ళి, బ్రహ్మ విష్ణు ఇంద్రాది దేవతలనూ, గంగా తీరం నుంచి కుమారస్వామినీ కైలాసానికి పిలుచుకు వచ్చాడు. కుమారస్వామి తన తల్లులైన ఆరుగురు కృత్తికలనూ వెంట బెట్టుకుని, పుష్పక విమానంలో వచ్చాడు.

పార్వతీ పరమేశ్వరులు కుమారస్వామికి ఎదురు వెళ్ళి, కౌగలించుకుని తీసుకువచ్చి, సభలో తమ సమీపాన కూర్చోబెట్టుకున్నారు.

అప్పుడు బ్రహ్మ కుమారస్వామి సమీపంలో నిలబడి, "పార్వతీ పరమేశ్వరులారా, ఈ కుమారుడు ఇవేళ కైలాసానికి వచ్చాడు. రేపు అతన్ని దేవసేనలకు సేనాపతిగా అభిషేకించటం బాగుంటుంది," అన్నాడు.

ఈ మాటకు సభలో అందరూ సంతోషించారు. పార్వతీ పరమేశ్వరులు దేవతలందరి సమక్షంలో కుమారస్వామికి ఉపనయనం చేశారు. అనంతరం బ్రహ్మ పురోహితుడుగా ఉండి, కుమారస్వామిని దేవసేనకు సేనాపతిగా అభిషేకం జరిపాడు.

పార్వతీ పరమేశ్వరులు కుమారస్వామితో, "నాయనా, నువ్వు ఇప్పుడు దేవతల సేనాపతివి. నువ్వు దేవేంద్రుడికి అండగా ఉండి, మూడులోకాలనూ ఆపదల నుంచి కాపాడాలి. దుర్మార్గులనూ, పాపాత్ములనూ సంహరించాలి. గొప్పవాడివి అనిపించుకుని, గౌరవం పొందాలి," అన్నారు.

స్వర్గంలో విశ్వకర్మ చేత కుమారస్వామికి తగిన భవనాలు కట్టించారు.

పార్వతీ పరమేశ్వరులు కుమారుడితో, "నాయనా, నీ కోసం భవనాలు సిద్ధంగా ఉన్నాయి. నువ్వు వెళ్ళి వాటిలో నివాసం ఏర్పరచుకో," అన్నారు.

అట్ట చివరి బొమ్మ



పార్వతీదేవి కుమారుడికి దేవీగణాలను కూడా ఇచ్చింది. దేవతలు కుమారుడికి అనేకమైన వరాలూ, అస్త్ర, శస్త్ర, ఆయుధాలూ ఇచ్చి, తారకుణ్ణి సంహరించమని ఆశీర్వదించారు.

తరవాత కుమారస్వామి పార్వతీ పరమేశ్వరులకూ, బ్రహ్మ, విష్ణు, ఇంద్రాది దేవతలకూ మొక్కి, తన గణాలతో, "మీరు తారకుడి పట్టణాన్ని ముట్టడించటానికి తగిన సన్నాహాలు చెయ్యండి," అని చెప్పి రణభేరీ వేయించి, స్వర్గపట్టణానికి వెళ్ళి, తనకోసం నిర్మించిన భవనాలలో ప్రవేశించాడు.

అక్కడ శోణితపురంలో తారకుడికి వార్తలన్నీ అందాయి. శివుడి వీర్యాన పుట్టిన కుమారస్వామిని దేవతలు తమ సేనాపతిగా చేసుకుని, తనను చంపించటానికి సిద్ధంగా ఉన్నారు.

తారకుడు తన మంత్రులనూ, సేనానాయకులనూ రప్పించి, "మన నగరం మీద దాడి జరగబోతున్నట్టు చారుల వలన తెలిసింది. మీరు కూడా ఆ దాడిని ఎదుర్కొనటానికి తగిన ప్రయత్నాలు చెయ్యండి," అని చెప్పి పంపివేశాడు.

తరవాత, శివభక్తుడైన తారకుడు పార్థివ లింగాన్ని తయారుచేసి, పూజకు అవసరమైన పంచబిల్వాలనూ, కొబ్బరికాయలనూ, పంచామృతాలనూ, పూలనూ, ఫలాలనూ, సుగంధాలనూ సిద్ధం చేసుకుని, షోడశోపచార పూజలు చేసి, అభిషేకాలు జరిపి, ధూపదీపనైవేద్యాలు పెట్టి, "ఈశ్వరా, నిన్ను పూజించాను. పూజకు తగిన ఫలితం ప్రసాదించు," అని దణ్ణంపెట్టాడు.

అక్కడ స్వర్గంలో కుమారస్వామి, దేవతల గురువైన బృహస్పతి పెట్టిన ముహూర్తంలో రణభేరి వేయించి, దేవ, రుద్ర, వీరభద్ర, దేవీ గణాలతో యుద్ధానికి బయలుదేరాడు.

కుమారస్వామి దేవేంద్రుడు మొదలైన వారితో శోణితపురాన్ని చేరి, నగరాన్ని ముట్టడించి, శిబిరం ఏర్పాటు చేయించాడు. అతను శిబిరం మధ్యలో దేవేంద్రుడు



మొదలైన వారితో సహా కూర్చుని, "యుద్ధానికి ముందు సంధి ప్రయత్నం చెయ్యటం ఉత్తమమని చెబుతారు. ముందు సంధి రాయబారం పంపుదాం. దీనికి మీరేమంటారు?" అని అడిగాడు.

దానికి దేవేంద్రాదులు సమ్మతించారు. అప్పుడు కుమారస్వామి, తన వక్షస్థలం నుంచి పుట్టిన విశాఖుణ్ణి చూసి, "విశాఖా, నువు తారకుడి సభకు వెళ్ళి, నా మాటగా ఇలా చెప్పు. తారకుడి సమాధానం తెలుసుకుని తిరిగిరా!" అంటూ విశాఖుడికి తన మాటలు చెప్పాడు.

విశాఖుడు వెళ్ళేసరికి తారకుడు సభ చేసి తన నగరం ముట్టడి గురించి ఆలోచనలు జరుపుతున్నాడు. అతను విశాఖుణ్ణి చూసి, "నువు ఎవరు? ఏం పనిమీద వచ్చావు?" అని అడిగాడు.

విశాఖుడు అతనితో, "తారకా, నువు శివభక్తుడివి. శివపుత్రుడైన కుమారస్వామి నీ వద్దకు నన్ను రాయబారిగా పంపాడు," అన్నాడు.

తారకుడు సంతోషించి విశాఖుణ్ణి కూర్చోమని, "నాతో కుమారస్వామి ఏమి చెప్పమన్నాడు? నాకు దేవతలు విరోధులు గాని, కుమారస్వామి విరోధి కాదు," అన్నాడు.

"తారకా, నువు చాలాకాలంగా మూడు లోకాలూ ఏలావు. నీ పాలనలో లోకాలు సుఖపడలేదు. ఇక నీవు అధికారాన్ని ఇంద్రుడి పరం చేసి, భోగవతీపురానికి వెళ్ళిపో. లేకపోతే కుమారస్వామి నిన్నూ, నీ వారినీ చంపి, ఇంద్రుడికి నీ అధికారాన్ని ఇచ్చివేస్తాడు. ఈ మాట నీతో చెప్పమని కుమారస్వామి నన్ను పంపాడు," అన్నాడు విశాఖుడు.

తారకుడు మండిపడి, "నేను భయపడి రాజ్యం వదులుకోను. రేపు ఉదయం యుద్ధానికి వస్తున్నాను, సిద్ధంగా ఉండమను!" అని జవాబు చెప్పాడు.

మర్నాడు సూర్యోదయం వేళకు రెండు పక్షాల సేనలూ యుద్ధానికి సిద్ధమయాయి. ఉభయపక్షాల వారూ ప్రాణాలకు తెగించి

పోరాడారు. తారకుడి పక్షాన బాణాసురుడూ, ప్రలంబాసురుడూ, జంభాసురుడూ, అతిబలుడూ, శంభాసురుడూ, కుంభాసురుడూ మొదలైన వీరులున్నారు. కుమారస్వామి పక్షాన అతనితోపాటు వీరభద్రుడూ, అగ్నిహోత్రుడూ, ధర్ముడూ, సూర్యచంద్రులూ మొదలైనవారున్నారు.

యుద్ధం చాలా రోజులు జరిగింది, కాని తారకుడు ఓడే సూచనలు కనిపించలేదు. దేవతలకు నీరసం వచ్చేస్తున్నది. వాళ్ళ ధైర్యం పూర్తిగా అడుగంటిన సమయంలో కుమారస్వామి పాశుపతాస్త్రం ప్రయోగించాడు. అది తారకుడి సేనలపై కొన్ని వేల పిడుగులలాగా పడింది. రాక్షససేనలు చెల్లా చెదరయాయి. పారిపోక నిలిచిన వారంతా బూడిద అయిపోయారు.

తారకుడు కోపావేశంతో ఇంటికిపోయి, శివపంచాక్షరీ మంత్రం జపించి, ధ్యానంలో ఉండగా, అశరీరవాక్కు, "తారకా, విచారించకు. నీకు మోక్షం ఇస్తాను," అన్నది. తారకుడు పూజ ముగించి, లింగాన్ని కంఠంలో ధరించి, మర్నాడు తిరిగి యుద్ధానికి వచ్చాడు.


కుమారస్వామి తారకుడితో యుద్ధం చేశాడు. అతను ఎన్ని అస్త్రాలు ప్రయోగించినా తారకుడు చెక్కు చెదరలేదు. తారకుడి మెడలో ఈశ్వరలింగం ఉండగా అతన్ని ఏ అస్త్రమూ ఏమీచెయ్యలేదని నారదుడు కుమారస్వామికి చెప్పాడు.

ఈ మాటలు గుర్తుంచుకుని కుమారస్వామి తారకుడి మెడలోని లింగాన్ని ఆగ్నేయాస్త్రంతో కొట్టాడు. ఆలింగం అయిదు ముక్కలై కిందపడింది. సూర్యుడూ, విశ్వకర్మ మొదలైనవారు వెంటనే ఆ ముక్కలను ఏరి తీసుకుపోయి, అయిదుచోట్ల ప్రతిష్ఠించారు. అవే పంచభీమలింగేశ్వరాలు.

తారకుడి మెడలోని లింగం ఎప్పుడయితే ముక్కలయిందో, కుమారస్వామి బ్రహ్మాస్త్రం ప్రయోగించి తారకుణ్ణి సంహరించాడు. దేవీగణాలు తారకుడి సేనలను చంపుతూ రక్తమాంసాలుతింటూ, నృత్యాలు చేశాయి. దేవతలు పుష్పవర్షం కురిపించారు.



CHANDAMAMA (Telugu) JAN. 1972 92 Paise Including Excise Duty Regd. No. M. 4854



శివపురాణం



# శివపురాణం

## 13

తారకుణ్ణీ, అతనితో బాటు అనేకమంది ఇతర రాక్షసులనూ చంపిన అనంతరం కుమారస్వామి కొంతకాలం స్వర్గంలోనే ఉండి, పార్వతీ పరమేశ్వరులను సేవించాలని బుద్ధిపుట్టి కైలాసానికి వచ్చి, అక్కడ ఉండిపోయాడు.

ఆ కాలంలో అతను తన స్నేహితులతో కలిసి ఒకనాడు వనవిహారం చేస్తూ ఉండగా అతని వద్దకు నారదమహాముని వచ్చాడు. కుమారస్వామి నారదుడికి అతిథిసత్కారాలు చేసి, "మునీశ్వరా, లోకాలలో విశేషాలేమిటి?" అని అడిగాడు.

"నీదయవల్ల అన్ని లోకాలవారూ సుఖంగా ఉన్నారు. రాక్షసులను చంపేశావు గనక యజ్ఞయాగాదులు చక్కగా జరుగుతున్నాయి. అయితే నీకు ఒక విషయం చెప్పటానికి వచ్చాను. ఈ సమీపంలోనే భిల్లుపురం అనే గ్రామం ఉన్నది. అక్కడ పుళిందు డనే భిల్లురాజు ఉన్నాడు. అతను ఈశ్వర భక్తుడు. అతనికీ, అతని భార్యకూ చాలా కాలం సంతానం కలగలేదు. ఇలా ఉండగా ఆ భిల్లురాజుకు వనంలో ఒక ఆడపిల్ల దొరికింది. అతను ఆ పిల్లను తెచ్చి తన భార్యకిచ్చాడు. ఆ దంపతులు ఆ పిల్లకు వల్లి అని పేరుపెట్టి అతిగారాబంగా పెంచారు. వల్లి అందచందాలు వర్ణించటం నాతరం కాదు. బంగారు బొమ్మ! చూడగానే వనలక్ష్మి అనిపిస్తుంది! ఆమె నీకు భార్య అవుతుందని బ్రహ్మదేవుడు మాటల సందర్భంలో నాతో అన్నాడు. అందుచేత నువు ఆమెను పెళ్ళి చేసుకుని సుఖపడు," అన్నాడు నారదుడు.

తరవాత నారదుడు కుమారస్వామి వద్ద సెలవు తీసుకుని భిల్లురాజైన పుళిందుడి



వద్దకు వెళ్ళాడు. పుళిందుడు ఆయనను గౌరవించి కూర్చోబెట్టి, "మునీశ్వరా, మా వల్లికి తగిన గుణరూపాలు గల భర్త ఎక్కడ దొరుకుతాడో సెలవివ్వండి?" అని అడిగాడు.

"ఈ పిల్లకు తగినవరుడు శివుడి కొడుకైన కుమారస్వామి మాత్రమే. అతనికి కూడా వల్లి కన్న తగిన భార్య దొరకదు. త్వరలోనే కుమారస్వామి వనవిహారానికి వచ్చి, వల్లిని చూసి మోహిస్తాడు. అతను మీకు అల్లుడవుతాడు. మీరు ధన్యులు. శివుడు వియ్యంకుడు కావటంకన్న మహాభాగ్యం ఏ మున్నది?" అని పుళిందుడితో అని నారదుడు వెళ్ళిపోయాడు.

నారదుడు వల్లి సౌందర్యం గురించి చెప్పిపోయినది మొదలు కుమారస్వామి మనసులో ఆరాటం బయలుదేరింది. ఆమెను పెళ్ళాడాలన్న కోరిక అతనిలో తల ఎత్తింది. భిల్లుకన్యను పెళ్ళాడతానంటే తల్లిదండ్రులు ఒప్పుకుంటారో లేదో అనుకున్నాడు అతను. ఏ నిర్ణయం చెయ్యటానికైనా ముందు తాను ఆమెను కళ్ళారా చూడటం అవసరం అని అతనికి తోచింది. అందుకని అతను తన పరివారాన్ని వెంట బెట్టుకుని, భిల్లుపురం సమీపంలో వనవిహారం చెయ్యసాగాడు.

నారదుడి మాటలు కుమారస్వామిని కలత పెట్టినట్టే వల్లిని కూడా కలత పెట్టాయి. కుమారస్వామి ఎప్పుడు వస్తాడా అని ఆమె ఆత్రంగా ఎదురుచూస్తున్నది. అతను తన వంటి నీచకన్యను పెళ్ళాడతాడా అని సందేహిస్తున్నది. తన తల్లి దండ్రులు తనను పెంచుకున్న వారేగాని కన్నవారు కారుగదా అని తన మనస్సును సమాధాన పరుచుకుంటున్నది. కుమారస్వామి తనను పెళ్ళాడకపోతే దేహత్యాగం చెయ్యటానికైనా ఆమె సిద్ధంగా ఉన్నది.

ఇలా అనుకున్నాక వల్లి తన తల్లిదండ్రులకు చెప్పకుండా, కొందరు చెలికత్తెలను వెంట బెట్టుకుని వనవిహారానికి బయలుదేరి వెళ్ళింది. ఆమె తన చెలికత్తెలతో సహా ఒక

గున్నమామిడి చెట్టు కింద కూర్చుని ఉండగా, కుమారస్వామి తన అనుచరులతో వచ్చి, సమీపంలోనే మరొక చెట్టు కింద కూర్చున్నాడు.

వల్లి చెలికత్తె ఒకతె అతని వద్దకు వచ్చి, "అయ్యా, మీరెవరు? ఎక్కడినుంచి వచ్చారు? ఈ పుష్పవనం పుళిందరాజు కుమార్తె అయిన వల్లీదేవి విహారస్థలం. ఈ ప్రదేశానికి మగవాళ్ళు రాకూడదు," అన్నది.

ఈ మాటలు వినగానే కుమారస్వామికి కొత్త ఉత్సాహం వచ్చింది. అతను వల్లి చెలికత్తెతో, "నాపేరు కుమారస్వామి. నేను శివపార్వతుల కుమారుణ్ణి. మాది కైలాసం. మీ వల్లి సమాచారం వినదగినదైతే చెప్పు." అన్నాడు.

"ఈ పుళిందదేశానికి రాజైన పుళిందుడు భిల్లులకు రాజు. భిల్లుపురం ఆయన రాజధాని. ఆయన ఈశ్వరభక్తుడు. ఆయనకు పిల్లలు లేరు. ఈ వనంలోనే ఆయనకు వల్లి దొరికింది. ఆయనా, ఆయన భార్యా ఆ పిల్లను పెంచుకుని పెద్ద దాన్ని చేశారు," అని చెలికత్తె చెప్పింది.

"మీ వల్లికి వివాహం అయిందా?" అని కుమారస్వామి అడిగాడు.

"సంబంధం కుదిరింది. పెళ్ళికావటమే తరవాయి," అన్నది చెలికత్తె.



కుమారస్వామి ఆత్రంగా, "ఏమిటా సంబంధం? వరుడు ఎవరు?" అని అడిగాడు.

"నిన్న మా రాజుగారి దగ్గిరికి నారద మహాముని వచ్చాడు. శివుడి కుమారుడైన కుమారస్వామి వచ్చి వల్లిని పెళ్ళాడతాడని ఆయన మా రాజుగారితో చెప్పి వెళ్ళాడు. అది మొదలు మా వల్లి కుమారస్వామి కోసం కలవరిస్తున్నది. ఆవిడగారికి క్షణం ఒక యుగంగా ఉన్నది. ఆమె బాధ చూడలేక వనవిహారానికి తీసుకు వచ్చి ఆ మామిడి చెట్టు కింద కూర్చోబెట్టాం. నువు ఇక్కడే ఉండు. వల్లిని తీసుకువస్తాను," అంటూ చెలికత్తె వెళ్ళి, వల్లిని చెయ్యిపట్టుకుని లాక్కొచ్చింది.

కుమారస్వామి వల్లి చెయ్యి పట్టుకుని, "నా వెంట వచ్చెయ్యి. మనం పెళ్ళి చేసుకుందాం," అన్నాడు.

"నన్ను పెళ్ళి చేసుకోదలిస్తే నా తల్లిదండ్రుల అనుమతి పొందాలి. లోకనింద తెచ్చుకునే పనులు చేయరాదు. కాస్సేపు ఇక్కడే ఉండు. మన పెళ్ళికి మావాళ్ళ అనుమతి పొందివస్తాను," అంటూ వల్లి చెయ్యి విడిపించుకుని, తన చెలికత్తెలతో సహా ఇంటికి వచ్చేసింది.

జరిగిన సంగతి తెలిసి పుళిందుడు సపరివారంగా కుమారస్వామి వద్దకు వచ్చి, ఆ రాత్రి తెల్లవారు ఝామున లగ్నం ఉన్నదని చెప్పి, అతన్నీ, అతని పరివారాన్నీ వెంట బెట్టుకుపోయి, విడుదులలో ఉంచి, పెళ్ళి ప్రయత్నాలు చెయ్యటానికి ఇంటికి వెళ్ళాడు.

ఈ వార్త తెలిసి పార్వతీ శివులు కైలాసం నుంచి వచ్చి, కుమారస్వామి వివాహం జరిపించి, వధూవరులతో సహా కైలాసానికి తిరిగి వెళ్ళారు.

కొంతకాలం గడిచింది. శోణితపురంలో గజాసురుడు అనే వాడొకడు అవతరించాడు. వాడు కూడా బ్రహ్మను గురించి ఘోరమైన తపస్సు చేసి, అనేక వరాలుపొంది, మూడు లోకాలనూ స్వాధీనం చేసుకుని ఏల సాగాడు. పరమ శివభక్తుడైన గజాసురుడి పాలనలో ప్రజలందరూ సర్వసుఖాలూ అనుభవించారు. వారికి ఎలాటి ఈతి బాధలూ లేవు.

ఒకనాడు నారదుడు గజాసురుడి వద్దకు వెళ్ళి, అతడి చేత అతిథిమర్యాదలు పొంది, "గజా, నువు గొప్ప ఈశ్వరభక్తుడవు. శివుణ్ణి నీ హృదయంలోనే ఉండమని కోరరాదా?" అన్నాడు.

గజాసురుడికి ఈ ఆలోచన నచ్చింది. అతను తన పూజతో శివుణ్ణి ప్రత్యక్షం చేసుకుని, తన హృదయం లోనే ఉండమని వరం కోరాడు. శివుడు అందుకు సమ్మతించి, లింగరూపంలో గజాసురుడి హృదయంలో ఉండిపోయి, గజాసురుడి మానసిక పూజలు అందుకోసాగాడు.



CHANDAMAMA (Telugu) FEB. 1972 92 Paise Including Excise Duty Regd. No. M. 4854



శివపురాణం



# శివపురాణం

## 14

శివుడు ఏమైపోయినదీ పార్వతికి తెలియ రాక, రుద్రగణాల చేత లోకాలన్నీ వెతికించి, శివుడు లింగరూపంలో గజాసురుడి హృదయంలో ఉన్నట్టు తెలుసుకున్నది.

ఆమె వెంటనే విష్ణువు వద్దకు వెళ్ళి, "అన్నా, నా భర్తను గజాసురుడు లింగ రూపంలో తన హృదయంలో దాచుకున్నాడు. నువు ఆయనను తిరిగి కైలాసానికి చేర్చాలి," అని ప్రార్థించింది.

విష్ణువు అలాగే చేస్తానని మాట ఇచ్చాడు. శివుడు కైలాసానికి తిరిగివచ్చేదాకా గణపతులందరిలోకీ పెద్దవాణ్ణి కైలాసాన్నీ, పార్వతినీ సంరక్షించటానికి ఏర్పాటు చేసి, విష్ణువు రుద్ర, వీరభద్రగణాలతో బ్రహ్మ వద్దకు వెళ్ళాడు. దేవేంద్రుడు మొదలైన వారు కూడా వచ్చి, విష్ణువు తలపెట్టిన పని గురించి విన్నారు.

తరవాత అందరూ మారురూపాలు ధరించి రుద్రగణాలతో సహా శోణితపురం వెళ్ళారు. నంది గంగిరెద్దుగా మారాడు. మిగిలినవాళ్ళంతా వివిధవాద్యాలు వాయించే వాళ్ళ వేషాలు ధరించారు. విష్ణువు ఎద్దును ఆడించేవాడుగా మారాడు. వాళ్ళందరూ శోణితపురం వీధులలో తిరుగుతూ, గంగిరెద్దును ఆడిస్తూ, శివస్తోత్రాలు చేస్తూ వచ్చారు.

గంగిరెద్దు అద్భుతంగా మనుషులు చెప్పినట్టు చేస్తున్నదని విని, గంగిరెద్దుల వాళ్ళను గజాసురుడు తన సభకు పిలిపించాడు. గంగిరెద్దు పాటకు తగినట్టుగా నృత్యం చేసింది. వాళ్ళు పాడే పాటలన్నీ శివస్తోత్రాలు. ఆ స్తోత్రాలకు పొంగి, గజాసురుడి గుండెలో ఉన్న శివలింగం పెరగ సాగింది.

అట్ట చివరి బొమ్మ



లింగం పెరిగిపోతున్నకొద్దీ గజాసురుడికి ఊపిరి సలపలేదు. అతను తనకు చావు మూడిందని గ్రహించి, "పరమేశ్వరా, రక్షించు!" అన్నాడు.

"గజా, నీకు చావు తప్పదు. వరం కోరు," అన్నాడు శివుడు.

"నా తల పూజనీయంగా ఉండాలి. నా చర్మం నువు ధరించాలి. నాకు జన్మరాహిత్యం కావాలి. ఈ వరాలు ప్రసాదించు," అన్నాడు గజాసురుడు.

శివుడు అతనికి కోరిన వరాలిచ్చి, అతను ఎలుకరూపంలో తన వద్ద ఉండేటట్టు అనుగ్రహించి, గజాసురుడి పొట్ట చీల్చుకుని బయటికి వచ్చాడు.

ఇదంతా తెలిసి గజాసురుడి పరివారం యుద్ధానికి వచ్చారు. ఆ రాక్షసుల నందరినీ విష్ణువు చంపేశాడు.

తరవాత బ్రహ్మ, విష్ణు, దేవేంద్రుడూ, నందీశ్వరుడూ మొదలైన వారు తమ ఎప్పటి రూపాలు దాల్చి శివుడికి నమస్కారం చేశారు. వారంతా రుద్రగణాలను వెంట బెట్టుకుని కైలాసానికి వచ్చారు. శివుడు, తాను గజాసురుణ్ణి చంపి తిరిగి వచ్చినట్టు పార్వతికి కబురు పంపాడు.

అప్పటికే ఈ వార్త తెలిసి సంతోషించిన పార్వతి, తలంటి పోసుకుని గృహదేవతలను పూజించే ఉద్దేశంతో, సింహద్వారంలో ఉన్న లక్ష్మిగణాధిపతులతో, "నాయనలారా, నేను తలంటుకోబోతున్నాను. నేను చెప్పే దాకా ఎవరినీ లోపలికి రానివ్వకండి," అని చెప్పింది.

మరికొంత సేపటికి నందీశ్వరుడు మొదలైనవారు వచ్చి, లోపలికి ప్రవేశించబోయారు. అప్పుడు లక్ష్మిగణపతులు వారికి అడ్డు తగిలి, "అమ్మ తలంటుకుంటున్నది. లోపలికి ఎవరినీ రానీయవద్దన్నది. అందుచేత ఆమె చెప్పేదాకా మీరు లోపలికి పోరాదు," అన్నారు.

"మాకు ఈశ్వరాజ్ఞ ఉన్నది. మూడు లోకాలలోనూ ఈశ్వరాజ్ఞకు ఎదురు లేదు. మధ్య మీరెవరు?" అంటూ రుద్రగణాల

వాళ్ళు లక్ష్మిగణాల వాళ్ళతో కయ్యానికి దిగారు. కోలాహలం జరిగింది.

ఈ కోలాహలం విని పార్వతి పరిచారిక ఒకతె వచ్చి చూసి, పార్వతి వద్దకు వెళ్ళి, "లక్ష్మిగణాల వాళ్ళూ, రుద్రగణాల వాళ్ళూ కొట్టుకుంటున్నారు," అని చెప్పింది.

రుద్రగణాల వాళ్ళ ప్రవర్తనకు కోపగించి పార్వతి లక్ష్మిగణాల వాళ్ళకు సహాయంగా దేవగణాల వాళ్లను పంపింది. లక్ష్మిగణాలూ, దేవగణాలూ ఏకమై రుద్రగణాల వాళ్ళను చావగొట్టి తరిమేశాయి. వాళ్ళు పారిపోయి, జరిగిన సంగతి శివుడికి చెప్పారు.

అక్కడ ఉన్న నారదుడు, "పార్వతి ద్వారపాలకులకు ఇంత పొగరా? శివుడి ఆజ్ఞనే ధిక్కరిస్తారా?" అన్నాడు.

తన భృత్యులు దెబ్బలు తిన్నందుకే మండి పోతున్న శివుణ్ణి నారదుడి మాటలు మరింత రెచ్చగొట్టాయి. ఆయన తన త్రిశూలాన్ని పంపి లక్ష్మిగణాల వాళ్ళ తలలు నరికించేశాడు. తన ముద్దుల కొడుకుల తలలు తెగిపోయినందుకు పార్వతి విచారంలో మునిగిపోయింది.

పార్వతీదేవి ద్వారం వద్ద ఇప్పుడెవరూ అడ్డేవారు లేరు. అందుచేత శివుడు బ్రహ్మ విష్ణులను వెంట బెట్టుకుని పార్వతి ఇంటికి వచ్చాడు. అప్పటికే తలంటి పోసుకుని, శృంగారించుకుని, గృహదేవతలను పూజించిన పార్వతి, లక్ష్మిగణాల చావుకు విచారంలో మునిగి ఉండటంచేత వచ్చిన వారిని గౌరవించ లేదు.



శివుడు పార్వతి విచారాన్ని పోగొట్టుదామని పార్వతిని సమీపించాడు. కాని పార్వతి శివుడి కేసి చూడనన్నా లేదు.

అప్పుడు విష్ణువు పార్వతిని సమీపించి, "చెల్లీ, గజాసురుడు చచ్చినందుకు మూడు లోకాలూ ఆనందంలో మునిగి ఉండగా నువ్వు విచారంలో మునిగి ఉండటానికి కారణమేమిటి? నీకు వచ్చిన కష్టమేమిటో చెప్పు. నేను తీర్చుతాను," అన్నాడు.

పార్వతి విష్ణువుతో, "అన్నా, శివుడు నిష్కారణంగా నా కొడుకులైన లక్ష్మిగణాల వారిని చంపాడు. వాళ్ళను బతికించి, వాళ్ళకు తగిన అధికారాలను ఇస్తేగాని నా విచారం తీరదు," అన్నది.

త్రిమూర్తులతో శివుడు, గజాసురుడికి తాను ఇచ్చిన వరాలమాట చెప్పాడు. తన తల పూజనీయంగా ఉండాలనీ, తన చర్మాన్ని శివుడు ధరించాలనీ గజాసురుడు శివుణ్ణి కోరి ఉన్నాడు.

అందుచేత లక్ష్మిగణాలకు అధిపతి అయిన వాడి శరీరాన్ని సభకు తెప్పించి, రుద్రగణాలను పంపి గజాసురుడి తల తెప్పించి, దాన్ని లక్ష్మిగణాధిపతి శరీరానికి అతికించారు. వెంటనే లక్ష్మిగణాధిపతి నిద్ర లేచిన వాడిలాగా లేచి నిలబడి పార్వతికీ, విష్ణువుకూ నమస్కారం చేశాడు. అదే విధంగా మిగిలిన ఇరవైమంది గణాధిపతుల మొండాలకూ ఏనుగు తలలు తగిలించారు. వెంటనే వారు కూడా బతికారు. లక్ష్మిగణాల వాళ్ళు ఈవిధంగా సజీవులు కాగానే పార్వతీదేవి పరమానందం చెందింది.

ఆ ఆనంద సమయంలో విశ్వదర్శి అనే ఉపబ్రహ్మ సభలో లేచి నిలబడి, "శివపార్వతులారా, నా కుమార్తెలైన జయలక్ష్మి మొదలైన వాళ్ళను లక్ష్మిగణాధి పతులకు ఇచ్చి పెళ్ళి చేద్దామనుకుంటున్నాను," అన్నారు.

ఈ మాటకు అందరూ సంతోషించారు. బ్రహ్మ తానే పురోహితుడుగా ఉండి, విశ్వదర్శి కూతుళ్ళను గణాధిపతులకు పెళ్ళి చేశాడు. గణాధిపతులలో లక్ష్మిగణపతి పెద్దవాడు. అతని భార్య జయలక్ష్మి.



CHANDAMAMA (Telugu) MAR. 1972 92 Paise Including Excise Duty Regd. No. M. 4854




శివపురాణం



# శివపురాణం

## 15

ఇరవై ఒక్క మంది గణాధిపతులకూ, విశ్వదర్శి అనే ఉపబ్రహ్మ కుమార్తెలకూ పెళ్ళి జరిగిపోగానే పార్వతి శివుడితో, "పరమేశ్వరా, నా కొడుకులకు అధికారాలిచ్చి, గజాసురుడికి ఇచ్చిన వరం సార్థకం చెయ్యండి," అన్నది.

శివుడు ఆమె కోరిక తీర్చే ఆలోచనలో ఉండగా అక్కడికి కుమారస్వామి వచ్చి, పార్వతీ పరమేశ్వరులతో, తనకు కూడా గణాధిపత్యం ఇప్పించవలసినదని కోరాడు.

"నీకు దేవగణాల మీద అధిపత్యం ఇచ్చి ఉన్నాంగదా, రుద్రగణాల మీద అధికారాన్ని లక్ష్మీగణాధిపతులకు ఇద్దాం. అందుకు ఒప్పుకో," అన్నాడు శివుడు.

అందుకు కుమారస్వామి ఒప్పుకోక, తనకు కూడా గణాధిపత్యం కావాలని మొండిగా పట్టుబట్టాడు.

అప్పుడు శివుడు కుమారస్వామికీ, లక్ష్మీ గణాధిపతులలో పెద్దవాడికీ ఒక పోటీ కల్పించాడు. ఆ ఇద్దరూ తమ తమ వాహనాల మీద వెళ్ళి, పుణ్యక్షేత్రాలు చూస్తూ, పుణ్యతీర్థాలలో స్నానాలు చేస్తూ, భూప్రదక్షిణం చేసి కైలాసానికి తిరిగి రావాలి. ఎవరు ముందుగా తిరిగి వస్తే వారిది సర్వ గణాధిపత్యం. ఇందుకు వాళ్ళు సమ్మతించారు. శివుడు కుమారస్వామికి వాహనంగా నెమలిని ఇచ్చి, ఎలుక రూపంలో తన వద్ద ఉన్న గజాసురుణ్ణి లక్ష్మీగణాధిపతికి వాహనంగా ఇచ్చాడు. కుమారస్వామి నెమలిని ఎక్కి రివ్వున ఆకాశంలోకి ఎగిరిపోయాడు.

లక్ష్మీగణాధిపతి పార్వతి వద్దకు వెళ్ళి, "అమ్మా, చూడు నాకు ఎంత అన్యాయం జరిగిందో! కుమారస్వామి బలవంతుడూ, ఆజానుబాహువూనూ. అతనికి నెమలిని వాహ

అట్ట చివరి బొమ్మ



నంగా ఇచ్చారు. మేమంతా పొట్టివాళ్ళము. నేను తల బరువూ, పొట్ట బరువూ పెట్టుకుని, ఎలుక మీద ఎలా ప్రయాణం చెయ్యగలను? ఇలాటి పరీక్ష పెట్టేకన్న మాకు అధికారం ఇచ్చేదిలేదని చెబితే సరిపోయేది గదా!'' అన్నాడు.

''నాయనా, మీ మామ అయిన విష్ణువును ఏదన్నా ఉపాయం అడుగు,'' అని పార్వతి లక్ష్మీగణాధిపతితో అన్నది.

లక్ష్మీగణాధిపతి విష్ణువు వద్దకు వెళ్ళి, తనకు జరిగిన అన్యాయం చెప్పుకుని, ''నేను కుమారస్వామితో పోటీపడి భూప్రదక్షిణం చెయ్యగలనా? కుమారస్వామి అప్పుడే బయలుదేరి వెళ్ళిపోయాడు అన్నాడు,''

విష్ణువు అతనితో, ''బాబూ, విచారించకు. శివపంచాక్షరీ మంత్రం ఐదు లక్షలు జపించి, పార్వతీ పరమేశ్వరుల చుట్టూ మూడుసార్లు తిరిగావంటే నీకు భూప్రదక్షిణ చేసిన ఫలితమూ, తీర్థయాత్రల ఫలితమూ కూడా దక్కుతుంది,'' అన్నాడు.

లక్ష్మీగణపతి అలాగే శుచి అయి, ఒక చోట దర్భాసనం మీద కూర్చుని శివపంచాక్షరి జపించసాగాడు.

ఈలోపల కుమారస్వామి నెమలి వాహనం మీద మొదటి తీర్థాన్ని చేరుకోబోతుండగా అక్కడ లక్ష్మీగణపతి అప్పుడే స్నానం చేసి, తీర్థం నుంచి వెళ్ళిపోతున్నట్టు దూరం నుంచి కనిపించింది. కుమారస్వామి దగ్గిరికి వచ్చి చూసేసరికి, ఇసుకలో ఎలుక పాదాల గుర్తులు కనిపించాయి.

కుమారస్వామి ఆ తీర్థంలో ఉండే వారిని, ''అయ్యా, ఇక్కడికి పెద్ద పొట్ట గల పొట్టివాడొకడు ఎలుకనెక్కి వచ్చి స్నానం చేసి వెళ్ళాడా?'' అని అడిగాడు.

''అవును, బాబూ, ఇప్పుడే వెళ్ళాడు. అడుగో దూరాన ఇంకా కనిపిస్తూనే ఉన్నాడు. మహా పుణ్యాత్ముడు, మా కందరికీ తలా ఒక సువర్ణమూ దానం చేశాడు!'' అన్నారు వాళ్ళు.

''ఆహా! పొట్టివాడు ఎంత పని చేశాడూ! ఇక్కడ స్నానం చేస్తూ కాలయాపన చెయ్య

రాదు. ముందు వచ్చే తీర్థంలో స్నానం చేస్తాను," అనుకుని కుమారస్వామి ముందున్న క్షేత్రానికి వెళ్ళాడు. కాని అతను అక్కడికి చేరేసరికి లక్ష్మీగణపతి అప్పుడే ఆ తీర్థంలో స్నానం చేసి వెళ్ళినట్టు స్పష్ట మయింది!

ఎక్కడికి వెళ్ళినా కుమారస్వామికి ఇదే అనుభవం అయింది. అతను ఏ తీర్థమూ సేవించకుండానే భూప్రదక్షిణం చేసి కైలాసానికి తిరిగి వచ్చాడు. ఈ లోపలనే లక్ష్మీ గణపతి శివపంచాక్షరి అయిదు లక్షల సార్లు జపించి, పార్వతీ పరమేశ్వరుల చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణం చేసి, వారి ముందు వినయంగా చేతులు జోడించి నిలబడ్డాడు.

సభలో వాళ్ళందరూ గుసగుసలాడుకుని, "ఈ లక్ష్మీగణపతి భూప్రదక్షిణం చెయ్యకుండానే గణాధిపత్యం సంపాదిస్తాననుకుంటున్నాడు!" అనుకున్నారు.

ఇంతలో కుమారస్వామి తిరిగి వచ్చి, పార్వతీ పరమేశ్వరులతో, "నేను గణాధిపత్యానికి తగను. లక్ష్మీగణపతికే గణాధిపత్యం ఇవ్వండి," అన్నాడు.

శివుడి సభలో ఉన్నవారూ, పార్వతీ పరమేశ్వరులూ కూడా ఆశ్చర్యపడి, "ఎందుకు అలా అంటున్నావు?" అని కుమారస్వామిని అడిగారు.

"నేను ప్రపంచంలో ఉన్న అన్ని క్షేత్రాలకూ వెళ్ళాను. కాని ఏ తీర్థంలోనూ స్నానం చెయ్యలేదు. ఎందుకంటే, ప్రతి తీర్థం



లోనూ ఈ లక్ష్మీగణపతి నా కన్న ముందే స్నానం చేసి వెళ్ళి పోవటం నాకు కనిపించింది. తీర్థాలలో వాళ్ళు కూడా నాకు ఆ మాటే చెప్పారు. అతను నా కన్న మహా శక్తి గలవాడు. రుద్రగణాలకు నాయకుడుగా ఉండటానికి అతనే తగినవాడు,'' అన్నాడు కుమారస్వామి.

సభలో వారందరూ శివపంచాక్షరీ ప్రభావాన్ని గ్రహించి, లక్ష్మీగణపతినే రుద్రగణాలకు అధిపతిగా చెయ్యటానికి ఒప్పుకున్నారు. అతన్ని గణాధిపతిగా అభిషేకించే ప్రయత్నాలు ప్రారంభమయాయి.

రుద్రగణాల వాళ్ళు వెళ్ళి పుణ్యనదీ జలాలూ, సప్త సముద్ర జలాలూ తెచ్చారు. ప్రమథ, భూతగణాలనూ, గరుడ, గంధర్వ, కిన్నర, కింపురుష, నాగ, భూలోకవాసులనూ పిలిపించారు. బృహస్పతి పెట్టిన ముహూర్తాన లక్ష్మీగణపతినీ, అతని భార్య అయిన జయలక్ష్మినీ నవరత్న సింహాసనం మీద కూర్చోబెట్టి, సమస్త గణాల మీదా అతనికి అధిపత్యం ఇస్తూ, తన తమ్ములైన ఇతర గణపతులందరి పైనా అధికారం ఇచ్చారు. అతనికి పార్వతీపరమేశ్వరులు అభిషేకం చేశారు. తరవాత వాళ్ళు లక్ష్మీగణపతితో, ''నువ్వూ, నీ తమ్ములూ మూడు లోకాలనూ పాలిస్తూ, మిమ్మల్ని తలచిన వారికీ, పూజించినవారికీ, మిమ్మల్ని గురించి తపస్సు చేసినవారికీ సహాయపడుతూ, వారి కార్యాలు సఫలం అయేటట్టు చూడండి,'' అన్నారు.

ఇది ఇలా ఉండగా, తారకాసురుడు చనిపోయిన అనంతరం అతని భార్య, తన కుమారులైన తారకాక్షుడూ, కమలాక్షుడూ, విద్యున్మాలీ అనే ముగ్గురినీ వెంట బెట్టుకుని రసాతలానికి పారిపోయి, అక్కడ వాళ్ళకు శుక్రాచార్యుడి చేత సకల విద్యలూ చెప్పిస్తూ, పెంచి పెద్దవాళ్ళను చేసింది.

ఆ కుర్రవాళ్ళు పెద్దవాళ్ళయాక తమ తండ్రి ఎలా చచ్చిపోయినదీ తెలుసుకున్నారు. అప్పుడు వాళ్ళు మేరు పర్వతం మీదికి పోయి, బ్రహ్మను గురించి దీర్ఘమైన తపస్సు చేశారు.



CHANDAMAMA (Telugu) APRIL 1972 92 Paise Including Excise Duty Regd. No. M. 4854




శివపురాణం



# శివపురాణం

## 16

బ్రహ్మ తారకుడి కొడుకుల తపస్సుకు మెచ్చి, ప్రత్యక్షమై, "మీకు ఏమి వరాలు కావాలి?" అని అడిగాడు.

"దేవా, రథం కాని రథం మీద, విల్లు కాని విల్లుకు, బాణం కాని బాణం సంధించి కొడితే తప్ప మాకు చావు లేకుండా అనుగ్రహించు. మాకు సకల విద్యలూ, తేజో బలాలూ, ఐశ్వర్య త్యాగ భోగ భాగ్యాలూ, శివభక్తి, బంగారమూ, వెండీ, ఇనుములతో చేసిన పురాలు నివసించటానికి కావాలి," అన్నారు ఆ ముగ్గురూ.

బ్రహ్మ వారు కోరిన వరాలిచ్చి, వారికి కావలసిన పురాలను నిర్మించి పెట్టే పని విశ్వకర్మకు అప్పగించి, అదృశ్యుడయాడు.

విశ్వకర్మ బంగారంతోనూ, వెండితోనూ, ఇనుముతోనూ మూడు పురాలు నిర్మించి తారకుడి కొడుకులకు ఇచ్చాడు. అవే త్రిపురాలు. వాటికి కామగమనం ఉండేది. అవి ఆకాశంలో నిలిచి ఉండేవి. వాటిలో ఇళ్ళూ, చెట్లూ, చెరువులూ, ధన ధాన్య సమృద్ధీ ఉండేవి. బంగారంతో చేసిన పురంలో తారకాక్షుడూ, వెండి దానిలో కమలాక్షుడూ, ఇనుప దానిలో విద్యున్మాలీ నివాసాలు ఏర్పరచుకుని, వాటితో మూడు లోకాలూ స్వేచ్ఛగా తిరగసాగారు.

ఈ త్రిపురాలను జయించటం ఇంద్రుడు మొదలుగాగల దేవతలకు సాధ్యంకాలేదు. వాళ్ళు బ్రహ్మ వద్దకు వెళ్ళి, "త్రిపురాసురులు మమ్మల్ని చాలా బాధపెట్టుతున్నారు. వాళ్ళ నగరాలు మా ఇళ్ళ మీద వాలి, వాటిని నేలమట్టం చేస్తున్నాయి." అని మొరపెట్టుకున్నారు.

"త్రిపురాసురులు తేలికగా చావరు. మనం శివుడి సలహా అడుగుదాం," అని

అట్ట చివరి బొమ్మ



బ్రహ్మ దేవతలను వెంట బెట్టుకుని శివుడి వద్దకు వెళ్ళాడు.

శివుడు వారు వచ్చిన పని తెలిసి, "త్రిపురాసురులను నేను చంపను, కావలిస్తే నా తేజస్సు సగం యిస్తాను. మీరే వాళ్ళను చంపండి," అన్నాడు.

త్రిపురాసురులకు తాను ఇచ్చిన వరాలు చెప్పి బ్రహ్మ, "మా తేజస్సు కూడా తీసుకుని నువే వారిని చంపాలి." అన్నాడు. రథంగాని రథమూ, విల్లు కాని విల్లూ, బాణం కాని బాణమూ కావలిసి ఉన్నది. అందుచేత శివుడు భూమిని రథంగానూ, వేదాలను రథాశ్వాలుగానూ, సూర్య చంద్రులను రథ చక్రాలుగానూ, మేరువును విల్లుగానూ, ఆదిశేషుణ్ణి వింటి తాడుగానూ చేసుకుని, విష్ణుమూర్తిని నారాయణాస్త్రంగా ఉపయోగించి, త్రిపురాలను కొట్టాడు. వెంటనే ఆ మూడు పురాలూ బూడిద అయి భూమి మీద రాలిపోయాయి.

త్రిపురాసురులు నాశనం కాగా జలంధరు డనే మరొక రాక్షసుడు బయలుదేరి లోకాలను పీడించసాగాడు. జలంధరుడి అసలు పేరు సూకరుడు. అతను హిరణ్యకశిపుడి పదవ కొడుకైన అగ్నిజిహ్వుడి కుమారుడు; బ్రహ్మను గురించి అతి ఘోరమైన తపస్సు చేసి, దేవగణాల చేతగాని, రాక్షస గణాల చేతగాని, నాగులూ, మానవులూ మొదలైన వారిచేతగాని చావు లేకుండానూ, నీటి లోపల నివసించేలాగూనూ వరాలు పొంది, అష్టదిక్కులూ గెలిచి, దేవేంద్రుడు మొదలైన వారిని స్వర్గం నుంచి పారదోలి, స్వర్గాన్ని ఆక్రమించుకుని మూడు లోకాలూ పాలించసాగాడు.

జలంధరుడికి ఓడి, కైలాసం నుంచి శివుడూ, వైకుంఠం నుంచి విష్ణువూ పారిపోయి, ఇద్దరూ మానససరస్సులో దాక్కున్నారు. అక్కడ వాళ్ళిద్దరూ కూడబలుక్కుని, పరబ్రహ్మను గురించి తపస్సు చేయగా పరబ్రహ్మ స్వరూపుడు ప్రత్యక్షమై, విష్ణువుకు చక్రమూ, శివుడికి త్రిశూలమూ ఇచ్చి, "మీరు ఒకరి ఆయుధాలు

మరొకరు పుచ్చుకుని జలంధరుణ్ణి చంపండి,'' అని హెచ్చరించి అదృశ్యుడయిపోయాడు.

శివ విష్ణువులు సంతోషించి, తమ ఆయుధాలు మార్చుకుని, జలంధరుడి కోసం చూడసాగారు.

అప్పుడు నారదుడు ఈ సంగతి తెలుసుకుని, జలంధరుడి వద్దకు వెళ్ళి, ''జలంధరా, శివ విష్ణువులు మానస సరస్సులో దాక్కుని ఉన్నారు.'' అని చెప్పాడు.

జలంధరుడు వెంటనే మానస సరస్సు చేరి, నీటిలో మునిగి శివ పిష్ణువుల కోసం వెతకనారంభించాడు. ఈ సంగతి పసికట్టి శివుడూ, విష్ణువూ ఒడ్డుకు వచ్చి, జలంధరుడు ఎప్పుడు పైకి వస్తాడా అని చూశారు. శివుడి చేతిలో చక్రమూ, విష్ణువు చేతిలో త్రిశూలమూ ఉన్నాయి.

మానస సరస్సు అంతా కలయ పెతికి శివ విష్ణువులను కానక, జలంధరుడు ఒడ్డుకు వచ్చాడు. అప్పుడతనికి వారిద్దరూ కనబడ్డారు. జలంధరుడు వారు కనబడగానే సంతోషించి, వారితో యుద్ధానికి కలియబడ్డాడు. వారిద్దరూ జలంధరుణ్ణి రెండు ఖండాలు చేసి చంపేశారు. జలంధరుడి చావుకు మూడు లోకాలవాళ్ళూ సంతోషించారు.

కశ్యప ప్రజాపతి కన్న కొడుకులలో విప్రజిత్తు అనే దానవుడు ఒకడు ఉండేవాడు. ఆ విప్రజిత్తుకు దంభుడు అనే కొడుకు ఉండేవాడు. దంభుడు విష్ణు



భక్తుడు. ఎప్పుడూ విష్ణు పూజ చేసేవాడు. దంభుడికి చాలా కాలం సంతానం లేక పోయింది. అందుచేత అతను బదరికాశ్రమానికి వెళ్ళి, విష్ణువును గురించి దీర్ఘ కాలం ఘోరమైన తపస్సు చేశాడు.

చివరకు విష్ణువు ప్రత్యక్షమై, దంభుణ్ణి వరం కోరమన్నాడు.

"మహావిష్ణూ, బలశౌర్య పరాక్రమాలలో నీకు సముడైన వాడూ, మూడు లోకాలనూ జయించగల వాడూ, ఎవరికీ ఓడని వాడూ, నీ యందు భక్తి గల వాడూ అయిన కొడుకును ప్రసాదించు." అని దంభుడు విష్ణువును కోరాడు.

విష్ణువు దంభుడు కోరిన వరం ఇచ్చాడు. దంభుడు ఇంటికి తిరిగి వెళ్ళి ఈ శుభ వార్త తన భార్యకు చెప్పాడు. తరవాత కొంత కాలానికి దంభుడి భార్య గర్భవతి అయి, మంచి ముహూర్తాన కొడుకును కన్నది. ఆ పిల్లవాడికి శంఖచూడుడు అని పేరు పెట్టుకుని తల్లిదండ్రులు అమిత గారాబంగా పెంచారు.


శంఖచూడుడు కాలక్రమాన శుక్రాచార్యుల వద్ద సకల విద్యలూ నేర్చుకుని, పెద్దవాడయాక తల్లిదండ్రుల అనుమతితో వింధ్యపర్వతానికి వెళ్ళి, అక్కడ బ్రహ్మను గురించి అతి దీర్ఘమైన తపస్సు చేశాడు. నిరాహారుడై, ఒంటి కాలిపై నిలబడి శంఖ చూడుడు చేస్తున్న తపస్సుకు బ్రహ్మ సంతోషించి, అతని ఎదట ప్రత్యక్షమై, "నాయనా, వరం కోరుకో," అన్నాడు.

"దేవా, నేను దేవ, రాక్షస, నాగ, మానవ గణాలను జయించే బలపరాక్రమాలను పొందాలి; మూడు లోకాలనూ జయించి పరిపాలించాలి; సకల భోగాలూ అనుభవించాలి. ఇదే నా కోరిక," అన్నాడు శంఖ చూడుడు.

బ్రహ్మదేవుడు అతను కోరినట్టు వరం ఇస్తూ, "నాయనా, నువు బదరికాశ్రమానికి వెళ్ళు. అక్కడ తులసి అనే కన్య తపస్సు చేసుకుంటూ కనిపిస్తుంది. నువు ఆమెను పెళ్ళాడి సుఖంగా ఉండు," అని చెప్పి అదృశ్యుడయాడు.



CHANDAMAMA (Telugu) MAY 1972 92 Paise Including Excise Duty Regd. No. M. 4854




శివపురాణం



# శివపురాణం

## 17

బ్రహ్మవల్ల వరాలు పొందిన శంఖచూడుడు, బ్రహ్మ ఆదేశాన్ని అనుసరించి బదరికాశ్రమానికి వచ్చి, తులసి అనే కన్య తపస్సు చేసుకుంటూ ఉండగా చూశాడు. ఆమె దివ్యసౌందర్యం చూడగానే శంఖచూడుడికి మోహం కలిగింది.

అతను ఆమెను సమీపించి, "సుందరీ, నువు ఎక్కడి దానివి? ఈ వనంలో ఒంటరిగా ఎందుకు ఉంటున్నావు?" అని అడిగాడు.

తులసి కూడా శంఖచూడుణ్ణి చూసి, అతని అందానికి మురిసిపోయి, "నేను ధర్మధ్వజు డనే రాజుకూతుర్ని. నా పేరు తులసి. నాకు మహావీరుడు భర్త కావాలనీ, మహా పతివ్రతగా నాకు శాశ్వత కీర్తి రావాలనీ కోరి తపస్సు చేస్తున్నాను. నువు ఎవరు?" అని అడిగింది.

"నేను దంభుడు అనే దానవరాజు కొడుకును. నా పేరు శంఖచూడుడు. నేను బ్రహ్మను గురించి తపస్సు చేసి త్రిలోకాధిపత్యం వహించేటట్టు వరం పొందాను. నిన్ను పెళ్ళాడమని బ్రహ్మ నన్ను ఆదేశించాడు. అందుచేత మనం భార్యాభర్తలమై సుఖంగా ఉండవచ్చు." అని శంఖచూడుడు ఆమెతో అన్నాడు.

వాళ్ళు అప్పుడే గాంధర్వ వివాహం చేసుకుని, కొండలలోనూ, నదుల వెంబడీ, వనాలలోనూ కొంతకాలం విహారాలు చేసి, తరవాత శంఖచూడుడి ఇంటికి వెళ్ళి, జరిగిన సంగతులన్నీ దంభుడికీ, ఆయన భార్యకూ, శుక్రాచార్యుడికీ చెప్పారు. వారంతా సంతోషించారు. తరవాత దంభుడు శుక్రాచార్యుడి అనుమతితో, శంఖచూడుడికి రాజ్యాభిషేకం చేశాడు.

అట్ట చివరి బొమ్మ



శంఖచూడుడు తండ్రి నుంచి పొందిన రాజ్యాన్ని, శుక్రాచార్యుడి సలహాల ననుసరించి చక్కగా పాలిస్తూ దానవ శ్రేష్ఠుడన్న కీర్తి సంపాదించుకున్నాడు. ఇలా అతను పరిపాలన చేస్తూ ఉండగా ఒకనాడు కొందరు దానవ ప్రముఖులూ, శుక్రాచార్యుడూ అతనితో, "రాజా, బ్రహ్మ నీకు అపూర్వమైన వరాలు ఇచ్చి ఉన్నాడు. నీ పూర్వులకు దేవేంద్రుడు మొదలుగాగల దేవతలు అనేక ద్రోహాలు చేశారు. వాటికి ప్రతీకారం చేసే బాధ్యత నీ పైన ఉన్నది. ముందు నువు నీ సేనలతో వెళ్ళి, స్వర్గాన్ని ముట్టడించి, దేవతలను తరిమివేసి, స్వర్గాన్ని వశపరుచుకో," అని హితం చెప్పారు.

శంఖచూడుడు వాళ్ళు చెప్పినట్టే చేయ నిశ్చయించి, శుక్రాచార్యుణ్ణి మంచి ముహూర్తం చూడమని చెప్పి, ఆ ముహూర్తానికి తన సేనలతో వెళ్ళి, స్వర్గాన్ని ముట్టడించాడు.

శంఖచూడుడు స్వర్గం మీదికి దండెత్తి వస్తున్న వార్త చారుల వల్ల ముందేవిని, దేవేంద్రుడు కుమారస్వామినీ, దేవగణాల వాళ్ళనూ పిలిపించి, తాను కూడా యుద్ధానికి సిద్ధమయాడు.

దేవగణాలకూ, దానవగణాలకూ నలభై రోజుల పాటు అహోరాత్రాలు దారుణమైన యుద్ధం జరిగింది. యుద్ధంలో వెనక్కు తగ్గటం అన్నది దేవతలలో కనిపించింది గాని దానవులలో కానరాలేదు. దానవులు స్థిరంగా నిలబడి పోరాడుతూ ఉంటే దేవతలు పారిపోసాగారు.

అది చూసి ఇంద్రుడు, తనకు విజయం సాధ్యం కాదని గ్రహించి, శంఖచూడుడికి బ్రహ్మ ఇచ్చిన వరాలు ఉండటం జ్ఞాపకం తెచ్చుకుని, దేవసేనలను యుద్ధభూమి నుంచి మరల్చి, తాను శంఖచూడుడి వద్దకు వెళ్ళి, "శంఖచూడా, నువు కశ్యపమహర్షి సంతతివాడివి. నీ శౌర్య బలపరాక్రమాలకు ఎంతో సంతోషించాను. నువే త్రిలోకాలను పాలించు. మేమంతా నీకు సహాయం చేస్తాం," అన్నాడు.

శంఖచూడుడు ఇందుకు అంగీకరించి, "దేవేంద్రా, నువే నా ప్రతినిధిగా ఉండి, నా ఆజ్ఞకు లోబడి పరిపాలన సాగించు," అన్నాడు. తరవాత అతను తాను త్రిలోకాలకు అధిపతినని ప్రకటన చేసి, తన రాజధాని అయిన శోణితపురానికి వెళ్ళి, అక్కడినుంచే లోకాలన్నిటినీ పాలించసాగాడు. దేవేంద్రుడు మొదలైనవారు రోజూ అతన్ని సేవిస్తూ, అతని ఆజ్ఞలు నిర్వర్తిస్తున్నారు.

అయితే యజ్ఞయాగాదులు చేసే వాళ్ళు హవిర్భాగాలను ఇంకా దేవేంద్రుడు మొదలుగాగల వారికే ఇస్తున్నారు. ఆ హవిర్భాగాలు దానవులకు ఇచ్చేదాకా ఋషులనూ, బ్రాహ్మణులనూ బాధించమని శంఖచూడుడు తన దానవ మూకలను హెచ్చరించాడు. వాళ్ళు వెళ్ళి యజ్ఞయాగాదులను ధ్వంసం చెయ్యసాగారు.

ఋషులందరూ విష్ణువు వద్దకు వెళ్ళి, "శంఖచూడుడు పెట్టే బాధలు పడలేకుండా ఉన్నాం. వాణ్ణి చంపి మమ్మల్ని కాపాడు," అని మొరపెట్టుకున్నారు.

"శంఖచూడుడు నా అంశన పుట్టినవాడు. అతని భార్య తులసి లక్ష్మి అంశన పుట్టినది. అందుచేత నేను శంఖచూడుణ్ణి చంపను. మీరు శివుణ్ణి ఆశ్రయించండి," అన్నాడు విష్ణువు.



అప్పుడు ఋషులందరూ కైలాసానికి వెళ్ళి, తమను శంఖచూడుడు పెట్టే బాధల నుండి కాపాడమని శివుణ్ణి వేడుకున్నారు. శంఖచూడుడు మొదలైన దానవులను తాను చంపుతానని మాట ఇచ్చి, శివుడు వారిని పంపేశాడు.

ఈ సంగతి తెలిసి నారదుడు శంఖచూడుడి వద్దకు వెళ్ళి, "నిన్ను చంపుతానని శివుడు ఋషులకు మాట ఇచ్చాడట. ఆయన హఠాత్తుగా రుద్రగణాలతో వచ్చి పడేదాకా చూస్తూ ఊరుకోక, ముందు నువే సర్వ సైన్యాలతో దాడి వెళ్ళి కైలాసాన్ని ముట్టడించి, శివుణ్ణి జయించు," అని సలహా ఇచ్చి వెళ్ళిపోయాడు.

శంఖచూడుడు నారదుడి మాట ప్రకారం తన సేనలతో వెళ్ళి, కైలాసాన్ని ముట్టడించాడు. అది చూసి శివుడు అతనితో యుద్ధం చెయ్యటానికి భద్రకాళినీ, వీరభద్రగణాలనూ, కుమారగణాలనూ నంది చేత పిలిపించాడు. రుద్రగణాలకూ, దానవ సేనలకూ యుద్ధం ప్రారంభమయింది.

ఎంత కాలం యుద్ధం సాగినా శంఖచూడుడి సేనలు తరగక పోవటం శివుడికి ఆశ్చర్యం కలిగించింది. ఆయన విష్ణువును స్మరించి రప్పించి, "ఎన్నాళ్ళుగా యుద్ధం చేస్తున్నా శంఖచూడుడి సేనలు తరగవెందుచేత?" అని అడిగాడు.

దానికి విష్ణువు, "శంఖచూడుడి భార్య తులసి పాతివ్రత్యం అతనినీ, అతని సేనలనూ కాపాడుతున్నది. నేను తులసి పాతివ్రత్యం చెడగొట్టుతాను. అప్పుడు నువ్వు శంఖచూడుణ్ణి చంపు." అన్నాడు.

విష్ణువు శంఖచూడుడి రూపు ధరించి అతని ఇంటికి వెళ్ళి, తులసితో, "శివుడితో యుద్ధం చేస్తున్నాను. జయాపజయాలు తేలలేదు. నిన్ను చూసి చాలాకాలమయిందని వచ్చాను." అన్నాడు. తులసి ఆ మాట నమ్మి సంతోషించి, ఆ మాయ శంఖచూడుడికి భార్యగా మసలు కున్నది. ఆ విధంగా ఆమె పాతివ్రత్యం నశించింది.

వెంటనే శంఖచూడుడి సేనలు విపరీతంగా నష్టం కాసాగాయి. శివుడు శంఖచూడుణ్ణి తన త్రిశూలంతో చంపేశాడు.

ఆ రాత్రి విష్ణువు తన పక్కన నిద్రపోయేటప్పుడు తులసి అతని అసలు స్వరూపాన్ని కళ్ళారా చూసింది. ఎందుకంటే మాయా రూపాలు నిద్రలో పోతాయి. మాయా రూపంతో తనను మోసం చేసిన విష్ణువును శిల అయిపొమ్మని తులసి శపించింది.

"నువ్వు గండకీ నదిపై పోతావు. నేను సాలగ్రామాల రూపంలో ఆ నదిలో శాశ్వతంగా ఉంటాను. నీ పేర తులసిచెట్టు అంతటా పూజించబడుతుంది," అని చెప్పి, విష్ణువు ఆమెను గోలోకానికి తీసుకుపోయాడు.



CHANDAMAMA (Telugu) JUNE 1972 92 Paise Including Excise Duty Regd. No. M. 4854




శివపురాణం



# శివపురాణం

## 18

పూర్వం సాలంకాయను డనే మునికి శిలాదు డనే కొడుకు ఉండేవాడు. శిలాదుడికి సంతానం లేకపోగా, ఆయన కైలాసానికి వెళ్ళి, పార్వతీపరమేశ్వరులను గురించి ఘోరతపస్సు చేశాడు. పార్వతీపరమేశ్వరులు ప్రత్యక్షమై, శిలాదుడి కోరిక విని విచారించి, "నీకు సంతాన ప్రాప్తి లేదు. అయినా ఒక కుమారుడు లభిస్తాడు," అని చెప్పారు.

శిలాదుడు తన ఆశ్రమానికి తిరిగి వచ్చాడు. ఎంత కాలానాకీ కొడుకు కలగక పోయేసరికి ఆయన యజ్ఞం చేయ తల పెట్టాడు.

యజ్ఞగుండం తవ్వుతూ ఉండగా అందులో ఒక అందమైన బాలుడు దొరి కాడు. శిలాదుడు ఆ కుమారుడికి నందుడు అని పేరు పెట్టి పెంచసాగాడు.

ఒకసారి మిత్రావరుణులు అనే మునులు శిలాదుడి ఆశ్రమానికి వచ్చి, నందుణ్ణి చూసి, ఆ కుర్రవాడు అల్పాయువని చెప్పి, శిలాదుడికి విచారం కలిగించారు.

నందుడు తండ్రి విచారానికి కారణం తెలుసుకుని, కేదారానికి వెళ్ళి, పార్వతీ పరమేశ్వరులను గురించి తపస్సు చేశాడు. చాలాకాలానికి పార్వతీపరమేశ్వరులు ప్రత్యక్షమై, నందుణ్ణి వరం కోరుకోమన్నారు.

"దీర్ఘాయువు గలిగి, నేను మీ సేవలు చేస్తూ, లోక ప్రసిద్ధుడుగా పూజించబడే టట్టు అనుగ్రహించండి," అని నందుడు వేడుకున్నాడు.

పార్వతీపరమేశ్వరులు అతనికి కోరిన వరం ఇస్తూ, అతనికి నందీశ్వరుడు అని పేరు పెట్టి, గణాధిపత్యం ఇచ్చారు. శివుడు నందుణ్ణి అభిషేకించటానికి తన జటాజూటం

నుంచి గంగను ఉపయోగించాడు. ఆ అభి షేక జలం అయిదు నదులై, త్రిస్రోత, జటోదక, స్వర్ణోదక, జంబూ, వృషధ్వజ అనే పేర్లతో ప్రవహించింది.

ఇలా అభిషేకించిన నందీశ్వరుణ్ణి పార్వతీ పరమేశ్వరులు తమ వెంట కైలాసానికి తీసుకు వెళ్ళారు. తరవాత నందీశ్వరుడు మరుత్తుల కుమార్తె అయిన సుకీర్తిని పెళ్ళాడాడు. నందీశ్వరుడి తల్లిదండ్రుల పక్షాల వారంతా శివుడి ఆజ్ఞప్రకారం రుద్రగణాలలో చేరిపోయారు.

సృష్టికి ఆదికాలంలో త్రిమూర్తులు పుట్టారు. అప్పుడు బ్రహ్మ, విష్ణు మహేశ్వరులతో, "నేనే పరబ్రహ్మ స్వరూపాన్ని. మీరు నన్ను సేవించండి," అన్నాడు.

ఈ మాట విని ఈశ్వరుడు రౌద్రాకారం ధరించి హుంకరించే సరికి, ఒక భయంకరాకారుడు, మూడు కళ్ళు గలిగి, తెల్లని శరీరంతో, త్రిశూలం మొదలైన ఆయుధాలు ధరించి, దిక్కులు దద్దరిల్లేటట్టు డమరుకం మోగిస్తూ పుట్టుకు వచ్చి, "పరమేశ్వరా, నన్ను ఎందుకు పుట్టించావు?" అని అడిగాడు.

"ఈ బ్రహ్మను శిక్షించు," అన్నాడు ఈశ్వరుడు.

అప్పుడా రాక్షసాకారం బ్రహ్మకు గల అయిదు తలలలో నడిమి తలను తన చిటికెన వేలి గోరుతో ఖండించి, విసిరి వేసింది. ఆ తల పడిన చోటు బ్రహ్మకపాలం. బ్రహ్మ తలను ఖండించిన చోటు కాశీ.



బ్రహ్మను శిక్షించేందుకు ఈశ్వరుడు తాను సృష్టించిన రాక్షసాకారానికి కాలభైరవు డని పేరు పెట్టి, తన అంగరక్షకుడుగా నియమించాడు.

అయితే బ్రహ్మహత్యాపాతకం భయంకర రూపంతో కాలభైరవుడి వెంట పడింది. అది చూసి ఈశ్వరుడు, "కాలభైరవా, నువ్వు ఈ బ్రహ్మహత్యను వదిలించుకోవటానికి తీర్థయాత్రలు చేసి, కాశీక్షేత్రానికి వెళ్ళు. అక్కడ నీకు బ్రహ్మహత్యాపాతకం నుంచి విముక్తి కలుగుతుంది," అని కాలభైరవు డితో చెప్పాడు.

అలాగే కాలభైరవుడు తీర్థయాత్రలు చాలా కాలం చేసి, కాశీక్షేత్రానికి చేరి, గంగా స్నానం చేసి, పవిత్రుడై, కాశీలోనే ఉండి, కాశీనగరానికి క్షేత్రపాలకుడై పూజించ బడుతూ వచ్చాడు.

పూర్వం వ్యాఘ్రపాదు డనే ముని ఉండే వాడు. ఆయన భార్య విమల. వారిద్దరూ శివ భక్తులు. వారు శివుణ్ణి ఆరాధించగా, ఈశ్వరానుగ్రహం వల్ల వారికి ఒక కుమారుడు కలిగాడు. ఆ పిల్లవాడికి వారు ఉపమన్యువు అని పేరు పెట్టుకున్నారు.

విమల పుట్టింటి వారు విమలనూ, ఉప మన్యువునూ తమ ఇంటికి తీసుకుపోయి కొంతకాలం ఉంచుకుని, తరవాత వ్యాఘ్ర పాదుడి వద్దకు పంపేశారు.

అయిదేళ్ళ వయసువాడైన ఉపమన్యువు ఒకనాడు తల్లితో, "అమ్మా, నాకు పాలు కావాలి," అన్నాడు.



"మనం దరిద్రులం, నాయనా. నీ మేన మామలు ధనవంతులు గనక వాళ్ళు నీకు పాలూ, పెరుగూ పెట్టారు. మనకు పాలు లేవు." అని విమల కొడుకుతో అన్నది.

ఆమె సత్తుపిండి నీటిలో కలిపి ఇస్తే ఉపమన్యువు తాగక, గుక్కపట్టి ఏడవ నారంభించాడు.

"మనం దరిద్రులమని చెప్పినా విని పించుకోక ఏడుస్తున్నావు. నేను ఏం చేసేదిరా?" అన్నది తల్లి.

"మన దరిద్రం తీరే మార్గం ఏమిటి?" అని ఉపమన్యువు తల్లిని అడిగాడు.

విమల తన కొడుకును వ్యాఘ్రపాదుడి వద్దకు తీసుకు పోయి జరిగినదంతా చెప్పింది.

వ్యాఘ్రపాదుడు ఉపమన్యువుకు శివ పంచాక్షరీ మంత్రం చెప్పి, "బాబూ, నువు కైలాస పర్వతానికి వెళ్ళి ఈ మంత్రం జపించావంటే పార్వతీ పరమేశ్వరులు ప్రత్యక్షమై నీకు కోరిన వరం ఇస్తారు," అని చెప్పాడు.

ఉపమన్యువు కైలాస పర్వతానికి వెళ్ళి శివపంచాక్షరి జపిస్తూ కూర్చున్నాడు.

శివుడు వికార రూపంలో ఉపమన్యువు దగ్గిరికి వచ్చి, "ఈ అరణ్యంలో ఎందుకు ఒంటరిగా ఉన్నావు? క్రూర జంతువులు బాధిస్తాయి. ఇంటికి వెళ్ళు," అన్నాడు.

"నేను నీ సలహా అడగలేదు. నాకు పార్వతీ పరమేశ్వరుల రక్ష ఉన్నది," అని ఉపమన్యువు కళ్ళు మూసుకున్నాడు.


మరు క్షణం పులి అరుస్తూ తన మీదికి వస్తున్నట్టు ధ్వని వినిపించింది, కాని ఉపమన్యువు కళ్ళు తెరవలేదు.

పార్వతీపరమేశ్వరులు కుర్రవాడి ధైర్యసాహసాలకు మెచ్చి, అతని ఎదట ప్రత్యక్షమై, వరాలు కోరుకోమన్నారు.

శివుడు పార్థివలింగ రూపంలో రోజూ తన పూజలు పొందేటట్టూ, తనకు అష్ట ఐశ్వర్యాలూ సిద్ధించేటట్టూ ఉపమన్యువు కోరాడు. పార్వతీపరమేశ్వరులు అతను కోరిన వరాలు ఇచ్చారు. ఉపమన్యువు ఇంటికి తిరిగి వచ్చి, సుఖంగా ఉన్నాడు.



CHANDAMAMA (Telugu) AUGUST 1972 92 Paise Including Excise Duty Regd. No. M. 4854




శివపురాణం



# శివపురాణం

## 19

ఆదికాలంలో దేవతలూ, దానవులూ యుద్ధాలు చేసుకున్నప్పుడు దేవతలు అధికంగా చచ్చిపోతూ వచ్చారు. అప్పుడు దేవతలు మేరుపర్వతం మీదికి వెళ్ళి, విష్ణువు దర్శనం చేసుకుని తమకు చావు లేకుండా చెయ్యమని వేడుకున్నారు.

"మీరు దానవులతో కలిసి, పాలసముద్రంలో ఓషధులనన్నిటినీ వేసి, మందర పర్వతాన్ని కవ్వంగా ఉపయోగించి చిలికినట్టయితే, పాలసముద్రంలో నుంచి అమృతం పుట్టుతుంది. అది మీకు చావు లేకుండా చేస్తుంది," అని విష్ణువు వారితో చెప్పాడు.

దేవతలు వెళ్ళి మందర పర్వతాన్ని పెకలించటానికి ప్రయత్నించారు. కాని అది కదలను కూడా లేదు. అప్పుడు దేవతలు మళ్ళీ మేరుపర్వతానికి వెళ్ళి విష్ణుమూర్తితో, మందరపర్వతాన్ని కదల్చటం తమ వల్ల కాలేదని మొరపెట్టుకున్నారు.

విష్ణుమూర్తి ఆదిశేషుడితో, "ఈ దేవతల కోసం నువు వెళ్ళి, మందర పర్వతాన్ని పెకలించి, దాన్ని తీసుకుపోయి పాలసముద్రంలో వేసిరా!" అన్నాడు. ఆదిశేషుడు అలాగే చేశాడు.

పాలసముద్రాన్ని చిలికితే వచ్చే అమృతంలో కొంత భాగం సముద్రుడికి ఇవ్వటానికి దేవతలు ఒప్పుకున్నారు. కాని అంతటితో సమస్య తీరిపోలేదు. మందర పర్వతం పాలసముద్రంలో మునిగిపోయింది. దాన్ని ఎవరన్నా ఎత్తి పట్టి ఉంచితే తప్ప పాల సముద్రాన్ని చిలకటం దేవదానవులకు సాధ్యం కాదు.

దేవతలు మళ్ళీ విష్ణువును ప్రార్థించారు. విష్ణువు మహా కూర్మరూపం ధరించి తన

అట్ట చివరి బొమ్మ



వీపున మందరపర్వతాన్ని పైకెత్తి ఉంచటానికి ఒప్పుకున్నాడు.

అంతా అమరింది గాని చిలకటానికి కవ్వపుతాడు లేదు. అప్పుడు వాసుకి తాను కవ్వపు తాడుగా ఉండటానికి ఒప్పుకున్నాడు. దేవతలూ, దానవులూ పాలసముద్రాన్ని మథించసాగారు. అయితే దేవతలు వాసుకిని తల వైపు పట్టుకుంటామంటే దానవులు అందుకు ఒప్పుకోక, "మేము వాసుకి తోక పట్టుకుంటామా? అదేమీ కుదరదు," అని వాళ్ళే వాసుకి తలను పట్టుకుని, తోకను దేవతల కిచ్చారు.

సముద్రమథనం జరుగుతూ ఉంటే వాసుకి నోళ్ళ నుంచి వెలువడే సెగలూ, పొగలూ దానవులను బాధించసాగాయి. ఆ సెగ దేవతలకు కూడా కొద్దిగా సోకింది గాని, వారు అంతగా బాధపడ లేదు.

దేవదానవులు ఈ విధంగా ఎంతో శ్రమ పడి పాలసముద్రాన్ని దీర్ఘకాలం మథించిన మీదట అందులో నుంచి అమృతం పుట్టక పోగా హాలాహలం పుట్టి, అమిత వేగంగా అన్ని దిక్కులకూ, వ్యాపించసాగింది.

ఇది చూసి అందరూ హడలిపోయారు. ఏం చెయ్యటానికీ తోచక, వేగంగా కైలాస పర్వతానికి పరిగెత్తి, అక్కడ పార్వతీ సహితుడై ఉన్న శివుణ్ణి చూసి, "దేవదేవా! హాలాహల విషం మూడు లోకాలనూ దహించుతున్నది. దాని నుంచి మమ్మల్ని రక్షించు. లోకాల కన్నిటికీ నువే ఈశ్వరుడివి. నీ పరమ జ్యోతిస్సు దేవతలకూ, దేవేంద్రుడికీ, బ్రహ్మకూ, విష్ణువుకూ అంతు చిక్కేది కాదు," అని స్తోత్రాలు చేశారు.

వారి దుస్థితి చూసి శివుడు జాలిపడి పార్వతితో, "వీళ్ళు క్షీరసాగరాన్ని మథించటం చేత కాలకూట విషం పుట్టి ప్రజలకు ఎలాటి విపత్తు సంప్రాప్త మయిందో చూశావా? అందుచేత నేను విషాన్ని మింగేస్తాను," అన్నాడు.

అందుకు పార్వతి ఒప్పుకున్నది.

అప్పుడు శివుడు, లోకాలన్నిటికీ వ్యాపించే హాలాహల విషమంతా పోగుచేసి తన

అరచేతిలోకి తీసుకుని, నోట్లో వేసుకుని లోపలకు మింగకుండా కంఠంలో వుంచాడు. మహేశ్వరుడి పైన కూడా ఆ విషం తన ప్రభావాన్ని కొద్దిగా చూపకుండా ఊరుకో లేదు. ఆయన కంఠం కమిరిపోయింది. అది మొదలు శివుడికి నీలకంఠుడు అనే పేరు వచ్చింది.

శివుడు కాలకూటాన్ని తొలగించిన మీదట దేవదానవులు తిరిగి పాలసముద్రాన్ని మథించసాగారు. అప్పుడు అందులో నుంచి కామధేనువు పుట్టింది; దాన్ని యజ్ఞంకోసం ఋషులు తీసుకున్నారు. తరవాత ఉచ్చై శ్రవమనే తెల్లని, గొప్ప గుర్రం పుట్టింది. బలి దాన్ని కోరాడు; ఇంద్రుడు కోరుకుందా మనుకున్నాడు గాని, విష్ణువు వారించాడు.

తరవాత పాలసముద్రం నుంచి ఐరావతం అనే తెల్లని ఏనుగు, నాలుగు దంతాలు కలది పుట్టింది. తరవాత పారిజాతం పుట్టింది. ఆ తరవాత అప్సరసలు పుట్టారు. తరవాత దేదీప్యమానంగా వెలిగిపోతూ లక్ష్మీదేవి పుట్టింది. ఆమె స్వయంగా విష్ణువు వక్షస్థలాన్ని వరించింది. లక్ష్మీదేవితోబాటు పాలసముద్రం నుంచి చంద్రుడు పుట్టాడు.

అన్నీ పుట్టిన అనంతరం పాలసముద్రం నుంచి ధన్వంతరి, అమృతకలశం చేత పట్టుకుని బయటికి వచ్చాడు. వెంటనే దైత్యులు ఆ అమృత కలశాన్ని చప్పున లాగేసుకుని దూరంగా పారిపోయి, అక్కడ తమలో తాము కీచులాడుకో సాగారు. అప్పుడు దేవతలు విష్ణువుతో మొరపెట్టు



కోగా, "విచారించకండి. నేను మాయచేసి, అమృతం మీకే దక్కేటట్టు చేస్తాను," అని విష్ణువు అన్నాడు.

వెంటనే ఆయన అమిత ఆకర్షణీయమైన మోహినీరూపం ధరించి దైత్యులను సమీపించాడు. వాళ్ళు ఆ మోహినిని చూసి మతులు పోయినట్టుగా అయిపోయారు. వాళ్ళు మోహినితో, "ఈ అమృతం కోసం మాలోమేము తగువు లాడుకుంటున్నాం. నువు న్యాయంగా మాకు దీన్ని పంచిపెట్టు," అన్నారు.

"నేను చేసే దానికి ఆక్షేపణ చెప్పకుండా ఉంటే అలాగే పంచుతాను," అన్నది మోహిని. దైత్యులు అందుకు ఒప్పుకున్నారు.

మోహిని దేవతలనూ, దానవులనూ వేరు వేరు పంక్తులలో కూర్చోబెట్టి, దేవతల పంక్తికి అమృతం పంచసాగింది. అన్న మాటకు కట్టుబడి దైత్యులు అభ్యంతరం చెప్పలేదు. దేవతలందరూ అమృతం తాగగానే విష్ణువు మోహినీరూపం ఉపసంహరించుకున్నాడు.

విష్ణువు మోహినీ రూపంతో దైత్యులను మభ్యపెట్టి, అమృతాన్ని దేవతల కిచ్చిన మాట విని శివుడు, పార్వతీదేవితో సహా వృషభవాహనం మీద విష్ణువును చూడ వచ్చి, "నీ అవతారాలన్నీ చూశాను గాని, మోహినీరూపం ధరించావట, ఆ రూపాన్ని చూద్దామని వచ్చాం," అన్నాడు.


"దైత్యులను సమ్మోహించటానికి ధరించిన ఆ రూపాన్ని మీకు కూడా చూపిస్తాను," అంటూ విష్ణువు అదృశ్యుడై, మోహినీ రూపంలో బంతితో ఆడుతూ కనిపించాడు.

ఆ మోహినిని చూడగానే శివుడు తన వెంట ఉన్న పార్వతినీ, ప్రమథగణాలనూ పూర్తిగా మరచిపోయాడు. అందరూ చూస్తూ ఉండగానే శివుడు ఆ మోహిని వెంట పోసాగాడు. అంతలోనే ఆయనకు ఇదంతా విష్ణుమాయ అన్నది స్ఫురణకు వచ్చింది. విష్ణువు శివుడి ఆత్మనిష్ఠను మెచ్చుకున్నాడు.

తరవాత శివుడు విష్ణువు వద్ద సెలవు పుచ్చుకుని పార్వతితో సహా కైలాసానికి తిరిగి వచ్చాడు.



CHANDAMAMA (Telugu) SEPT. 1972 92 Paise Including Excise Duty Regd. No. M. 4854




శివపురాణం



# శివపురాణం

## 20

పూర్వం అయోధ్యానగరాన్ని బాహువు అనే రాజు పరిపాలించే వాడు. హైహయులు ఈయన రాజ్యం మీద దాడి చేసి ఇతన్ని వెళ్ళగొట్టారు. అప్పుడాయన తన భార్యలతో సహా అడవులకు వెళ్ళాడు.

అక్కడ ఉండగా బాహువు భార్యలలో ఒకతె గర్భవతి అయింది. ఇంతలో బాహువు మరణించాడు. గర్భవతి అయిన భార్య తన భర్తతో సహగమనం చేయబోయింది. కాని ఔర్వుడనే ముని ఆమెను వారించి, ఆమెకు కొడుకు కలుగుతాడని చెప్పాడు.

ఇది తెలిసి ఆమె సవతులు ఆమెకు విషం పెట్టారు. ఆ విషంతోసహా ఆమెకు పిల్లవాడు పుట్టాడు. అతనికి సగరుడు (విషంతో కూడినవాడు) అన్న పేరు వచ్చింది.

సగరుడు కాలక్రమాన చక్రవర్తి అయి, ఔర్వుడి సహాయంతో అనేక అశ్వమేధాలు చేశాడు. అతడికి సుమతీ, కేశినీ అని ఇద్దరు భార్యలు. అయితే అతనికి సంతానం లేక పోయింది. అందుచేత ఆయన నగరం విడిచి అడవికి వెళ్ళి, ఔర్వుణ్ణి కలుసుకున్నాడు.

సగరుడి భార్యలకు సంతానం కలుగుతుందనీ, అతను తన భార్యలతో కైలాసానికి వెళ్ళి తపస్సు చెయ్యాలనీ ఔర్వుడు చెప్పాడు. సగరుడు అలాగే కైలాసానికి వెళ్ళి, శివుణ్ణి గురించి తపస్సు చేశాడు. శివుడు సగరుడికి సంతానం కలిగేటట్టు వరమిచ్చాడు.

సగరుడు నగరానికి తిరిగి వచ్చినాక అతని ఇద్దరు భార్యలూ గర్భవతులై, ఇద్దరు మగ పిల్లలను కన్నారు. కేశినికి అసమంజసుడు కలిగాడు. ఔర్వుడు వచ్చి, సుమతికి పుట్టిన వాడిలో అరవైవేలమంది కుమారులున్నట్టు చెప్పి, ఆ బిడ్డను అరవైవేల

అట్ట చివరి బొమ్మ



ఖండాలు చేయించి, కుండలలో పెట్టించాడు. ఆ కుండలలో నుంచి అరవైవేల మంది కుమారులు పుట్టారు.

కేశిని కొడుకైన అసమంజసుడు మహా భయంకరమైన పనులు చేసేవాడు. వాడు చిన్న వాళ్ళనూ, పెద్ద వాళ్ళనూ నదిలో పారేసేవాడు. వాడి చర్యలు సహించలేక ప్రజలు వెళ్ళి సగరుడితో చెప్పుకున్నారు. సగరుడు అసమంజసుణ్ణి నగరం నుంచి వెళ్ళగొట్టించాడు.

తరవాత సగరుడు మళ్ళీ అశ్వమేధ యాగం చేయనిశ్చయించి, యాగాశ్వాన్ని వదిలి, దాని వెంట తన అరవైవేలమంది కొడుకులనూ పంపాడు.

సగరుడు వదిలిన అశ్వం ఒక చోట తిరుగుతూ అకస్మికంగా మాయమయింది. సగరుడి కొడుకులు దాని కోసం వెతికి, వెతికి, లాభం లేక నగరానికి తిరిగి వెళ్ళి, గుర్రం మాయమయిందని తండ్రితో చెప్పారు. సగరుడు వారి మీద మండిపడి, గుర్రం లేకుండా నగరంలోకి అడుగు పెట్టవద్దని కొడుకులను శాసించాడు.

వాళ్ళు గుర్రం మాయమైన చోటికి వెళ్ళి అక్కడ తవ్వ నారంభించారు. వాళ్ళు అలా పాతాళలోకం దాకా తవ్వుతూ వెళ్ళినాక, వారికి తపస్సు చేసుకుంటున్న కపిలమహాముని కనిపించాడు. ఆయన సమీపంలోనే యాగాశ్వం నిలిచి ఉన్నది.

ఆయనే గుర్రాన్ని దొంగిలించాడనుకుని సగరుడి కొడుకులు ఆయనను పట్టబోయి, ఆయన కళ్ళు తెరిచి చూసేసరికి అరవైవేల మందీ అరవైవేల బూడిద కుప్పలు అయిపోయారు.

ఈ వార్త నారదుడి ద్వారా సగరుడికి తెలిసింది. ఆయన గుర్రాన్ని ఎలాగైనా తీసుకు రమ్మని, అసమంజసుడి కొడుకైన అంశుమంతుణ్ణి పంపాడు.

అంశుమంతుడు పాతాళలోకం చేరి, కపిలుడున్న చోటికి వెళ్ళి, గుర్రాన్ని అడగకుండా కపిలుడికి నమస్కారం చేస్తూ నిలబడ్డాడు.

కపిలుడు అతన్ని చూసి సంతోషించి, "నాయనా, గుర్రాన్ని తీసుకుపో. వీళ్ళందరూ ఇక్కడ భస్మమైనారని మీ తాతతో చెప్పు," అన్నాడు.

"మహాత్మా, ఈ చనిపోయిన తండ్రులకు స్వర్గప్రాప్తి కలిగే మార్గం చెప్పండి," అని అంశుమంతుడు కపిలుణ్ణి వేడుకున్నాడు.

"వీళ్ళ పాపం ఇంకా కొన్ని జన్మలెత్తితే గాని తీరదు. నీకు కలగబోయే మనమడి ద్వారా వీరికి ముక్తి లభిస్తుంది," అని కపిల మహాముని అంశుమంతుడికి చెప్పాడు.

అంశుమంతుడు యాగాశ్వాన్ని తెచ్చి సగరుడికి ఇచ్చాడు. సగరుడు అశ్వమేధ యాగం పూర్తి చేసి, అంశుమంతుడికి పట్టాభిషేకం చేశాడు.

రాజైనాక కూడా అంశుమంతుడికి తన తండ్రుల ముక్తి గురించి విచారం పట్టుకున్నది. ఒకసారి గరుత్మంతుడు అతనితో, "గంగను నీ తండ్రుల భస్మం పైన ప్రవహింప జేస్తే వారికి సద్గతులు కలుగుతాయి," అని చెప్పాడు.

గంగను భూమికి అవతరింప జెయ్యటానికై అంశుమంతుడు, తన కొడుకైన దిలీపుడికి పట్టం గట్టి, తాను అరణ్యాలలో తపస్సు ప్రారంభించాడు. కాని ఆ తపస్సు ఫలించకుండానే అతను చనిపోయాడు.

దిలీపుడి కొడుకు భగీరథుడు. అతను తన తాతలకు కలిగిన దుస్థితి గురించి విని, వారిని ఎలాగైనా ఉద్ధరించాలన్న కోరిక కలిగి బ్రహ్మను ఆరాధించాడు.



బ్రహ్మ ప్రత్యక్షమై, భగీధుడు ధర్మం తప్పకుండా తన ఇష్టం వచ్చిన రీతిగా జీవించేటట్టు వరం ఇచ్చాడు.

తరవాత భగీరథుడు గంగను గురించి దీర్ఘకాలం తపస్సు చేశాడు. గంగాదేవి అతనికి సాక్షాత్కరించి, అతని కోరిక విని, "నేను స్వర్గం నుంచి భూమి మీదికి పడేటప్పుడు నా వేగాన్ని ఎవరు ఆపగలరు? నేను భూమిని బద్దలు చేసుకుని తిన్నగా పాతాళానికి దిగిపోతాను గదా?" అని భగీరథుణ్ణి అడిగింది.

"తల్లీ, ప్రపంచమంతా తనలో ఇముడ్చుకున్న శివుడు నిన్ను భరించ గలుగుతాడు," అన్నాడు భగీరథుడు.

"నేను ఒక వేళ భూమికి వస్తే పాపులందరూ తమ పాపాలను నాలో కడుగుకుంటారు. అలా సంప్రాప్తమైన ఆ పాపాలను నేనెలా వదిలించుకోను?" అని గంగ మళ్ళీ అడిగింది.

"దేవీ, అన్ని పాపాలనూ హరించగల హరిని తమలో నిలుపుకున్న పుణ్యాత్ముల స్నానం చేత, పాపాత్ములు నీలో కలిపే పాపాలు పరిహారమవుతాయి," అన్నాడు భగీరథుడు.

"సరే, నీ కోరిక నెరవేర్చుతాను. స్వర్గం నుంచి పడేటప్పుడు నన్ను భరించేటట్టు శివుణ్ణి ఒప్పించు," అని గంగ అంతర్ధానమయింది.

భగీరథుడు శివుణ్ణి గురించి తపస్సు చేసి ఆ దేవుణ్ణి సులభంగానే ప్రత్యక్షం చేసుకుని, ఆయనకు తన కోరిక తెలిపాడు.

గంగను భరించటానికి శివుడు అంగీకరించాడు.

ఆకాశం నుంచి గంగ తిన్నగా శివుడి శిరస్సు మీద పడింది; తరవాత శివుడి జడల నుండి జారి భూమిపైన ప్రవహించనారంభించింది. భగీరథుడు వాయువేగం గల రథం మీద దారి తీస్తూ పోతూ ఉంటే గంగ అతని వెనకగా వెళ్ళి, సగరుడి కొడుకుల భస్మ రాసుల పైన ప్రవహించి సముద్రం అయింది. అందుకే సముద్రానికి సాగరం అనే పేరు వచ్చింది.



CHANDAMAMA (Telugu) OCT. 1972 92 Paise Including Excise Duty Regd. No. M. 4854



శివపురాణం



# శివపురాణం

## 21

స్వాయంభువ మనువు కాలంలో అరవై సంవత్సరాల పాటు వర్షాలు లేక అతి భయంకరమైన పరిస్థితి ఏర్పడింది. జనక్షయమూ, జంతుక్షయమూ విపరీతంగా కలిగి జీవితమంతా అస్తవ్యస్తమయింది. అది చూసి బ్రహ్మ, ప్రపంచమంతటినీ చక్కదిద్దగల వాణ్ణి రాజుగా చెయ్యాలని సంకల్పించాడు. ఆయనకు మనువంశంలో రిపుంజయుడనే సకలసద్గుణ సంపన్నుడు కనిపించాడు. రిపుంజయుడితో బ్రహ్మ, "నాయనా, నీకు ప్రపంచాధిపత్యం ఇస్తాను. దివోదాసు అనే పేరుతో భూమిని సమర్థంగా పాలించు. వాసుకి కుమార్తె అయిన అనంగమోహిని నీకు భార్య అవుతుంది," అన్నాడు.

ఆ మాటకు రిపుంజయుడు, "తాతగారూ, ఒక్క వరం అనుగ్రహిస్తే మీరు కోరినట్టు భూభారం వహిస్తాను. ఆ వరం ఏమిటంటే, భూమి మీద కిందిలోకాల వాళ్ళు గాని పైలోకాల వాళ్ళు గాని ఒక్కడు కూడా ఉండరాదు," అన్నాడు.

అందుకు బ్రహ్మ సమ్మతించి, ఈ సంగతి కాశీవిశ్వేశ్వరుడికి తెలిపాడు. విశ్వేశ్వరుడు సరే నన్న మీదట ఆయన రిపుంజయుడికి పట్టంకట్టి తనలోకానికి వెళ్ళిపోయాడు. తరవాత రిపుంజయుడు దివోదాసుడు అనే బిరుదుతో రాజై, ప్రపంచం మీద దేవతలు గాని, పాతాళవాసులు గాని ఉండరాదని చాటింపువేశాడు.

ఈ చాటింపు విని భూమి మీద ఎక్కడెక్కడ ఉంటున్న దేవతలూ కాశీవిశ్వనాథుడి వద్దకు వచ్చారు. వారితో శివుడు, "నన్ను ముందుగా అడిగే బ్రహ్మ దివోదాసుకు వరం ఇచ్చాడు. మనమంతా మందరపర్వతానికి పోదాం," అన్నాడు.

అట్ట చివరి బొమ్మ



ప్రపంచం మీద ఎక్కడా దేవతలు లేకుండా పోయారు. దేవాలయాలలో పూజలు నిలిచి పోయాయి. దివోదాసు కాశీని రాజధానిగా చేసుకుని, ఎనిమిదివేల ఏళ్ళు ఎలాటి వంకా లేకుండా పరిపాలించాడు. దీర్ఘకాలంగా భూమినే ఆశ్రయించుకుని, అదే తమ జన్మభూమిగా ఉన్న చిల్లర దేవతలూ, దానవులూ దివోదాసు దగ్గిర కొలువుచేశారు.

భూలోకంలో తమ ఆటకట్టయినందుకు దేవతలు మహా బాధపడి పోయి, "దివోదాసును రాజ్యభ్రష్టుణ్ణి చెయ్యటం ఎలా?" అని తమ గురువైన బృహస్పతిని అడిగారు.

"అగ్నీ, వాయువూ, వరుణుడూ మన వాళ్ళే గద. వాళ్ళు తమ శక్తులను ఉపసంహరించారంటే భూమిలో జీవితం స్తంభించిపోతుంది. ముందు అగ్నిని సహాయ నిరాకరణం చెయ్యమనండి," అన్నాడు బృహస్పతి.

కాశీలో ఎక్కడా నిప్పు రాజలేదు. వంటలు లేవు. దివోదాసుడికి మాత్రం ఎండ సహాయంతో భోజనం చేసి పెట్టారు. దివోదాసుడికి భోజనం అందిందిగాని ప్రజలు వచ్చి గోలపెట్టారు. సంగతిగ్రహించి దివోదాసుడు, "ఇది దేవతల దుర్మార్గం. మీరేమీ భయపడకండి. నా తపస్సు చేత మీకు నేనే అగ్నినీ, వాయువునూ, వర్షాలనూ ఇస్తాను," అని ప్రజలకు చెప్పి, అంతపనీ చేశాడు. దేవతల ఎత్తుపారలేదు.

అయితే శివుడికే కాశీవియోగం కష్టమయింది. అయనకు కూడా దివోదాసు పరిపాలన అంతం చెయ్యాలనిపించింది. ఆయన అరవైనలుగురు సిద్ధయోగినులను పిలిచి, "మీరు మారువేషాలలో కాశీనగరానికి వెళ్ళి, అక్కడి స్త్రీల పాతివ్రత్యాన్నీ, పురుషుల ధర్మబుద్ధినీ చెడగొట్టండి. అలా అయితేగాని దివోదాసుడు పతనం కాడు," అని హెచ్చరించాడు.

సిద్ధయోగినులు శివుడు చెప్పినట్టే చేశారు. కాని శివుడు సాధించమన్న కార్యం సాధించలేక పోయారు. అది గ్రహించి శివుడు సూర్యుడితో, "నువు కాశీకి వెళ్ళి

దివోదాసు ఎలాగైనా ధర్మం తప్పేటట్టు చెయ్యి." అన్నాడు.

సూర్యుడు రకరకాల వేషాలు ధరించి కాశీలో తిరుగుతూ దివోదాసుడిలో ఏ ధర్మ లోపమైనా కనిపిస్తుందేమోనని చూశాడు. దివోదాసుడిలోనే కాదు, అతని ప్రజలలో కూడా కించిత్తయినా అధర్మం సూర్యుడికి కనిపించలేదు. పని పూర్తికాకుండా తిరిగి పోవటం ఇష్టంలేక సూర్యుడు కాశీలోనే ఉండిపోయాడు.

తరవాత శివుడు బ్రహ్మను పిలిపించి, "దివోదాసును పతనం చెయ్యమని యోగినులను పంపాను. వారి వెనకగా సూర్యుణ్ణి పంపాను. వారందరూ కాశీలో చిక్కుకుపోయి తిరిగి రాకుండా ఉన్నారు. ఈ సారి నువు వెళ్లు." అన్నాడు.

బ్రహ్మ సరేనని వృద్ధబ్రాహ్మణుడి వేషంలో కాశీకి వెళ్ళి, సభ తీరి ఉన్న దివోదాసును చూసి ఆశీర్వదించి, "రాజా, నువు అనుమతించినట్టయితే కాశీనగరంలో యజ్ఞాలు చేస్తాను. అయితే విశ్వేశ్వరుడు లేని కాశీ చిన్నబోతున్నది. శివుణ్ణి రప్పిస్తే బాగుండును." అన్నాడు.

శివుణ్ణి పిలిపించటం గురించి దివోదాసుడు ఎటూ చెప్పలేదు. బ్రహ్మ కాశీలో పది అశ్వమేధాలు చేసి, అక్కడే ఉండి పోయాడు.



వెళ్ళిన బ్రహ్మ కూడా తిరిగి రాకపోయే సరికి శివుడు ప్రమథులను కాశీకి పంపాడు. కాశీక్షేత్రంలోని మహత్తు ఎలాటిదో గాని, ప్రమథులు కాశీ చేరుతూనే తాము వచ్చిన పని పూర్తిగామరిచిపోయారు. వారిలో కపర్ది అనేవాడు కపర్దీశ్వరలింగాన్ని ప్రతిష్ఠించాడు.

మందరగిరి మీద ఉన్న శివుడికి కాశీ వార్త అయినా తెలియరాలేదు. యోగినులు ఏం చేస్తున్నారు? సూర్యుడు ఏమయాడు? బ్రహ్మదేవుడికి తాను జ్ఞాపకం ఉన్నాడా? ప్రమథులు అక్కడే కాపరం పెట్టారా ఏమిటి? ఇలా మథనపడుతూ శివుడు వినాయకుణ్ణి పిలిచి, అతనికి చెప్పవలసిందంతా చెప్పి, కాశీనగరానికి పంపాడు.

వినాయకుడు కాశీనగరం చేరి అక్కడ అనేక ఉత్పాతాలు కలగజేశాడు. అతను ఢుంఠి భట్టారకుడు అని పేరు పెట్టుకుని ప్రజల మధ్య తిరుగుతూ జోస్యం చెప్ప సాగాడు. కాశీనగరానికి త్వరలోనే చెడ్డ రోజులు రాబోతున్నాయనే పుకారు పుట్టించాడు. తరవాత అతను దివోదాసు భవనంలో ప్రవేశించి, రాజు అడిగిన ప్రశ్నలన్నిటికీ సరిఅయిన సమాధానాలు చెప్పి, రాజపురోహితులలో ఒకడుగా చేరిపోయాడు.

రాజు ఒకనాడు ఢుంఠి భట్టారకుణ్ణి, "కాశీనగరంలో ఉత్పాతా లెందుకు కలుగుతున్నాయి?" అని అడిగాడు.

"రాజా, కొంత కాలంపాటు నువు కాశీ విడిచి దూరంగా ఉండటం మంచిదని నాకు తోస్తున్నది. ఇంక పద్దెనిమిది రోజులకు ఉత్తరదేశం నుంచి ఒక బ్రాహ్మణుడు వస్తాడు. నీకు తగిన హితోపదేశం ఆయన చేయగలడు," అన్నాడు ఢుంఠి.

తరవాత శివుడు విష్ణుమూర్తిని కాశీకి పంపించాడు. విష్ణువు బుద్ధుడి రూపంలో వచ్చి కాశీపౌరులకు నాస్తికమతమూ, బౌద్ధ, జైనధర్మాలూ బోధించి, వారిలో ధర్మచింత పోగొట్టాడు. తరవాత ఆయన బ్రాహ్మణవేషం ధరించి దివోదాసుడి వద్దకు వెళ్ళి, ఆశీర్వదించాడు. దివోదాసుడు ఆయనతో, "అయ్యా, దేవతలు నన్ను చాలా రకాల బాధలు పెట్టుతున్నారు. నేను కూడా చాలా కాలం రాజ్యం చేసి, ముసలివాణ్ణి అయిపోయాను. నాకు మోక్షం ఎలావస్తుంది?" అని అడిగాడు.

"రాజా, కాశీనగరంలో లింగ ప్రతిష్ఠ చెయ్యి. నువు బొందితో కైలాసానికి పోతావు," అన్నాడు విష్ణువు.

ఆ ప్రకారమే దివోదాసుడు తన కుమారుడైన సమరంజయుడికి పట్టంగట్టి, గొప్ప గుడి కట్టించి, అందులో లింగ ప్రతిష్ఠ చేసి, తన కోసం వచ్చిన విమానం ఎక్కి, బొందితో కైలాసానికి వెళ్ళిపోయాడు. కాశీ విడిచి వెళ్ళిన దేవతలందరూ తిరిగి వచ్చారు. శివుడు నందివాహనం మీద తన గణాలనన్నిటినీ వెంట బెట్టుకుని కాశీనగరానికి మళ్ళీ చేరుకుని ఎంతో తృప్తిపడ్డాడు.



CHANDAMAMA (Telugu) NOV. 1972 92 Paise Including Excise Duty Regd. No. M. 4854




శివపురాణం



# శివపురాణం

## 22

విశ్వనాథుడూ, విశాలాక్షీ కాపరం ఉంటున్న కాశీనగరంలో కొంతకాలం నివసించుదామన్న కోరిక కలవాడై వేదవ్యాసుడు తన శిష్యగణంతో సహా కాశికి చేరాడు. ఆయన శిష్యులలో వైశంపాయనుడూ, జైమినీ, పైలుడూ, సుమంతుడూ మొదలైన మహామహులు ఎందరో ఉన్నారు.

వాళ్ళు ఉదయాన కాలకృత్యాలు తీర్చుకుని, గంగాస్నానం చేసి, సంధ్యవార్చి, గాయత్రీజపం చేసి, అగ్నికార్యం అయాక, శివార్చన చేసి, ముక్తిమండపంలో మధ్యాహ్నం దాకా శివపురాణం పఠించి, ఊళ్ళో భిక్షాటన చెయ్యటానికి తలా ఒక దారినా బయలుదేరారు.

ఆ సమయంలో విశ్వేశ్వరుడు విశాలాక్షితో, "వ్యాసుడి మనస్సు ఎలాటిదో చూస్తాం. అతనికీ, అతని శిష్యులకూ ఎక్కడా భిక్ష పుట్టకుండా చెయ్యి." అన్నాడు.

విశాలాక్షి సరేనని, కాశీనగరంలో ఏ ఇల్లాలికీ భిక్ష పెట్టే ఇచ్ఛ లేకుండా చేసింది. దాని ఫలితంగా వ్యాసుడు "భిక్షాం దేహి" అని అరుస్తూ ఇల్లిల్లూ తిరుగుతూ ఉంటే, ఇల్లాళ్ళు, "వంట కాలేదు," అనీ, మళ్ళీ రమ్మనీ, "ఇవాళ మా ఇంట అబ్దికం," అనీ అన్నారు.

కొందరు గృహస్థులు మూసిన తలుపులు తెరవను కూడా లేదు.

వ్యాసుడికి జరిగినట్టే ఆయన శిష్యులకూ జరిగింది. పొద్దు వాలేదాకా ఊరంతా చెడ తిరిగి, కాలుతున్న కడుపులతో అందరూ మఠానికి చేరుకున్నారు.

"నాకు ఎక్కడా ఒక్క మెతుకు పుట్టలేదు. మీకైనా భిక్ష దొరికిందా?" అని

అట్ట చివరి బొమ్మ



63



వ్యాసుడు తన శిష్యులను అడిగాడు. వాళ్ళు దొరకలేదన్నారు.

"పొద్దునే లేచి ఏ పాపాత్ముడి ముఖం చూశామో!" అన్నాడు వ్యాసుడు.

ఏడు రోజులు వరసగా ఇలాగే జరిగింది. ఒకప్పుడు దివోదాసు వైభవంగా ఏలి, ప్రస్తుతం విశ్వనాథుడు ఉంటున్న కాశీనగరంలో, ప్రతి ఇల్లాలూ ఒక అన్నపూర్ణ అని లోకం చెప్పుకుంటూండగా తమకు ఈ ఉపవాసాలు ఎలా సంప్రాప్తమయాయో వ్యాసుడికి అర్థం కాలేదు. వైశంపాయనుడూ, సుమంతుడూ, పైలుడూ, జైమినీ, దేవలుడూ, దాల్భ్యుడూ వడిలిపోయి, శోష వచ్చినట్టున్నారు.

ఎనిమిదో రోజు వచ్చింది. మళ్ళీ నిత్యకృత్యాలు తీర్చుకుని, కాశీలోని దేవుళ్ళకందరికీ దణ్ణాలు పెట్టుకుని, వ్యాసుడూ ఆయన శిష్యులూ తలా ఒక దారినా భిక్షాటనకు బయలుదేరారు.

వ్యాసుడికి ఒక్క ఇంటా భిక్ష దొరకలేదు. ఆయనకు పట్టరాని ఆగ్రహావేశం వచ్చింది. నుదిటి మీద చెమట పట్టింది. కణతలు అదురుతున్నాయి. ఆయన నడివీధిలో తన భిక్షాపాత్రను రాళ్ళ కేసి కొట్టి పగలగొట్టి, కాశీలో మూడు తరాల వాళ్ళకు విద్యా, ధనమూ, భక్తీ లేకుండా పోవాలని శాపం పెట్టటానికి కమండలంలో నుంచి శాపజలం అందుకోబోయాడు. కాని అదేం చిత్రమో, చెయ్యివణికి పోతూ ముందుకు రాకపోయింది.

అంతలో ఆ వీధిలో ఉన్న ఒక ఇంటి తలుపు తెరుచుకుని యాభైఏళ్ళ స్త్రీ, సర్వాభరణ భూషితురాలు, బయటికి వచ్చి, "ఓ బ్రాహ్మడా, శాపం వద్దు! ఇలారా!" అని పిలిచింది.

వ్యాసుడు పరమానందభరితుడై, ఆ స్త్రీ ఎవరో, ఏ కులమో కూడా తెలుసుకోకుండానే, ఆమెకు నమస్కారం చేశాడు. ఆయన దగ్గిరికి రాగానే ఆమె, "భిక్ష దొరకనంత మాత్రాన కాశీనగరాన్ని శపిస్తావా? నీ మనశ్శుద్ధి తెలుసుకోవటానికి విశ్వ



నాథుడు ఇలా చేశాడు గాని. కాశీనగరంలో తిండికి లోటేమిటి? మధ్యాన్నం అతిథి వేళప్పుడు అన్నపూర్ణ అభ్యాగతులకు బంగారు గరిటెతో అమృతపాయసం ఇస్తుం దని నువు వినలేదా? ఏడు రోజులు అన్నం లేదని దుఃఖించి, నీ ధీరత్వం కోల్పోయి, శివుడి రెండో భార్యలాటి కాశీని నాశనం చెయ్య జూచావు. అకలి ఎంత పాపమైనా చేయిస్తుందన్నమాట నువే నిరూపించావే! భిక్ష పెడతాను రా," అన్నది.

ఆ మాట విని వ్యాసుడు, "తల్లీ, ఇన్నా ళ్ళకు ఇంత తియ్యని మాట చెవుల బడింది. భిక్షకు నన్ను ఒక్కణ్ణే రమ్మన్నావా, లేక ఆకలి మీద ఉన్న నా శిష్యులను కూడా వెంట తెమ్మన్నావా? అందరివీ ప్రాణాలే గద! మా అందరికీ నువు నీకు తోచిన భిక్ష పెట్టితే అందరమూ పంచుకు తింటాం," అన్నాడు.

ఆ మాటకు ఆమె చిరునవ్వు నవ్వి, "నాయనా, మధ్యాన్న పూజలు గంగ వద్ద ముగించుకుని మీ రందరూ రండి. అందరికీ కడుపు నిండా తృప్తిగా భోజనం పెడతాను," అన్నది.

వ్యాసుడు తన మూడువందల శిష్యులతో గంగకు వెళ్ళి, మధ్యాహ్నికాలు ముగించు కుని, ఆ ఇంటికి తిరిగి వచ్చాడు. వారిని ఆ వృద్ధురాలు లోపలికి తీసుకుపోయి, భోజనశాలలో పీటల మీద కూర్చోబెట్టింది. అందరి ముందూ పెద్ద పెద్ద అరటిఆకులు వేశారు. వృద్ధురాలు అందరికీ అకింతలూ, ధూపమూ ఇచ్చి, పంక్తుల మధ్య నిలబడి, "నాయనలారా, అందరూ ఆపోశనలు పట్టి, తాపీగా భోజనాలు కానివ్వండి. కాశీ విశ్వ నాధుడికి ప్రీతి చెయ్యండి," అన్నది.

వ్యాసుడూ, ఆయన శిష్యులూ ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు. విస్తళ్లలో ఏ పదార్థమూ లేదు, వంట పాత్రలు లేవు, కనీసం వంట వాసన అయినా కొట్టటం లేదు.

"ఈ ముసలావిడ ఉత్తుత్త భోజనం పెట్టుతున్నది. ఇవాళ కూడా మనకు పస్తే!" అని వాళ్ళు అనుకున్నారు.

వాళ్ళు ఇలా అనుకుంటూ ఉండగా స్త్రీలు వచ్చి, అందరికీ ఆపోసనలు ఇచ్చారు.

"నాయనలారా, పొద్దు చాలా అయింది. ఇక భోజనాలకు ఉపక్రమించండి," అన్నది వృద్ధురాలు వారితో.

వాళ్ళు ఆపోసనలు పట్టిన మరుక్షణం అందరి విస్తళ్ళలోనూ పంచభక్ష్యపరమాన్నాలు వెలిశాయి. ఎవరికి ఏయే పదార్థాలు ఇష్టమో వారి వారి విస్తళ్ళలో అవి అన్నీ ప్రత్యక్షమయాయి.

"ఈ ముసలావిడ సాక్షాత్తూ అన్నపూర్ణాదేవే అయి వుండాలి," అనుకుని అందరూ ఆత్రంగా భోజనాలు చేశారు.

భోజనాలు అయి పోగానే వృద్ధురాలు వ్యాసుడు మొదలైన వారందరికీ విశ్రమించటానికి చోటు చూపించింది.

కొంతసేపటికి విశ్వనాధుడు పార్వతీ సమేతుడై, వ్యాసుడు తన శిష్యులతో సహా విశ్రమించి ఉన్న చోటికి వచ్చాడు. పార్వతి ముఖం ప్రశాంతంగా ఉన్నది, కాని శివుడి ముఖాన కోపం తాండవిస్తున్నది.

శివపార్వతులు రాగానే అందరూ ప్రణామాలు చేసి, చేతులు మోడ్చి నిలబడ్డారు.

శివుడు పార్వతితో సహా ఒక వేదిక మీద కూర్చుని, వ్యాసుడి కేసి కోపంగా చూస్తూ, "ఓరీ దుర్మార్గుడా! భారతం రాసిన శుంఠా! అహంకరించి, నా భార్యలాటి కాశీనగరానికి శాపం ఇవ్వబోతావా? నువు కాశీలో అడుగు పెట్టటమే ద్రోహం! వెంటనే నువ్వూ, నీ శిష్యులూ మా పొలిమేర దాటి వెళ్ళిపొండి," అన్నాడు.


వ్యాసుడు పార్వతీ పరమేశ్వరుల కాళ్ళకు మొక్కి, తన శిష్యులతో సహా కాశీ నుంచి వెళ్ళిపోవటానికి సిద్ధమయాడు.

అప్పుడాయనతో పార్వతీదేవి, "నాయనా, విచారించకు. నువు మరెక్కడికీ వెళ్ళక, దక్షారామానికి వెళ్ళి, భీమేశ్వరుణ్ణి సేవించు. నీకు సమస్త శుభాలూ చేకూరుతాయి," అన్నది.

ఆమె సలహా ప్రకారం వ్యాసుడు తన శిష్యులతో సహా, భీమేశ్వరుణ్ణి అర్చించటానికి దక్షారామానికి వెళ్ళిపోయాడు.



CHANDAMAMA (Telugu) DEC. 1972 92 Paise Including Excise Duty Regd. No. M. 4854




శివపురాణం



# శివలీలలు

## 1

మృకండుమహర్షి భృగు సంతతివాడు. అతని భార్య మరుద్వతి. వారికి ఎన్నాళ్ళకూ సంతానం కలగకపోగా నిష్ఠానియమాలతో తపస్సులు చేస్తూ క్షేత్రాలు సేవించుకుంటూ కేదారక్షేత్రానికి వచ్చారు.

ఒకనాడు కేదారేశ్వరుణ్ణి అర్చించి ధ్యానమగ్నులై ఉండగా, "ఇహ మీరు మీ ఆశ్రమానికి వెళ్ళండి, మీకు పుత్రభాగ్యం కలుగుతుంది!" అని వారికి వినిపించింది. సంతోషంతో వారు ఇంటికి వచ్చి యథావిధిగా గృహస్థాశ్రమ ధర్మాల్ని నిర్వర్తించుతూండగా కొన్నాళ్ళకు మరుద్వతి మగశిశువును ప్రసవించింది. అదే సమయంలో ఆకాశం నుండి వారికి, "ఈ పిల్లవాడు అల్పాయుష్కుడు - పన్నెండేళ్ళ ఆయువు!" అని ఒక దివ్యవాణి వినిపించింది. అది విని వారు ఆనంద శిఖరాగ్రం నుండి ఒక్కసారిగా దుఃఖసాగరపు లోతుల్లోకి కూలిపోయారు. చివరకు, "అంతా ఆ శివునిలీల, మనం ఏం చేయగలం?" అని తెప్పరిల్లి పసివాడిబోసి నవ్వుల్లో మైమరిచారు.

తరువాత మృకండుడు కుమారుడికి జాతకర్మ జరిపించి మార్కండేయుడు అని నామకరణం చేశాడు. దినదిన ప్రవర్ధమానుడై మార్కండేయుడు ఉపనయనం అయ్యాక గురుకులానికి వెళ్ళి గురువుల వద్ద విద్యాబుద్ధులన్నీ నేర్చి పదకొండేళ్ళవాడై తలిదండ్రుల వద్దకు వచ్చాడు. బ్రహ్మతేజంతో ముద్దులుమూటగట్టుతున్న కుమారుణ్ణి చూడగానే వారి గుండెలు తరుక్కుపోయినవి. ఇంకొక్క సంవత్సరమే గడువు! మరుద్వతి కుమారుణ్ణి వదలకుండా కౌగలించుకొని కన్నీరు కార్చుతుండేగాని మార్కండేయుడు ఎంత తరిచి తరిచి అడి

అట్ట చివరి బొమ్మ

గినా అసలు సంగతి చెప్పదు. చివరకు మృకండుడే చెప్పలేక చెప్పలేక కొడుకుతో అతనికి ఒక యేడాదిలో మృత్యువు ఆసన్నం అవుతూన్నదని విషయమంతా చెప్పాడు.

అది విని మార్కండేయుడు ధీర చిత్తంతో కర్తవ్యాన్ని ఆలోచించి, "మీరు నన్ను ఆశీర్వదించండి, ఇప్పుడే నేను తపస్సుకి వెళుతున్నాను. శివానుగ్రహంతో మృత్యువును జయించి చిరంజీవినై వస్తాను," అని తలిదండ్రులకు ప్రణమిల్లాడు. మరుద్వతీ మృకండులిద్దరూ కుమారుణ్ణి కౌగలించుకొని 'చిరంజీవ' అని దీవించారు. అదే సమయానికి అక్కడికి నారదమహర్షి వచ్చాడు. మృకండుడు నారదుణ్ణి పూజించి తమ కుమారుడి గురించి అంతా చెప్పాడు. నారదుడు మార్కండేయుడి దృఢసంకల్పాన్ని మెచ్చుకున్నాడు. "నాయనా! మార్కండేయా! నువ్వు తిన్నగా గౌతమీ తీరానికి వెళ్ళు. అక్కడ పంచాక్షరీ మంత్రంతో శివుణ్ణి దీక్షతో అర్చించు, నీకు జయమౌతుంది!" అని దీవించి వెళ్ళాడు.

మార్కండేయుడు గౌతమీతీరాన్ని చేరుకొని సైకతలింగాన్ని ప్రతిష్ఠించి, "చంద్రశేఖరా! నీవే నన్ను రక్షించు! నీ పాదాలను ఆశ్రయించిన నన్ను యముడు ఏం చేయగలడు?" అంటూ దీక్షతో తపస్సు సాగించాడు.

లోకాలన్నీ తిరుగుతూ నారదుడు యముడి దగ్గిరికి పోయి, "మృత్యువును తప్పించుకోడానికి మార్కండేయుడనే ముని



బాలకుడు తపస్సు చేస్తున్నాడు. ఇహ నీ బలాబలా లెలాంటివో తేలే సమయం వచ్చింది!'' అంటూ చల్లగా చెప్పిపోయాడు.

మార్కండేయుడి ఆయువు పూర్తికా వస్తున్నది. యముడు మార్కండేయుడి ప్రాణాలు తోడితెమ్మని తన దూతలను పంపాడు. యమకింకరులు మార్కండేయుణ్ణి సమీపించలేక తిరిగి వచ్చారు. అప్పుడు యముడే దండాన్నీ, పాశాన్నీ ధరించి కారుఎనుబోతు నెక్కి బయల్దేరాడు.

మార్కండేయుడు శివలింగానికి తలను ఆనించి రెండు చేతులతోనూ శివలింగాన్ని గట్టిగా బిగించి పట్టుకొని ధ్యానమగ్నుడై ఉన్న సమయంలో యముడు కాలపాశాన్ని మార్కండేయుడి కంఠానికి విశిరాడు. ఆ పాశం శివలింగం మీదుగా పడిపడ్డంతో శివలింగం నుండి శివుడు ప్రళయరుద్రుడై తెరుచుకొన్న త్రినేత్రంతో ఆవిర్భవించి యముడిపై త్రిశూలాన్ని గురి పెట్టేసరికే యముడు భయంతో గజగజలాడిపోతూ చేతులెత్తి జోడిస్తూ, ''హరహరా! రక్షించు!'' అంటూ కూలిపోయాడు.

శివుడు మార్కండేయుడి తలపై తన అభయహస్తాన్ని ఉంచి, ''వత్సా! నీకు మృత్యువు లేదు. కల్ప కల్పాంతరాలు చూస్తూ చిరంజీవిగా ఉంటావు!'' అని వరమిచ్చాడు. తరువాత దేవతలంతా వచ్చి యముడు లేకపోతే చాలా యిబ్బందులు వచ్చి పడతాయి గనక యముణ్ణి మన్నించమని శివుణ్ణి కోరారు. శివుడి అనుగ్రహంతో



యముడు మళ్ళీ పునర్జన్మ ఎత్తినట్లుగా లేచి తన లోకానికి వెళ్ళాడు.

ఆ సమయానికే కుమారుణ్ణి పెతుక్కుంటూ వచ్చిన మరుద్వతీ మృకండులు శివానుగ్రహం పొందిన మార్కండేయుణ్ణి చూసి శివలీలలను కొనియాడుతూ చిరంజీవితో తమ నివాసానికి వెళ్ళారు.

మార్కండేయుడు బహుకాలం జీవించినవాడు కాని అతని కన్న ఎక్కువ కాలం జీవించిన వాళ్ళున్నారు.

ఇంద్రద్యుమ్నుడు అనే రాజు బతికి ఉండగా గొప్ప యశస్సు సంపాదించి, అది నిలిచినంత కాలమూ స్వర్గసుఖాలు అనుభవించాడు. తరవాత స్వర్గంలో వాళ్ళు, "భూలోకంలో నిన్ను తలుచుకునే వాళ్ళెవరూ లేరు. అందుచేత నీకు స్వర్గంలో స్థానం లేదు. భూమికి తిరిగి వెళ్ళు," అన్నారు.

ఇంద్రద్యుమ్నుడు భూలోకానికి తిరిగి వచ్చి, తన పేరు విన్నవారి కోసం వెతుకుతూ మార్కండేయుడి వద్దకు వచ్చాడు.

"నేను నిన్ను ఎరగను. కాని నా కంటె పెద్దవాడు ప్రావారకర్ణుడు అనేవాడు (గుడ్లగూబ) ఉన్నాడు. వాణ్ణి అడుగు," అన్నాడు మార్కండేయుడు. ఇద్దరూ కలిసి ప్రావారకర్ణుడి వద్దకు వెళ్ళారు.

"నేను నిన్ను ఎరగను కాని నా కన్న పెద్దవాడు నాళీకజంఘుడున్నాడు. అతన్ని అడుగుదాం," అన్నాడు ప్రావారకర్ణుడు.


నాళీకజంఘుడు కూడా ఇంద్రద్యుమ్నుణ్ణి ఎరగడు. అతను వారిని వెంటబెట్టుకుని తన కన్న వయసుగల అకూపారుడు అనే తాబేలు వద్దకు వెళ్ళాడు.

అకూపారుడు ఇంద్రద్యుమ్నుణ్ణి చూసి, "నేను నిన్ను ఎరుగుదును. నేనుంటున్న ఈ కొలను ఎలా వచ్చింది? నువు అనేక యజ్ఞాలు చేసి గోవులను దానమియ్యగా, ఆ గోవులు తొక్కటం చేత ఏర్పడింది," అన్నాడు.

అప్పుడు దేవదూతలు, ఇంద్రద్యుమ్నుడి కీర్తి ఇంకా భూలోకంలో మిగిలి ఉన్నదని చెప్పి, అతన్ని స్వర్గానికి తీసుకుపోయారు.



CHANDAMAMA (Telugu) JAN. 1973 92 paise Including Excise Duty Regd. No. M. 485



శివలీలలు




## 2

భీమావతి అనే ఊళ్ళో శివభక్తుడైన సోమయాజి ఒకడు ఉండేవాడు. ఆయనకు సిద్ధరాముడు అని ఒక కొడుకు కలిగాడు. ఆ కుర్రవాడి ఏడవఏట సోమయాజి మరణించాడు. తండ్రి లేని ఆ ఏక పుత్రుణ్ణి తల్లి ఎంతో శ్రద్ధగా పెంచుతూ వచ్చింది.

దీపావళి ఇంకా కొన్ని రోజులుండనగా ఒక నాడు రాముడు, తన ఈడు కుర్రవాళ్ళతో బాటు, సమిధలూ, ఆకులూ తీసుకురావటానికి వనానికి వెళ్ళాడు. అక్కడ పిల్లలందరూ ఒక మర్రిచెట్టు కింద కూర్చుని కబుర్లు చెప్పుకోసాగారు.

"వచ్చే దీపావళికి మా అక్కనూ, బావనూ తెస్తాం. పండగకు మా ఇంట్లో అప్పాలు చేసుకుంటాం. అరిసెలు చేసుకుంటాం. కజ్జికాయలు చేసుకుంటాం. పూరీలు చేసుకుంటాం. గారెలు వండుకుంటాం. మా అక్కకూ, బావకూ బట్టలు పెడతాం," ఈ విధంగా కుర్రవాళ్ళందరూ చెప్పుకుంటున్నారు.

ఆ మాటలు విని రాముడు, "నేను కూడా పండగకు మా అక్కనూ, బావనూ తెస్తాను. మా ఇంట్లో పాయసం వండుకుంటాం. మా అక్కకూ, బావకూ సన్నని బట్టలు పెడతాం," అన్నాడు.

ఈ మాటలకు పిల్లలందరూ వెటకారంగా నవ్వి, "నీకు మొదలు అక్కే లేదు గదా, బావ ఎలా ఉంటాడురా? మా దగ్గిరే దంభాలు పలుకుతున్నావా? చెప్పు, నీ అక్క ఎవరు? పేరేమిటి? మీ బావ పేరేమిటి? ఆయన ఎక్కడ ఉంటాడు? ఏం చేస్తాడు? ఏం చదువుకున్నాడు? వాళ్ళ కెంత మంది పిల్లలు?" అని సిద్ధరాముడి మీద ప్రశ్నల వర్షం కురిపించారు.

అట్ట చివరి బొమ్మ



వాళ్ళ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక, అవమానంతో ఏడుస్తూ రాముడు ఇంటికి తిరిగి వచ్చాడు.

కొడుకు ఏడుస్తూ రావటం చూసి తల్లి వాణ్ణి దగ్గిరికి తీసి, కన్నీరుతుడుస్తూ, "ఏం, నాయనా? పడ్డావా? దెబ్బ తగిలిందా? ఎవరన్నా కొట్టారా? ఏం జరిగింది?" అని అడిగింది.

రాముడు తల్లికి తన తోటిపిల్లలు చేసిన ఎగతాళి గురించి చెప్పాడు.

అంతా విని తల్లి, "వాళ్ళ మాటలకేంరా? మీ అక్క పేరు భ్రమరాంబ. మీ బావ మల్లన్న. వాళ్ళు శ్రీశైలపర్వతం మీద ఉంటారు. వాళ్ళు అష్టఐశ్వర్యాలుగల వాళ్ళు. గణపతీ, కుమారస్వామీ అని వారికి కొడుకులున్నారు. మీ బావ సర్వేశ్వరుడు. లోకాలన్నీ ఆయన చెప్పినట్టు నడుచుకుంటాయి. నీ బావలాటి బావ ప్రపంచంలో ఎవరికీ లేడురా!" అన్నది.

ఈ మాటలు విని రాముడు పొంగిపోయి, "అయితే వచ్చే దీపావళికి వాళ్ళను తీసుకొద్దామమ్మా. అందరి అక్కలూ, బావలూ పండగకు వస్తున్నారు. మనం నా అక్కనూ, బావనూ ఎప్పుడూ తీసుకురాలేదు," అన్నాడు.

"నాయనా, మీ తండ్రి పోయాక వాళ్ళను ఎవరు పిలుచుకు వస్తారు? నువ్వేమో పసివాడివి. దారి అంతా అరణ్యం. అందులో సింహాలూ, పెద్దపులులూ, ఎలుగుబంట్లూ, నాగుపాములూనూ; కాకపోయినా మీ బావ వంటి ఐశ్వర్యవంతుడు మన పేద ఇంటికి ఎందుకు వస్తాడు? ఆయన ఒంటరిగా రాడాయె; పెద్ద పరివారంతో వస్తాడు. ఒక పూట తింటే ఇంకోపూట తినలేని మనం వారి కందరికీ ఎలా తిండి పెట్టగలం? నువు పెద్దవాడివై, సంపాదించేటప్పుడు మీ అక్కనూ, బావనూ తీసుకొద్దువు గాని!" అన్నది తల్లి రాముడితో.

రాముడు అప్పటి కేమీ అనక, మర్నాడు తూర్పు తెల్లవారక ముందే లేచి, తల్లికి చెప్పకుండా ఇంటి నుంచి బయలుదేరి, కనిపించిన వారినందరినీ శ్రీశైలానికి దారి

అడుగుతూ, క్రూరమృగాలను లక్ష్యపెట్టక, అరణ్యాలకుండా నడిచి చివరకు శ్రీశైలం చేరాడు. అక్కడ ఎన్నో తీర్థాలూ, ఆలయాలూ ఉన్నాయి. రాముడు తన అక్క, బావల కోసం అంతటా చెడ తిరిగాడు. "మల్లికార్జునుడు ఎక్కడ ఉంటాడు?" అని ఎవరినో అడిగితే, వాళ్ళు రాముడికి దేవాలయం చూపారు. అందులోకి వెళ్ళి చూస్తే లింగం తప్ప ఏమీ లేదు.

అప్పటికే రాముడు చాలా అలిసిపోయి ఉన్నాడు. వాడు ఆ లింగానికి ఎదురుగా కూర్చుని, "బావా, నిన్నూ అక్కనూ దీపావళికి తీసుకు పోదామని, ఎవరితోనూ చెప్పకుండా బయలుదేరి, చాలా శ్రమపడి వచ్చాను. మా ఊళ్ళో అందరి అక్కలూ, బావలూ పండగకు వస్తున్నారు. మా అమ్మ మీ ఇద్దరినీ చూడటానికి వెయ్యికళ్ళతో ఎదురు చూస్తున్నది. ఇన్నాళ్లూ పిలవలేదని అలిగి, కనబడకుండా ఉన్నావా? నువు ఎంత ధనికుడవైతే మాత్రం బంధుత్వం పోతుందా? మేము పేదవాళ్ళమనుకోక మా ఇంటికి రా. నిన్ను తీసుకు పోకుండా నేను తిరిగి పోను," అన్నాడు.

రాముడి వేడుకోలు అరణ్యరోదనమయింది. వాడు తన అక్కను కూడా ఇదే విధంగా బతిమాలుకున్నాడు, కాని లాభం లేకపోయింది.



భరించరాని నిరాశతో రాముడు ఆత్మహత్య చేసుకోవటానికి నిశ్చయించుకున్నాడు. అక్కనూ, బావనూ తీసుకు వస్తానని ప్రగల్భాలు పలికి తీసుకు రాలేకపోతే తోటివాళ్ల దగ్గిర ఎంత అవమానం! ఆ అవమానం భరించే కన్న చావటం మేలు. ఆ చచ్చేది అక్కా, బావలున్న చోటే చస్తే ఆ మాట వారికే వస్తుంది.

ఇలా అనుకుని రాముడు కొండశిఖరం ఎక్కి, అక్కడి నుంచి కిందికి దూకపోయాడు.

అంతలోనే అతని భుజాలు ఎవరో పట్టుకున్నారు. ఒక పక్క మగవాడూ, ఒక పక్క ఆడదీ ఉన్నారు.

"ఎవరు మీరు? చచ్చిపోదామనుకున్న నన్ను మీరు ఎందుకు ఆపుతున్నారు? నా అక్కకూ, నా బావకూ లేని జాలి నా మీద మీ కెందుకు?" అని అడిగాడు రాముడు.

అప్పుడు ఆ స్త్రీ, "మేం పరాయివాళ్ళం కాదు, తమ్ముడూ! నేను నీ అక్కను, భ్రమరాంబను. ఈయన మీ బావగారు. మమ్మల్ని ఎన్నడూ చూసి ఎరగవు. అందు చేత గుర్తు పట్టలేకపోయావు. సోమయాజులు గారి అబ్బాయి ఇక్కడ తిరుగుతున్నాడంటే నిన్ను వెతుక్కుంటూ వస్తున్నాం," అన్నది.


రాముడు పరమానందభరితుడై అక్కకూ, బావకూ మొక్కాడు. వాళ్ళు రాముడికి తమ కొడుకులనూ, పరివారాన్నీ చూపించారు. రాముడు వారిని తన వెంట రమ్మన్నాడు.

ఈ లోపల రాముడి తల్లి కొడుకును కానక, ఏమైనాడోనని తల్లడిల్లి పోయింది. తన మాటలు నిజమని నమ్మి కుర్రవాడు శ్రీశైలం పోయి ఉంటాడనుకుని ఆమె అమితంగా భయపడింది.

కొద్ది రోజులు గడిచాయి. పండగ వచ్చింది. దానితోపాటే ఉదయం పూట రాముడు ఇంటికి తిరిగి వచ్చి, అక్కనూ, బావనూ వారి పరివారాన్నీ తీసుకు వచ్చాననీ, వారంతా ఆలయం వద్ద ఉన్నారనీ చెప్పాడు. రాముడి తల్లి ఆనందాశ్చర్యాలతో ఆలయానికి వెళ్ళి, పార్వతీ పరమేశ్వరులనూ, వినాయకుణ్ణీ, కుమారస్వామినీ, వారి పరివారాన్నీ కళ్ళారా సందర్శించి, అందరినీ తమ ఇంటికి ఆహ్వానించింది.

వారంతా వచ్చేసరికి వారి పాత ఇంటికి మారుగా ఒక దివ్యభవనం ఉన్నది. అతిథులు అందులో ప్రవేశించారు. ఆ రోజు ఊళ్ళో వాళ్ళు, కొత్తగా వెలిసిన ఆ ఇంటిని చూసి ఆశ్చర్యపోయారు. బయటి ద్వారాలు మూసి ఉన్నాయి. లోపల అంతులేని జనం ఉన్నట్టు సందడిగా ఉన్నది.

దీపావళికి రాముడి అతిథులుగా వచ్చిన పార్వతీ పరమేశ్వరులు, రాముణ్ణీ, అతని తల్లినీ తమ వెంట కైలాసానికి తీసుకు వెళ్ళారు.



CHANDAMAMA (Telugu) FEB. 1973 92 Paise Including Excise Duty Regd. No. M. 4854





# శివలీలలు

ప

హిమాచలాన్ని అనుకొని ఉన్నతమైన దేవ దారు వృక్షాలతో హిమానీ జలపాతాలతో ఎంతో రమణీయంగా ఉండే దారుకావనంలో ఒకప్పుడు భృగువు, మరీచి, అంగీరసుడు మొదలైన హేమాహేమీలైన మహాఋషులు ఆశ్రమాలు వేసుకొని గొప్ప తపస్సులు, యాగాలు చేస్తూ తమ భార్యలతో కాపుర ముంటూండేవారు.

ఆ ఋషుల తపోమహిమ చేతనే అతి లోక సౌందర్యవతులైన వారి భార్యలు మహా పతివ్రతలై ఉంటున్నారనీ, పరపురుషులు వారిని సమీపించితే భస్మమైపోతారనీ, ముమ్మూర్తులైనా తమ తపశ్శక్తి ముందు ఆగలేరనీ, తపోగర్వంతో ఆ ఋషులు పెద్ద కబుర్లు చెబుతూండేవారు. ఈ సంగతిని నారదుడు కైలాసం వెళ్లి పార్వతీశివుల చెవిని వేశాడు.

ఇలా ఉండగా ఒక మహా యజ్ఞాన్ని జరిపించేందుకని ఇళ్ళ వద్ద భార్యలను వదిలి ఋషులందరూ కలిసి తరలి వెళ్ళారు. ఆ తరుణం చూసి శివుడు సమ్మోహనాకారుడై ఒక చేత గంజాయి, విప్పపూల సురా పాత్రనూ మరో చేత భిక్షాపాత్రనూ పట్టుకొని ఉన్మత్తునిలాగ తూలుతూ భిక్షాటనం ప్రారంభించాడు. ఋషిపత్నులు అతణ్ణి చూసి పరవశించి వెంటబడి అతనితో బాటు ఆడుతూ పాడుతూ దారుకావనమంతా విహరించసాగారు.

యజ్ఞవాటికలో ఉన్న ఋషుల దగ్గిరికి నారదుడు వెళ్ళి, "అవతల మీ కాపరాల్ని భిక్షువొకడు కూలుస్తున్నాడు!" అని చల్లగా చెప్పి జారుకున్నాడు.

ఋషులు హుటాహుటిని దారుకావనానికి పరిగెత్తిపోయి, తారల మధ్య చంద్రుడిలా

అట్ట చివరి బొమ్మ

ఉన్న శివుణ్ణి, "ఎవ్వడవురా నీవు?" అని గద్దించారు.

"నా పేరు చిదంబర సుందరేశ్వరుడు!" అన్నాడు భిక్షువు.

"నీవు చేసే పనేమిటి?" అన్నారు ఋషులు.

జవాబుగా సురాపాత్రనూ, భిక్షాపాత్రనూ ఎత్తి చూపిస్తూ, "పనిలేని వారికి ఏదో పని కల్పించడమే నా పని!" అన్నాడు శివుడు.

"ఓరీ! నీ మగతనం బూడిదపాలై శిల అగుగాక!" అని శపించారు ఋషులు.

"నా కదేమీ కొత్త కాదు!" అంటూ శివుడు పరిహాసం చేశాడు.

ఋషులు అభిచార హోమం చేసి హోమకుండం నుంచి 'మాయ' అనే కారు చీకట్లుక్రమ్మే కృత్యాభూతాన్ని పుట్టించి శివుడి మీదకు పంపారు.

శివుడు ఆ మాయను తన కుడికాలు క్రింద అణిచి ఎడమ కాలు ఎత్తి చిందులు త్రొక్కడం మొదలు పెట్టాడు.

ఋషులు 'భయం' అనే పెద్దపులిని హోమకుండం నుంచి రప్పించి శివుడి మీదకు వదిలారు. శివుడు దాన్ని చీల్చి పులిచర్మాన్ని మొలకు చుట్టుకున్నాడు.

'మహాపాపములు' అనే విషసర్పాల్ని శివుడి మీదకు విసిరారు ఋషులు. శివుడు ఆ పాములను భూషణాలుగా ధరించాడు.

ఋషులు 'చిత్తచాంచల్యం' అనే సమ్మోహన విద్యను మంత్రోచ్చాటన చేస్తూ ప్రయోగించారు.



శివుడు దాన్ని చిన్న లేడి పిల్లగా చేసి పిడికిట బిగించి పట్టుకున్నాడు.

ఋషులు ప్రళయాగ్నిని రగిల్చి శివుడి మీదికి విసిరారు.

శివుడా అగ్నిని పూల చెండులా పట్టుకున్నాడు.

అప్పటికీ ఋషులు శివుణ్ణి తెలుసుకోలేక మహాజ్వాలలను విసిరారు.

ఆ జ్వాలలు శివుడి చుట్టూరా వలయాకారంతో తోరణం కట్టాయి.

మాయను మర్దిస్తూ, నటరాజ శివుడు చేస్తున్న నృత్యాన్ని చూడ్డానికి విఘ్నేశ్వరుడు, కుమారస్వామి, నంది, భృంగి మొదలైన ప్రమథగణాలు వెంటరాగా పార్వతి వచ్చింది. జగదాంబ ముందట శివుడు మహానందంతో తాండవం చేస్తూంటే దేవతలంతా వచ్చారు.

రాగబద్ధంగా విష్ణువు మృదంగం వాయిస్తూంటే సరస్వతి వీణ మీటగా ఇంద్రుడు వేణువు నూదాడు. బ్రహ్మ తాళాలు పట్టి లయవేశాడు. ఋషులు బుద్ధి తెచ్చుకుని సామవేదాన్ని వల్లిస్తూంటే, నారదుడు దేవ గాంధారగానం చేశాడు. భృంగీశ్వరుడు ఢమరుకాన్ని, నందీశ్వరుడు భేరిని వాయించారు. కుమారస్వామి తూర్యనాదాన్ని పూరించాడు. శివతాండవం చూస్తూంటే విఘ్నేశ్వరుడికి ఉత్సాహం పుట్టుకొచ్చి నృత్యం చేయడం మొదలు పెట్టాడు. అతని వాహనం చిట్టెలుక కూడా చిందులు వేసింది.



నృత్యశివుడు, రాగవిష్ణువు లయబ్రహ్మగా జగల్లీలా నృత్యంగా శివలీల సాగుతూంటే ఆ నృత్యాన్ని చూసి భరతముని నటరాజ శివుణ్ణి నాట్యానికి అధిదేవతగా భరతశాస్త్రమనే నాట్యవేదాన్ని రచించాడు.

వ్యాఘ్రపాదు డనే మునికి ఉపమన్యువు అనే కొడుకు ఉండేవాడు. అయిదేళ్ళ ప్రాయంలోనే ఆ కుర్రవాడికి తాము దరిద్రులన్న సంగతి తెలిసి వచ్చింది. వాడు అరణ్యానికి పోయి పంచాక్షరీ మంత్రం జపిస్తూ శివుణ్ణి గురించి తపస్సు చేశాడు.

శివపార్వతులు వికార రూపాలలో ఉపమన్యువు ఎదటికి వచ్చి, ''బాబూ, ఈ అరణ్యంలో పులులుంటాయి. ఇంటికి వెళ్ళు,'' అన్నారు.

''శివ పంచాక్షరీ ఉండగా నాకు ఏ భయమూ లేదు,'' అన్నాడు ఉపమన్యువు.

పార్వతీపరమేశ్వరులు సంతోషించి అతనికి అష్టఐశ్వర్యాలు ఇచ్చారు.

గయాసురు డనే దానవుడు ముల్లోకాలు ఆక్రమించి కైలాసం మీదకు కూడా విరుచుకు పడ్డాడు. శివుడు తన జటాజూటాన్ని విదిలించగా అందుండి భయంకరమైన ముఖంతో పెద్ద శరీరంతో ఒక ఘోరాకారుడు దానవుణ్ణి కబళించడానికి ఉరికాడు. గయుడు భయంతో గజగజ వణికిపోతూ శివుణ్ణి శరణు వేడుకొన్నాడు. శివుడు అభయమిచ్చాడు.

భయంకరముఖుడు చేసేది లేక ''ఆహారం! ఆహారం కావాలి!'' అని ఆక్రోశించాడు. ''నీ శరీరాన్నే నీవు తిని నీ ఆకలి చల్లార్చుకోవలసిందే!'' అని శివుడు ఆదేశించాడు. శివాజ్ఞను శిరసావహించి భయంకరముఖుడు తన శరీరాన్నంతటినీ భక్షించి ముఖంతో మిగిలాడు. అప్పుడు శివుడు ప్రీతుడై ఆ ముఖానికి ''కీర్తిముఖము'' అని పేరుపెట్టాడు. ''ఓయీ, కీర్తిముఖుడా! నీవు అందరి దేవతల తలలపై నిలిచి వారికి కీర్తి కలుగజేస్తుంటావు'' అని వరమిచ్చాడు.

ఆ విధంగా శివుని అంశ కీర్తిముఖంగా మకరతోరణం మధ్య ప్రతి దేవతామూర్తి నడినెత్తిన ప్రకాశించింది.



CHANDAMAMA (Telugu) MAR. 1973 92 Paise Including Excise Duty Regd. No: M. 4854




శివలీలలు



# శివలీలలు

## 4

బదరికాశ్రమంలో దూర్వాసుడు తపస్సు చేసుకుంటూ ఉండేవాడు. ఒకనాటి మధ్యాహ్నం ఆయన దేవతార్చన చేసి, హవిశ్శేషాలను తన ఆశ్రమం ముందు లేడిపిల్లలకు తినిపిస్తూండగా, తుంబురుడనే ప్రమధుడు ఆకాశమార్గాన తన భార్యతో సహా పోతూ చూసి, లేడిపిల్లల కేసి చిటికెలు వేశాడు. అవి బెదిరి పారిపోయాయి. అసలే కోపిష్ఠి అయిన దూర్వాసుడు తుంబురుణ్ణి మనిషిజన్మ ఎత్తమని శపించాడు.

తుంబురుడు భయపడి విమానం దిగి, "స్వామీ, మీ జింకపిల్లలను చూసి ముచ్చట పడి చిటికవేస్తే అదినాకు శాపమై చుట్టుకున్నది. మీ శాపం అమోఘం గనక అలాగే మనిషిజన్మ ఎత్తుతాను. కాని ఆ జన్మలో శివభక్తి ఉండేటట్టు అనుగ్రహించండి," అన్నాడు. దూర్వాసుడు అలాగే అనుగ్రహించాడు.

దూర్వాసుడి శాపం ఫలితంగా తుంబురుడు కాంచీపురంలో వైశ్యుల యింట చిరుతొండడు అనే పేరుతో పుట్టాడు. అతని భార్య కూడా తిరువెంగనాంచి అనే పేరుతో పుట్టి చిరుతొండడికి భార్య అయింది. వారికి సిరియాలుడు అనే కొడుకు కలిగాడు.

చిరుతొండడు వీరశైవాచారపరాయణుడై ఏకామ్రనాధుణ్ణి అర్చించుతూ, శివభక్తులు ఏవేళ ఏ పదార్థం కోరినా శక్తివంచన లేకుండా ఇస్తూండేవాడు.

ఒకనాడు అతని ఇంటికి ఒక శివభక్తుడు వచ్చి, చిరుతొండడిని ఆశీర్వదించి, అతని నుంచి అర్చనలు పొంది, "నాయనా, నిత్యమూ శివుణ్ణి చెరుకురసంతో అభిషేకించటం నా వ్రతం. అందుచేత చేతితో

అట్ట చివరి బొమ్మ



గానుగ ఆడిన చెరుకురసం నాకు తూమెడు కావాలి." అన్నాడు.

చిరుతొండడు పరమానందం చెంది, డబ్బు తీసుకుని చెరుకు గడలు కొనటానికి బయలుదేరి వెళ్లాడు.

తూమెడు రసం కోసం నూరు చెరుకు గడలు కావాలి. అందుచేత చిరుతొండడు నూరు చెరుకుగడలు కొని కట్టకట్టించాడు. కాని అంతపెద్ద మోపు ఎత్తటం అతనికి సాధ్యం కాలేదు. అప్పుడు శివుడే మనిషి రూపంతో వచ్చి ఆ మోపును తాను కూడా మోసుకొచ్చి అంతలోనే మాయమయాడు.

చిరుతొండడు అది చూసి ఆశ్చర్యపడి, తన చేత్తోనే చెరుకుగడలను గానుగ ఆడి, తూమెడు రసం తీసి, అతిథికి ఇచ్చాడు. శివుడికి అభిషేకం జరిగిపోయింది.

కైలాసం మీద పార్వతి శివుడి శరీరమంతా చెమటతో తడిసి ఉండటం చూసి కారణం అడిగింది. శివుడు ఆమెకు చిరుతొండడి సంగతి చెప్పి, "నా భక్తుడు చెరుకు గడల మోపు ఎత్తలేక పోయేసరికి నేను సహాయం చేశాను. అతనికీ చెమటపట్టింది, నాకూ పట్టింది," అన్నాడు. ఆ వీరశైవుణ్ణి తాను కూడా చూడాలని పార్వతి కోరింది.

అప్పుడు శివుడు ఇంద్రుడితో కాంచీపురం ప్రాంతాలలో ఎడతెగని వానలు కురిపించ మన్నాడు. కాంచీపురంలో ఇరవై ఒక్క రోజు ఎడతెగని వర్షం కురిసి, ఇరవై రెండో రోజున వెలిసింది. ఈ మూడు వారాలూ చిరుతొండడు శివభక్తులకు రాత్రిం బగళ్లు భోజనాలు పెడుతూనే వచ్చాడు, వంటచెరుకు లేకపోతే గుడ్డలు నూనెలో తడిపి అంటించి, వంటలు చేయించాడు, అంతేగాని ఆ గడ్డురోజులలో తన వ్రతానికి భంగం రానియ్యలేదు.

కాని తీరా వాన వెలిసిన రోజున చిరుతొండడి ఇంట అతిథి లేకుండా పోయాడు. కనీసం ఒక శివభక్తుడికైనా భోజనం పెట్టి గాని చిరుతొండడు భోజనం చెయ్యడు. అది అతని నియమం. అతను మధ్యాహ్నం వేళ బయటికి వచ్చి చూశాడు. పంచ అరు

గుల మీద ఒక్క శివయోగి కూడా లేడు. అందుచేత చిరుతొండడు అతిథుల కోసం వెతుకుతూ వీధుల వెంటపడ్డాడు. కోట ఆవరణలో ఎక్కడా ఒక శివభక్తుడు దొరక లేదు. చిరుతొండడు కోట దాటి బాహ్య ప్రదేశాలలో వెదకసాగాడు.

ఒక తోటకు సమీపంలో ఒక పాడుపడిన గుడిలో ఇద్దరు వృద్ధ దంపతులు అతనికి కనిపించారు. ముసలివాడి జుట్టు నెరిసి జడలుకట్టి ఉన్నది; ముఖాన విభూతిరేఖ లున్నాయి. ముసలావిడ గుడ్డిది; పులి చర్మం మీద పడుకుని ఉన్న ముసలాయన పాదాలు ఒత్తుతున్నది.



చిరుతొండడు వారికి చేతులెత్తి నమస్కారం చేసి, "ఇవాళ మీరిద్దరూ మా యింటికి వచ్చి శివార్చన చేసి, నన్ను కృతార్థుణ్ణి చెయ్యండి," అన్నాడు.

దానికి ఆ వృద్ధుడు, "ఏడాదిగా నేను శివుణ్ణి ఉద్దేశించి నిరాహార వ్రతం చేస్తున్నాను. ఆ వ్రతానికి ఉద్యాపన నరమాంసంతోగాని కాదు. నరపశువు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యకులాలలో దేనికైనా చెందిన వాడు కావాలి; చిన్నవయసు వాడూ, ఆరోగ్యవంతుడూ కావాలి. వాణ్ణి తల్లి తండ్రులు చంపి, వండి, వడ్డించాలి. నువు కూడా నా పంక్తిన కూర్చొని తినాలి," అన్నాడు.

"నన్ను చిరుతొండనంబి అంటారు. శివభక్తుల వ్రతాలు కొనసాగించటమే నా వ్రతం. తమరు కోరినట్టు భోజనం పెడతాను. మా యింటికి దయచెయ్యండి," అన్నాడు చిరుతొండడు.

"నువు ఒప్పుకుంటే చాలుతుందా? నీ భార్య కూడా నా నియమానికి ఒప్పుకోవాలి," అన్నాడు వృద్ధుడు.

చిరుతొండడు తన భార్యను ఒప్పించటానికి ఇంటికివచ్చి, తిరువెంగనాంచితో సంగతంతా చెప్పాడు.

"మన మాంసం కోసి వండిపెట్టటానికైనా మనం సిద్ధమే గద. వెంటనే వెళ్లి వారిని తీసుకురండి," అన్నదామె.

ఈ లోపల, ముసలి రూపంలో ఉన్న శివుడు వేరొక రూపంలో సిరియాలుడు చదువుకునే పాఠశాలకువెళ్లి, ఆ కుర్రవాడితో, "నాయనా, మీ తండ్రి దుర్మార్గుడు; నిన్ను చంపి ఎవరో జోగికి వండిపెట్ట బోతున్నాడు. వెంటనే పారిపో." అన్నాడు.

"అయ్యా, మీరు చెప్పేది చిత్రంగా ఉన్నది. పరోపకారార్థ మిదం శరీరం అన్నారు. దధీచీ, శిబీ మొదలైనవాళ్లు అజ్ఞానులా ?" అని సిరియాలుడు జవాబు చెప్పాడు.

చిరుతొండడు తిరిగి దేవాలయానికి వచ్చి, ముసలి బ్రాహ్మణుణ్ణి ఎత్తుకుని, గుడ్డి అవ్వను నడిపించు కుంటూ ఇంటికి వచ్చాడు.

తల్లి దండ్రులు సిరియాలుడికి తలంటి పోసి స్నానంచేయించి, అలంకరించి, "నాయనా, శివయోగికి ఆహారమవుతావా ?" అని అడిగారు.

"సంతోషంగా అవుతాను," అన్నాడు సిరియాలుడు.

తల్లి తన కొడుకును ఒడిలో పడుకో బెట్టుకున్నది. చిరుతొండనంబి కొడుకును చంపాడు. సిరియాలుడి మాంసం వండి ఆ భార్యాభర్తలు వృద్ధ దంపతులకు వడ్డించారు. ముసలివాడు చిరుతొండనంబితో "నువ్వూ, నీ కొడుకూ నా పంక్తిన భోజనం చెయ్యండి మరి," అన్నాడు.

"మా అబ్బాయి ఎటో వెళ్లి ఉంటాడు. వంటకాలు చల్లబడతాయి. మీరు ఆరగించండి," అన్నాడు చిరుతొండడు.


"నీ భార్యను కేకపెట్టమను. పిల్లవాడు వస్తాడు," అన్నాడు ముసలివాడు.

తిరువెంగనాంచి, "నాయనా, సిరియాలా ! రారా !" అని కేకపెట్టింది.

సిరియాలుడు పరిగెత్తుకుంటూ వీధిలో నుంచి లోపలికి వచ్చాడు.

చిరుతొండడు వృద్ధదంపతుల కేసి తిరిగే సరికి అతనికి పార్వతీ పరమేశ్వరులు అసలు రూపంలో కనిపించారు ! వారు అతని శివభక్తికి మెచ్చుకుని, అతని పూర్వ జన్మ కథ తెలిపారు.






శివలీలలు



# శివలీలలు

## 5

దక్షిణాన పొత్తపినాడు అనే ప్రాంతంలో అరణ్యం ఉండేది. అందులో శబరులు ఉంటూ ఉండేవారు. ఉడుమూరు అనేది వాళ్ళ ముఖ్యనగరం. ఆటవికులైన శబరులు వేటాడీ, వ్యవసాయం చేసీ జీవిస్తూ ఉండేవారు.

శబరులకు రాజు నాథనాథుడు. అతని భార్య పేరు తండె. వారికి తిన్నడు అనే కుమారుడు కలిగాడు. వాడు పెద్దవాడవుతూ, విలువిద్య నేర్చుకున్నాడు. వాడికా విద్య పుట్టుకతోనే వచ్చినట్టు కనబడింది. ఎందుకంటే, విల్లు పట్టుకున్న నలభై రోజులకే వాడు అరణ్యంలో పరిగెత్తే లేడినీ, ఆకాశంలో ఎగిరే పక్షినీ కొట్టగలిగాడు.

శబరులు తమ రాజుతో తిన్నడికి వేట విద్యలు నేర్పాలన్నారు. ముందుగా శబరులందరూ శివుడికి పూజలు చేసి, వేటలు బలి పెట్టి, తాగి తందనాలాడి ఉత్సవం జరిపారు. మర్నాడు శబరరాజు తన కొడుకు వెంట వేటకు వెళ్ళవలిసిన వారిని ఎన్నుకుని, వేటకు కావలిసిన ఉచ్చులూ, వలలూ, కుక్కలు మొదలైన జంతువులూ సిద్ధం చేశాడు. పెద్ద సన్నాహంతో తిన్నడు తన జాతి వాళ్ళను వెంట బెట్టుకుని తిరుపతి కొండల కేసి బయలుదేరాడు.

వేట చాలా విజయవంతంగా సాగింది. శబరులు రకరకాల అడవి జంతువులనూ, పక్షులనూ చంపారు; మాంసం ముక్కలు పుల్లలకు గుచ్చి కాల్చి, అడవి తేనెతో కలిపి తిన్నారు. ఈ విధంగా వన్యమృగాలను వేటాడుతూ వాళ్ళు చాలా రోజులు అడవిలోనే మకాం పెట్టారు.

ఒకనాడు తిన్నడు వేటాడి అలసి, ఒక పొగడచెట్టు నీడలో పడుకుని నిద్రపోయాడు.

అట్ట చివరి బొమ్మ



ఆ నిద్రలో వాడికి ఒక కల వచ్చింది. కలలో ఒక మహాపురుషుడు కనిపించాడు. ఆ మనిషి ఒంటి నిండా విభూతి పూసుకుని, పులితోలు కట్టుకుని, ఎర్రటి జెడలు వేళ్ళాడుతూ, భుజాన పుర్రెలమాల ధరించి, మెడలో లింగాన్ని ధరించి ఉన్నాడు. ఆయన తిన్నడితో ప్రేమగా, "అబ్బాయీ, ఇక్కడ కొండ పక్కన, సువర్ణముఖినదీ తీరాన, మర్రి చెట్టు కింద శివుడున్నాడు. అక్కడికి వెళ్ళి పూజించు, నాయనా!" అని చెప్పి, అంతర్ధానమయాడు.

తిన్నడు అదిరిపడి నిద్రలేచి, ఆశ్చర్యంతో నాలుగు దిక్కులా చూశాడు. తన తోటి వాళ్ళు వేటలో నిమగ్నులై ఉన్నారు. వాళ్ళ ఈలలూ, కేకలూ వినిపిస్తున్నాయి. అంతలో ఒక అడవిపంది వేటగాళ్ళను తప్పించుకుని, గుర్రుగుర్రు మని అరుస్తూ, పరిగెత్తుకుంటూ రావటం తిన్నడి కంట పడింది. వాడు దాన్ని కొట్టటానికి వెంట తరిమాడు. ఆ అడవి పంది వాడికి అందకుండా పరిగెత్తుతూ, చాలాదూరం తిప్పి, అకస్మాత్తుగా అదృశ్యమయింది.

అది మాయమైన చోటనే శివాలయం ఉన్నది. కలలో తిన్నడికి కనిపించిన మహాపురుషుడు చెప్పినది ఈ శివుణ్ణి గురించే. అందుచేత జరిగినదంతా శివమాయ అని గ్రహించి తిన్నడు ఆనందబాష్పాలు రాల్చుతూ ఆ లింగానికి సాష్టాంగ నమస్కారం చేసి, "స్వామీ, ఈ కొండ ప్రదేశంలో పులులూ, సింహాలూ సంచరించే చోట, ఏటి ఒడ్డున ఎందుకు కూర్చున్నావు? నీకు ఆకలి అయితే తిండీ, నీరూ ఎవరు తెచ్చిపెడతారు? మా ఉడుమూరికి రావయ్యా! చిన్నక్కలూ, పెద్దక్కలూ నీకు పందిమాంసమూ, దుప్పిమాంసమూ, పిట్టలమాంసమూ కమ్మగా వండి పెడతారు; రకరకాల బియ్యాలతో పాయసం వండి పెడతారు; రకరకాల తేనెలూ, పళ్లూ నీకు లభిస్తాయి. మా వూరికి వచ్చెయ్యి. నా వెంట వచ్చావా సరేసరి, లేకపోతే నేను ఇక్కడి నుంచి కదలను," అన్నాడు.

ఇంతలో మిగిలిన శబరులు తిన్నణ్ణి వెతుక్కుంటూ వచ్చి, "తిన్నా, నువు తరిమిన అడవిపంది ఏమయింది?" అని అడిగారు. శివధ్యానంలోవున్న తిన్నడు మాట్లాడలేదు. వాళ్ళు అతన్ని ఇంటికి పోదాం పదమన్నారు.

"ఈ శివుడు నా వెంట వస్తేగాని నేను ఇక్కడి నుంచి కదలను. మీరు వెళ్ళండి," అన్నాడు తిన్నడు. అతను తిరిగి శివధ్యానంలో పడిపోవటం చూసి శబరులు వెళ్ళిపోయారు.

"పాపం, శివుడు ఎంతకాలంగా పస్తులుంటున్నాడో!" అనుకుని తిన్నడు విల్లు భుజాన పెట్టుకుని వెళ్ళి, అడవి పందిని చంపి, మాంసం ముక్కలు కాల్చి, సువర్ణముఖిలో నీరు తెచ్చి, అంతా శివుడి ముందు పెట్టి, "ఆరగించు!" అన్నాడు.

దానికి శివుడు జవాబియ్యలేదు. "నువు తినకపోతే నీ పాదాల దగ్గిరే ప్రాణాలు విడుస్తాను," అంటూ తిన్నడు ఏడవటం మొదలు పెట్టాడు.

శివుడు అతని భక్తికి మెచ్చి, "లే, బాబూ! అలాగే తింటాను," అని, తిన్నడు పెట్టినదంతా తినేశాడు.

ఇలా కొంతకాలం గడిచింది. ఒకనాడు శైవుడైన బ్రాహ్మణు డొకడు శివగోచరు డనే వాడు ఆ గుడికి వచ్చి, "ఈ ఎంగిలి పుల్లలేమిటి? స్వామీ, నీ ఆలయాన్ని ఇలా ఎవరు మైల పరిచారు? చెప్పకపోయావో, తిండిమాని ప్రాణాలువిడుస్తాను," అన్నాడు.



"కంగారుపడకు. ఒక ఆటవికుడు తన ధోరణిలో నన్ను మహాభక్తితో కొలుస్తున్నాడు. వాడి పూజను నేను స్వీకరిస్తున్నాను. వాడి భక్తి చూడ గోరినట్టయితే నా వెనక పక్క కనపడకుండా దాక్కో!" అని శివుడు పలికాడు.

అంతలోనే తిన్నడు గుడికి వచ్చి, లింగం ముందున్న ఎంగిలి కాలితో ఒక పక్కకు తోసి, నీళ్ళు పుక్కిలించి లింగం మీద అభిషేకించి, పత్రి పెట్టి, తినమని మాంసం ముక్కలు శివుడి ముందు పెట్టాడు.

శివుడు తిన్నడి భక్తిని పరీక్షించాలని, వాడు పెట్టిన ఆహారం తినక, మూసిన కంటి నుంచి నీరు కార్చ నారంభించాడు. అది చూసి తిన్నడు ఆందోళనపడి కంటికి చికిత్సలు చెయ్యసాగాడు. వాడు తనకు తెలిసిన చికిత్సలూ, విన్నవీ ఎన్నో చేశాడు. అవేవీ పని చెయ్యకపోగా శివుడి కంటి నుంచి నెత్తురు కారసాగింది.

ఏం చెయ్యటానికీ పాలుపోక తిన్నడు, "కంటికి కన్నే మందు!" అనుకుని, తన కన్ను ఒకటి తీసి, శివుడికి కన్నుగా అమర్చాడు.

వెంటనే శివుడి రెండో కంట నుంచి రక్తం కారసాగింది.

"భయం లేదు. దానికి కూడా చికిత్స నా దగ్గిర ఉన్నది." అంటూ తిన్నడు తన రెండో కన్ను పెకలించబోతూండగా శివుడు, "ఆగు! ఆగు!" అంటూ తిన్నడి చెయ్యి పట్టుకుని, వాడి ఎదట ప్రత్యక్షమయాడు.

ఆయన బ్రాహ్మడితో, "శివగోచరా! చూశావు గదా ఈ పామరుడి భక్తి! నీకు నచ్చింది కద!" అని, ఆ బ్రాహ్మణ్ణీ, తిన్నడినీ ఎదురుగా పెట్టుకుని, "మీకేం వరం కావాలి?" అని అడిగాడు.

"మీకు తోచిన వరం ఇవ్వండి. మేమా అడిగేవాళ్ళం?" అంటూ ఇద్దరూ శివుడి ముందు సాష్టాంగ పడ్డారు.

శివుడు వారిభక్తికిమెచ్చి, వారిని తిరిగి ప్రాపంచిక విషయాలలో పడనివ్వక, ఇద్దరినీ తనలో చేర్చుకున్నాడు.



CHANDAMAMA (Telugu) MAY 1973 Regd. No. M. 4854




శివలీలలు



# శివలీలలు

## 6

వీరసంగమయ్య అనే అందమైన యువకుడు ఉండేవాడు. అతను శివభక్తుడు. శివుణ్ణి శరభసాళవ రూపంలో ఆరాధిస్తూ ఉండేవాడు.

అతనికి పెళ్ళి చేసే ప్రయత్నంలో ఉన్న అతని పెత్తండ్రి ఓంకారపురం వెళ్ళాడు. అక్కడ ఆయన బావమరిది ఒకాయన ఉన్నాడు. ఈ బంధువు చాలా ధనవంతుడూ, శివభక్తుడూనూ. బావమరుదు లిద్దరూ ఒకరి నొకరు చూసుకుని పరమానందం చెంది, కౌగలించుకున్నారు. అతిథికి భోజనాదికాలు ముగించి, గృహస్థు అతనితో, "బావా, ఏం పని మీద ఇలా వచ్చావు?" అని అడిగాడు.

"శుభకార్యం నిమిత్తమే వచ్చాను. మన వీరసంగమయ్యకు పెళ్ళియీడు వచ్చింది. తగిన పిల్ల కోసం చూస్తూ మీ ఓంకారపురం వచ్చాను. నాకు చూడగా, నీ కూతురు చంద్రిణీదేవి వీరసంగమయ్యకు తగిన భార్య అనిపిస్తున్నది. మీ కేమీ అభ్యంతరం లేకపోతే ఇద్దరికీ ముడి పెట్టెయ్యవచ్చు," అన్నాడు అతిథి.

గృహస్థు పరమానందభరితుడై, "అదేం మాట, బావా? వీరసంగమయ్య కన్న మంచి వరుడు ఎక్కడ దొరుకుతాడు? నువే ముహూర్తం నిర్ణయించి, ఉభయపక్షాల బాధ్యతా మీద వేసుకుని వివాహం జరిపించు," అన్నాడు.

అప్పటికప్పుడే వివాహ ముహూర్తం ఏర్పాటయింది.

ఓంకారపుర రాజు భాస్కరుడు ఒక నాడు వాహ్యాళి నుంచి తన ఇంటికి తిరిగి వస్తూ, తమ ఇంటివాకిట నిలబడి ఉన్న చంద్రిణీదేవిని చూసి, ఆమె అందానికి

అట్ట చివరి బొమ్మ



మోహపరవశుడై ఆగి, ఆమె కేసి తేరి పార చూడసాగాడు. ఆ సంగతి గమనించి చంద్రిణీదేవి చప్పున లోపలికి వెళ్ళింది.

రాజు ఆమెను గురించే ఆలోచిస్తూ తన ఇంటికి పోయి, మంత్రులను పిలిచి, ఫలాని పిల్లను తనకు పెళ్ళి చెయ్యమని చెప్పాడు. భాస్కరుడి మంత్రులు చంద్రిణీదేవి ఇంటికి వచ్చి, ఆమె తండ్రితో, "ఏమయ్యా నీ అదృష్టం! నీ కుమార్తెను రాజుగారి కిచ్చిచెయ్యి. ఆమెకు రాణి అయే యోగం పట్టింది," అన్నారు.

దానికి ఆయన, "నిజమే. మా అమ్మాయికి రాజుగారు భర్తగా కావటం కన్న మహా భాగ్యం ఏ మున్నది? కాని, వ్యవహారం చెయ్యిదాటి పోయింది. పిల్లను ఒకరికి ప్రధానం చేసేశాను," అన్నాడు.

మంత్రులు వెళ్ళి రాజుతో ఈ మాట చెప్పారు. రాజు తన ఆప్తులనూ, మిత్రులనూ పిలిచి, "మీరు ఎలాగైనా చంద్రిణీ దేవిని నాకు భార్యగా చెయ్యకపోతే నా ప్రాణాలు పోతాయి," అన్నాడు.

వాళ్ళు రాజు తరఫున చంద్రిణీదేవి తండ్రి వద్దకు వచ్చి, "ఎంత వెర్రివాడి వయ్యా? అదృష్టం తన్నుకు వస్తుంటే అడ్డు పెడతావేమిటి? రాజుగారు తానై నీ కూతురిని చేసుకుంటా ననటమేమిటి, నువు కాదనటమేమిటి! పిల్లను రాజుగారి కిచ్చి పెళ్ళి చేసెయ్యి." అన్నారు.

దానికి ఆయన, "రాజుగారు అల్లుడు కావటం ఎంతటి మహాభాగ్యమో నాకు మీరు చెప్పాలా? కాని భోగభాగ్యాలకు ఆశ పడి నేను మాట తప్పితే మీరే నన్ను నిందించరా?" అన్నాడు.

వాళ్ళు రాజు వద్దకు వెళ్ళి, "మీరు ఈ పిల్లను మరిచిపొండి. అందమైన కన్యలకులోటా? ఆమె తండ్రి ప్రవర్తన నిజంగా ప్రశంసనీయం!" అని చెప్పారు.

వాళ్ళను పంపేసి రాజు తానే ఒంటరిగా బయలుదేరి చంద్రిణీదేవి ఇంటికి వచ్చాడు.

రాజు వస్తూ ఉండటం చూసి చంద్రిణీ దేవి తల్లిదండ్రులు బెదిరిపోయారు.

చంద్రిణీదేవి వారితో భయపడ నవసరం లేదని చెప్పి, ఒంటరిగా ఎదురువెళ్ళి, "అన్న గారికి నా మీద ఏమి ఇలా దయకలిగింది?" అంటూ రాజును ఆహ్వానించింది.

"నిన్ను కోరి వచ్చినవాణ్ణి అలా సంబోధించటం అన్యాయం కాదా? నన్ను కోరి వచ్చే స్త్రీలు ఎందరో ఉండగా నాకు నీ మీద మనసుకలిగింది. నిన్ను చూసినక్షణం నుంచీ నేను విపరీతమైన విరహతాపం పొందుతూ, మరొకతె కేసే చూడలేకుండా ఉన్నాను. నిన్ను మహారాణిని చేసి, మిగిలిన రాణులందరితో బాటు నేను కూడా నీ సేవ చేస్తాను," అన్నాడు రాజు.

"రాజా, నన్ను వీరసంగమయ్యకు ఇచ్చిన క్షణం నుంచీ అతనినే భర్తగా ఎంచుకుంటున్నాను. ఆడదానికి ఇద్దరు భర్తలు ఎలా సాధ్యపడతారు?" అన్నది చంద్రిణీదేవి.

"నీ కోసం తపించి పోతున్నవాడికి ఈ ధర్మపన్నాలు ఎందుకు చెబుతున్నావు?" అని రాజు ఆమెను అడిగాడు.

తాను తన పట్టు పదిలినట్టు కనబడక పోతే రాజు ఏమైనా చెయ్యగలడని గ్రహించి, శివుడిపైనే భారం వేసి, చంద్రిణీదేవి రాజుతో, "నేను మీకు భార్య కావటమే ఈశ్వరాదేశం అయితే అలాగే కానియ్యండి. పెళ్ళికి ముందు వారంరోజులు నిష్ఠతో ఈశ్వరా



రాధన చెయ్యటం మా వంశాచారం. ఇవాళే వ్రతం ప్రారంభిస్తాను," అన్నది.

రాజు సంతోషంతో వెళ్ళిపోయాడు.

చంద్రిణీదేవి తనకూ, రాజుకూ మధ్య జరిగినదంతా తల్లి దండ్రులకు చెప్పింది. వాళ్ళు ఈ విషయమంతా తెలుపుతూ వీర సంగమయ్యకు లేఖ రాశారు. అతను పెద్దల అనుమతితో వచ్చి, రహస్యంగా చంద్రిణీ దేవిని పెళ్ళాడి, గుర్రం మీద తన భార్యతో సహా తన ఊరికి బయలుదేరాడు.

ఈ వార్త చారులవల్ల రాజుకు తెలిసింది. చంద్రిణీదేవి తనను మోసం చేసినందుకు అతను మండిపడి, తన సైనికును పిలిచి, "మీరు వెళ్ళి, వీరసంగమయ్యను చంపి,

చంద్రిణీదేవిని తీసుకురండి," అని ఆజ్ఞాపించాడు.

ముందుగా బయలుదేరిన సైనికులు వస్తూ ఉండటం చూసి సంగమయ్య, ఒంటరిగా తాను సైనికులను ఏమీ చేయలేడు గనక, తన ఇష్టదైవమైన శరభావతారుణ్ణి ధ్యానించాడు.

వెంటనే శరభసాళువ భయంకరాకారం ప్రత్యక్షమై, అగ్నేయాస్త్రంలాంటి ఆయుధాన్ని వీరసంగమయ్య కిచ్చి, "దీనితో శత్రువులను పరిమార్చు," అని చెప్పి అంతర్ధానమయింది.

వీరసంగమయ్య తనచేతిలో కత్తి ఉండటం చూసి మహానందం చెంది, దానితో సైనికులను ఎదుర్కొని, ఎడాపెడా వధ చెయ్య నారంభించాడు. ఇదంతా గుట్టమీద నిలబడి చూస్తూ రాజు నిర్ఘాంతపోయాడు.

ఇంతలో వీరసంగమయ్య తన కరవాలాన్ని ఒక శివభక్తుడి పై విసరబోయి, అతన్ని గుర్తించి, తలవంచి నమస్కారం చేశాడు. ఇది గమనించిన రాజు, వీరసంగమయ్య శివభక్తిని ఆధారం చేసుకుని అతన్ని చంపే ఉద్దేశంతో తాను కూడా శివభక్తుడి వేషం వేసుకుని, కొండదిగి వీరసంగమయ్యను చేరి, అతను తలవంచి నమస్కరించగానే మెడమీద తన కత్తితో దెబ్బవేశాడు. ఆ కత్తి పూలహారమై వీరసంగమయ్య మెడలో పడింది.

ఆ క్షణంలోనే శివుడు వృషభవాహనం మీద ప్రత్యక్షమై, వీరసంగమయ్యను వరం కోరమన్నాడు. తనకూ, తన భార్యకూ, రాజుకూ, పెళ్ళివారికీ శివసాయుజ్యం ఇప్పించమన్నాడు వీరసంగమయ్య.


"నీకు అపకారంచెయ్యదలచిన ఈపాపిష్టి రాజుకు శివసాయుజ్యం ఇయ్యమంటావా?" అని శివుడు వీరసంగమయ్యను అడిగాడు.

"మహాదేవా, ఈ రాజు శైవచిహ్నాలు ధరించి నిన్ను కళ్ళారా చూశాడు. ఇంకా ఇతనిలో పాపాలు ఎక్కడివి?" అన్నాడు వీరసంగమయ్య.

శివుడు సంతోషించి అందరినీ తన వెంట కైలాసానికి తీసుకుపోయాడు.



CHANDAMAMA (Telugu) JUNE 1973 Regd. No. M. 4854




శివలీలలు